జనవరి

1975

భారతి

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక ...గేశ్వరరావు పం...లు

శ్రీలక్ష్మి ప్రొడక్షన్స్

దేవుడు చేసిన పెళ్లి

స్క్రీన్‌ప్లే దర్శకత్వం తాతినేని రామారావు

నిర్మాత ఎ. పూర్ణచంద్రరావు

లక్ష్మీ ఫిలింస్

KCVA104M11

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

జనవరి 1975

సంపుటము : 52 : సంచిక : 1 :

విడిపత్రిక వెల రూపాయిన్నర


తెలుగు వెలుగులు
ఒకప్పుడు తెలుగుసీమ పల్లెల్లో
మిడిసి పడుతూ మిణుగురులు
మిలమిలా మెరిసేవి
ఈనాడు విద్యుద్దీపాల వెలుగుల్లో
సిగ్గుతో ముడుచుకుపోయి
వెలవెల పోతున్నాయవి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ హైదరాబాదు

స్వ వి ష యం

1974 లో ప్రపంచ అంతటా పెద్ద మార్పులు ఎన్నో వచ్చాయి. ఈ మార్పుల ప్రభావం కొంత ఇప్పటికే బయటపడింది కాని ఇంకా ఎటువంటి పరిణామాలు వస్తాయో కాలమే తెలుపగలదు. పెట్రోలు సంక్షోభం ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అయోమయ పరిస్థితి ఏర్పడింది. సంపన్నదేశాలే ఇబ్బందులలో ఉన్నప్పుడు వెనుకబడిన దేశాల సంగతి వేరే చెప్పనవసరంలేదు. ఆహారధాన్యాల కొరత అన్ని కొరతలలోనూ భయంకరమయినది. పెట్రోలు సంక్షోభం ఫలితంగా ఏర్పడిన ఇబ్బందులు కొన్నిచోట్ల వర్షాలు బాగా కురవక పోవటంవలన వచ్చిన ఇబ్బందులని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. భారతదేశంలో అధికారంలో ఉన్నవారు తమ విధానాలని గురించి పునరాలోచన చేస్తున్నారనటానికి నిదర్శనాలు లేకపోలేదు. సామాన్యప్రజలకి ఎక్కువ మేలుచేసే విధానాలని అనుసరించటానికి వారు ఏమాత్రం వెనుదియ్యరాదు. సాహిత్యసేవ చేసేవారు కూడా తక్కినవారిలాగే ప్రస్తుత పరిస్థితుల ప్రభావానికి లోనుకాక మానరు. ఇటువంటి కాలాలలోనే వారి ప్రతిభ ఎన్నో విధాలుగా వ్యక్తం కావటానికి అవకాశాలు కలుగుతూ ఉంటాయని అంటే సత్యదూరం కాకపోవచ్చు; భారతి ఎప్పటివలెనే సాహిత్యసేవకి అంకితం అయిఉంటుంది. ఈ సాహిత్యసేవలో అందరి సహకారమూ లభించగలదని కూడా భారతి ఎప్పటివలెనే ఆశిస్తోంది.

విషయానుక్రమణిక

జనవరి 1975

ఆదిత్య వలయం	శ్రీ మాదిరాజు రంగారావు	1
ఈనాటి కవిత	శ్రీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ	3
అంకితం	శ్రీ కె. శివారెడ్డి	12
ధూర్తవిట సంవాదము	'రజని'	13
ముద్రణాలయంలో ముప్పు	శ్రీ వేలూరి సహజానంద	23
బ్రతుకు తెరువు	హిందీ మూలం: డా. మహీప్‌సింగ్ అనువాదం: శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ	24
కొత్త కోకిల	శ్రీ గడియారం శేషఫణి శర్మ	28
త్రిశంకుడి స్వర్గం	శ్రీ మధురాంతకం రాజారాం	29
నిత్యయౌవనం సాధ్యమా?	శ్రీ కాసుఖేల నరసింహారావు	33
బనగానపల్లిలో బ్రహ్మముగారు	శ్రీ పులిచెర్ల సాంబశివరావు	37
తెలుగు కన్నడ ఛందోరీతులు: ఏకత్వములోని భిన్నత్వములు	శ్రీ సంపత్కుమార	41
కలగూరగంప		54
గ్రంథ విమర్శలు		59

ఆదిత్య వలయం

శ్రీ మాదిరాజు రంగారావు

సూర్యగోళ హృదయంతో
ఇది.
చావులేని ప్రపంచం.
ఎంతకాలం నుండో
ఉన్ముఖీకృతమైన మనస్సు
పొందుతూంది ఈ క్షణం
వాక్ అతీతమైన అనుభవం.

కాలానికి దీప్తినిచ్చే
ఆదిత్య తేజోరాశితో
ప్రకాశిస్తోంది జీవితం,
తెర తొలగిన వర్ణచిత్రం వలె.

కరగింది లౌకిక భావన
పరిమళాంచిత కర్పూరమై.
మిగిలింది లౌకిక రూపం
సౌవర్ణ కళాప్రశస్తమై.

ఆలోచన కదలుతోంది
అవ్యాహతంగా నిబిడంగా
ఆర్ద్రమై, సముద్రంపై
వీచే పవమాన పంక్తి వలె.

జడంలో నిదురిస్తూ
ప్రాణిలో కదలుతూ
హృదయంలో రాగంతో
కదలే శక్తిరూపం,
ఆకాశాన్ని త్రోసికొని వచ్చేది.

భూమిని చీల్చుకొని పోయేది
ఒదిగింది అణ వణువునా
అంభోబిందు లోల సముద్రమై.

వెలుగు కళ్ళనుండి
రాలుతూ నవ్వుపూలు
ఎత్తిన గగన వదనం వలె
ఉంది హృదయం, ఈ సమయం

చావును వదలేసింది ఊహ
చీకటిని వదలిన ప్రభాతం వలె.

* *

మట్టిలో ఆడుకునే పిల్లడికి
వీధిలో దొరికిన ఆట ఎస్తువు వలె
కలిగిస్తుందీ ఉద్వేజిత క్షణం,
స్వర్గం కన్నా మహితమైన ఆనందం.

చీకట్లో నిన్నటి వరకూ
మిణుగురుల వలె మెరసిన కళ్లు
మారాయి ఇపుడు—
సూర్య చంద్ర బింబాలుగా.

ఇక్కడ తల ఎత్తినవి
భగవంతుని ముఖాలే !
ఇక్కడ పూచినవి
భగవంతుని ఆలోచనలే !

వైకుంఠమూ కైలాసమూ రెండూ
రెండు భుజాలపై నిలచినట్లుంది,
ఆవహించింది చైతన్యం
గాంగ ఝరీ సదృశంగా.

ఆకాశాన్ని వంచి
భూమిని అణచి—నిల్చిన
శక్తికి సంకేతంగా,

వర్తమాన శిఖరంపై
నిల్చిన నా మతిలో—
అనంతమైన గతమూ భవిష్యత్తూ
ఒకే రూపానికి రెండు ముఖాలుగా,

తెరచుకొంది ఈ క్షణం
హిరణ్మయోజ్వల కవాటం !
ఓంకార నాద సుందరంగా
హృదయ స్పందన లయతో.

ఎగసి ప్రాలింది ఉషస్సు
నా ముఖంపై శాశ్వతంగా
అవతరించింది షట్పదమై
నా ఊహలో ఝుంకృతిలో.

2

పెంచింది వాయుమండలం
చెవులు చాచి ఆహ్వానిస్తూ,
పొంగింది సముద్ర వలయం
ముగ్ధ వేళ్లపై నిరీక్షిస్తూ.

తొలకరి వానకు ముందుగా
వీచే చల్లని గాలికి తలెత్తి,
ఒళ్ళు మరిచి ఊగే
వనం వలె ఊగె మనస్సు.

ఎండిన నదిలోని ఇసుక వంపులవలె
మలపులు తిరిగిన విషాదం
ఒక్కమారు మాయమైంది
వర్షధారా సంభరిత నదివలె.

గమ్యం చేరడానికి
తహ తహతో సుళ్ళు తిరిగే
తుపాను గాలి శాంతించిన
ఆకాశంవలె ఉంది మనస్సు.

చీకటికి తెలీదు
సూర్యుని ప్రకాశ హృదయం,
గుహలకూ పిచ్చుక గూళ్లకూ
తెలీదు ఆకాశ వైశాల్యం.

చీకటినుండి గుహనుండి
బయటపడిన మనస్సుకు
తెలుస్తుంది అంతో ఇంతో.

మేఘ జీవన సందేశం
వినాలని చెవులు రిక్కించిన దిశలూ,
సూర్యుని కల్యాణ రూపం
చూడాలని కళ్లు పరచుకొన్న ఆకాశమూ,
అవనతమైనాయి నా ఎదలో
సంక్లుప్తమైన రూపంతో.

ఈశ్వర సంకల్పాన్ని
ప్రదర్శించిన మహాశక్తి
ప్రకృతినుండి మనస్సుదాటి
స్పృశిస్తోంది ఆత్మసీమలు,

అమృతధామంనుండి
వచ్చే వసంత కిరణాలకు
పునస్సంజీవితమై
వెలుగుతోంది నా రూపం.

సృష్టి ప్రథమ రూప
వాసనా బీజంనుండి
బ్రతుకులోని శిఖరభూత
సంస్కార వృక్షంవరకూ,
ప్రకృతిలోని రూప వికాసం
ప్రాణిలోని జీవస్పందనం,
దివ్యదశకు చేర్చే విజ్ఞానం
ఎప్పటికపుడు నవోహాలో
పొందే పరిణామ రేఖలతో
పునారూపం పొందుతూంది
ఉజ్వల సిద్ధితో మనస్సు.

అస్తమయం ఎరుగని
ఆదిత్య కిరణాలు
ప్రసరిస్తున్నాయి నాలోకి
వైవర్ణ్యం ఎరుగని
చాంద్రీ రాగం
పరచుకొంది ఒక ప్రక్కగా.

నేనీక్షణం
అనేక వాసంత సూర్యుల
కల్యాణ కాంతికి
సంకేత స్థానం,

నేనీ క్షణం
అనేక రస ప్రవాహాల
ఆనంద నృత్యావికి
అవనీ చక్రం.

ఈనాటి కవిత

శ్రీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ

ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క భావన ఆనాటి కవితా గుణంగా చలామణీలోకి వస్తుంది. అంతకు మునుపు ఆదరాన్ని అనుభవించిన భావనలు సైతం ఆచరణలో ఉన్నప్పటికీ, వాటిని త్రోసిరాజని క్రొత్తగా వచ్చిన భావననే ఆనాటి కవితా గుణంగా చారిత్రక విమర్శకులు గణించడం కద్దు. మరి ఈనాటి ఆంధ్ర కవితా గుణం ఏమిటి ? అన్న ప్రశ్నకు సూటైన సమాధానం—'విప్లవం' అనడమే.

ఆధునిక తెలుగు కవితా ప్రస్థానంలోని నాలుగవ మజిలీగా 'విప్లవ కవిత'ను అభివర్ణించ వచ్చును. కాల్పనిక, అభ్యుదయ దిగంబర మజిలీలు గడిచి విప్లవ మజిలీకి వచ్చింది ఆధునిక తెలుగు కవిత. కాస్త లోతుగా చూశామంటే, ఈ మునుపటి మూడింటి ప్రభావాలు కూడ ఈ నాటి కవితలో ఉన్నాయి. కాల్పనిక కవిత్వ ప్రభావంగా 'ఆత్మీయతా' ధోరణి, అభ్యుదయ కవితా ప్రభావంగా మిగిలిన ప్రయోగచాతురి, దిగంబర కవిత ప్రభావంగా మిగిలిన నగ్నావిష్కరణ, అతి తీవ్రమైన ఆవేశంతో కలిసి విప్లవ కవితలో సాక్షాత్కరిస్తున్నాయి. అయితే విప్లవ కవిత స్వభావం - తత్త్వం—ఏమిటి ? అన్న మాటకు నిక్కచ్చి అయిన సమాధానం లేదు. విప్లవ కవితకు ఇంకా స్వయంవ్యక్తిత్వం సమకూరడం లేదన్నమాట సత్యమే. అభ్యుదయ కవితనుండి విప్లవ కవిత ఎలా వేఱుపడుతోంది ? అన్న ప్రశ్నకు గుణ రీత్యా చెప్పుకోదగ్గ సమాధానం దొరక్కపోవడం వాస్తవమే. కాని దీనికి కారణం ఏమిటి ?...విప్లవ కవితల్ని వ్రాస్తూ, 'మాది క్రొత్త కవిత్వం. మేం ఇంతకు మునుపటి కవులలాంటి వారం కాము. విప్లవ కవులం' అని తమక్కు తామే అభివర్ణించుకొనే కవులు, ఇంకా జీర్ణమైపోయిన పూర్వ కవితల ప్రభావం నుండి పైకి తేలక పోవడమే.

విప్లవ కవుల వర్గానికి గొప్ప వాక్ప్రోదకుడుగా—అభివక్తగా వ్యవహరించే కె. వి. రమణా రెడ్డిగారు 'క్రమం తప్పడంలో కూడ క్రమం ఒకటి ఉంది' అంటూ వ్రాసిన కవితలోని ఈ మాటలు గమనింప తగ్గవి :

'తారల మీటలు పంపే
తరళ రహస్య వార్తలు
వన వాయు ప్రసారిత
వినబడు సంకేతంబు...' ('ఝంఝు'నుండి)

ఎంత సామాన్యవిగ్రాహ్యి చేసినా, ఈ పంక్తుల్ని ఏ కాల్పనిక కవిత్వ లోపంగానో గురిస్తాము. ఈ తారలు, తరళ రహస్యవార్తలు. ఇవన్నీ దాదాపు నాయిసుందుల క్రిందటి పనస్వ వాసన. ఒక నవీన కవితను ఆవిష్కరించినప్పుడు, పూర్వ ప్రభావంనుండి వైదొలగడం, స్వయంప్రతిభకల నూతనమార్గాన్వేషణ, పదజాలాన్ని రూపొందించుకోడం ప్రధానమైన విషయం. కావ్యాభివ్యక్తిలో, పొయిటిక్ డిక్షన్ అన్న దానికి ప్రత్యేకమైన స్థానం ఉన్నది. ఒక తరం కవితను నిర్ధారించే విభిన్న సిద్ధాంతాల్లో ఈ పొయిటిక్ డిక్షన్ అన్నది ఒకటి. ప్రధానమైంది కూడాను... 'క్రమం తప్పడంలో కూడ క్రమం ఒకటి ఉంద'న్న కె. వి. ర., తనకు పూర్వమున్న సాహిత్యపరంపర క్రమాన్ని తప్పించి, మరో క్రొత్త కవితను ఆవిష్కరిస్తున్న సమయంలో, ఇంకో క్రొత్త క్రమాన్నికూడా ఏర్పరచుకోవాలన్న బలమైన అంశాన్ని మరచిపోయారు. 'నేను నిజంగా యెప్పటికీ ఉద్యమ కవినే' అంటూ చాటుకొన్న దాశరథిని చూసి కె. వి. ర., నవ్వింది సరిగ్గా ఇందుకే. ఈ కాల్పనిక వాసనకే. అభ్యుదయ కవులింకా కాల్పనిక వాసనలోనుండి తేరుకోక, అభ్యుదయం—సామాజిక విప్లవం అన్న మాటల్ని పడిగట్టు రాళ్లుగా మాత్రమే వాడుతున్నారన్నది, విరసం వారి ముఖ్యమైన ఆరోపణ. మరి— ఈ కాల్పనిక పద ప్రయోగాల గుబాళింపు మాటేమిటి ?

'ఈ కవిత
కనువిప్పును కలిగించే
రోచిస్సు
మహోషస్సు
ప్రభాసరస్సు'

అంటూ కె. ప్రభాకర దేవ్ అన్న రచయిత ఝంఝలో మరో కవితను రచించాడు. ఇది ఎందులో మునుపటి అభ్యుదయ కవిత్వంనుండి వేఱుపడింది? అసలీ మాటలకూర్పే మిగిలిఉన్న కాల్పనికతకు కొండ గుర్తు...రచయిత తన కవితాసీమలోనే బంధితుడయ్యి, తన కవితను గురించే పదేపదే యోచిస్తూ పలవరిస్తున్నారు కాని, చేబట్టిన మతాన్ని, దానికి కారణమైన వాస్తవాన్నీ పరిశీలించడం మానుకొన్నాడని వ్యక్తమౌతుంది. ఇది అనేకరకాలైన అహంకారాలలో ఒకటి. దీన్ని కవితాహంకారమని పిలవ్వొచ్చు. ఇది ఒకటోరకం రొమాంటిక్ లక్షణం. మరోమాటలో న్యూరాటిక్ లక్షణం.[1] ఈ అహంకారం భావకవితాయుగం లోని ప్రేమిక కవులసొత్తు కాని, సామాజి కవితాయుగం లోని కవిహామక సమాజ సేవకుల సొత్తు కాకూడదు. తన కవిత ఇలాటిది, అలాటిది అంటూ మింటికెగసి పోయేకవి, వాస్తవానికి చాలా దూరంలో ఉండిపోతున్నాడు. నిజానికి ఇది పలాయన వాదం. తన కవితాహంకారంతో మాత్రం తృప్తిపడుతూ కవి వాస్తవం నుండి పరారి చిత్తగిస్తున్నాడు. ఈ నవీన రచయిత ఇలాటి పాత చాదస్తాలన్నిటినీ త్రోసిపుచ్చి, వాస్తవాన్ని విశ్లేషించి, వేర్లతో క్రమ్మిన రోగాన్ని గుర్తించి, నివారణోపాయంగా తగిన వైద్యం చేయాలికాని, ప్రతిభావంతమైన వాస్తవిక చిత్రాల్ని గీయాలికాని, వాస్తవంలోని దుస్థితి పరిష్కరణకు మార్గదీపం చూపాలికాని, ఇలా తన కవితనుగూర్చి చంక లెగరేస్తూ 'మహాంకార పూరిత సామ్రాజ్యవాదుల ఆయువుపట్టును శోధించి ఛేదిస్తుంది' అంటూ వాపోవడంలో ఉపజ్ఞ అగుపించదు. కవి మాటల్ని విశ్వసించి, అతని పలుకుల్లో అడుగేసి నలుగురూ నడిచేది, అతనికొక తాత్త్విక ప్రజ్ఞ ఉన్నప్పుడే. ఈ తాత్త్విక ప్రజ్ఞ, వ్యాస్తి వివేచనా శక్తి ఉన్నప్పుడే సిద్ధించగలదు. అలా తాత్త్విక ఉన్నతికోసం కృషి చేసిన కవులు ఝంఝ సంపుటిలో ఇద్దరే ఇద్దరగుపిస్తారు. 'రైట్ టు ఓట్‌కాదు' అన్న కవితను వ్రాసిన లోచన. 'భయం'ను చిత్రించిన నిఖిలేశ్వర్. గడచిన పదేళ్లగా తెలుగు కవితారంగంలో నిఖిలేశ్వర్‌వంటి తాత్త్విక ప్రజ్ఞకల కవి, నిజమైన కవి మరొక్కరు రాలేదు. 'భయం' అన్న కవితలో ఒక పాత భావాన్నే సరిక్రొత్త రీతిలో గుండెల్లో కెక్కించి ఆలోచింప చేస్తాడు నిఖిలేశ్వర్. నిత్యభయంతో ఊపిరందక చావడంకంటె, ఒక్కక్షణం సాహసంలోనేయినా ఊపిరి పీల్చి బతికేందుకు విప్లవంలోకి రమ్మంటాడు నిఖిలేశ్వర్. కవితను మొత్తం చదివాక, ఎంత చాదస్తపు పాఠకుడైనా రెండు నిముషాలపాటు తన జీవితాన్ని తాను చూసుకోక విడువడు. అలా వ్యక్తి లోపలి జీవితంలోకి చూపును త్రిప్పేదే ఉత్తమ కవిత. 'నా దృష్టిలో రెండవసారి చదవాలనిపించేది, రెండవసారి చదివితే తప్ప అర్థం కానిది ఉత్తమ కవిత' అంటాడు ఆధునిక కవితకు ఆంగ్లంలో కవాటాల్ని తెరచిన టి. ఎస్. ఎలియట్[2]. కవితలో చెప్పిన భావం అంత సున్నితంగా నరనరాల్లోకి దిగిపోయి ప్రభావితం చేయాలి. అలాటి చైతన్యాన్ని నిఖిలేశ్వర్‌యొక్క ఎంత చిన్నని కవితైనా కలిగించగలదు. 'భయం'లాటి కవితను చదివినప్పుడే చటుక్కున విప్లవకవిత స్వయంవ్యక్తిత్వం ఎలాంటిదో స్పష్టస్పష్టంగా స్ఫురించగలదు. అందరు కవులూ ఇలాగే తాత్త్విక ప్రజ్ఞతోటి వ్యవహరించి ఉంటే, విప్లవ కవిత, ఆధునికాంధ్ర కవిత్వంలో గొప్ప ప్రకరణంగా రూపుధరించి ఉండేది.

నిఖిలేశ్వర్ లాగే విరసంలో భాగస్వామ్యం స్వీకరించిన వ్యక్తి నగ్నముని. ఈయనొక నర్తన స్వామి. దుర్గంధం కొట్టే ధూళిపట్టిన గదిలో ఒక్కడే చేరి విలయనృత్యం చేసే స్వభావం ఈయనది. సకృత్తుగా ఎక్కడో ఒకచోట కాసంత చక్కని భావన కనుపించినా, వెను వెంటనే ఊకదంపుడు లాగ క్రమ్ముకొచ్చే వాక్పాటవ ప్రదర్శనం నగ్నమునిని కవిగా కాక, శబ్ద నర్తనం చిత్తగించే నట్టువకానిగా మాత్రం నిరూపిస్తుంది. 'జననం' అన్న కవితలో ఈయన వ్రాసిన ఈ మాటల్ని స్మరించక తప్పదు.

---

1. The [illegible] and Day dreaming అన్న వ్యాసంలో Freud, ఈ ఇద్దరి సమస్యల్నీ మరింత నిక్కచ్చిగా చర్చిస్తాడు.

2. Selected essays. Metaphysical Poets.)

'నపుంసకత్వం మన శత్రువు
యాచనతో పెంచిన శరీరంలో ప్రవహించేది
మూత్రం తప్ప రక్తం కాలేదు
....
నేల యోని చీలి
రక్త మాంస వీర్యాలతో
ఈ కుష్ఠు ఉచ్ఛిష్ఠ వ్యవస్థపై తిరగబడి'

ఈ మాటలెలా దిగంబర 'కవిత్వం' నుండి వేరు పడుతున్నాయి ? ఏ అయిడియాలజీ వల్ల, ఏ పడికట్టు ప్రయోగాలవల్ల దిగంబర కవిత పరాస్తమై, అటు పాఠకుల, ఇటు విమర్శకుల నిరాదరణకు పాత్రమైందో అదే అయిడియాలజీ—డిక్షన్ తప్ప పై కవితలో ఇంకోటి అగపడ్డంలేదు. ఇలాటి కవితల వల్ల, క్రొత్త పేరుతో క్రొత్త రూపంగా జనిస్తూన్న విప్లవ కవితకు పురిటిలోనే సంధి కొట్టే ప్రమాదం ఏర్పడిందన్నా వింత లేదు. అసలిలాటి పూర్వ వాసనల మయమైన కవితను 'నవ కవిత'గా చరిత్ర అంగీకరించలేదు. చారిత్రక పరిణామశీలాన్ని పుంజుకోదలచిన కవిత, ఇలాటి ప్రాత పుంతల్ని విడిచిపెట్టాలన్న విషయాన్ని విరసంనేతలు గుర్తించకపోవడం విస్మయంగా ఉంటుంది. ఇదే దిగంబర కవితను, ఇదే భావజాలాన్నీ, 69 లో కె. వి. ర. గారు—'ఇది కవిత్వం కాదు. కవిత్వం ఇర్రేషనలిస్టిక్ ప్రిమిటివిజమ్' అంటూ అభివర్ణించారు.[3] మరి దాన్నే తనలోభాగంగా చూపించిన విప్లవ కవితను గూర్చి మనాలి ? కవులకే వారు పోతున్న మార్గంపట్ల సక్రమమైన అవగాహన లేనప్పుడు, వారి కవితకు ఏమాత్రం సత్యం ఉండగలదు? అదెలాగ ఉద్యమం కాగలదు ? ఆనాటి ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో దిగంబరులగూర్చి అలాగన్న కె. వి. ర, రుంఝుం వ్రాసిన తొలిమాటలో కమ్యూనిస్టుల పేరుతో వ్యవహరిస్తూ దానికి వ్యతిరేకులుగాఉన్న కొందర్ని (?)గూర్చి ప్రస్తావిస్తూ— 'దేశంలోని కుళ్లునూ, కంపునూ వాటికి యోగ్యమైన బూతుమాటలతో బయటపడవేశారని దిగంబర కవులను పడదిట్టడం కూడ ఈ 'కమ్యూనిస్టుల' దృష్టిమాంద్యానికి మరొక నిదర్శనమైంది. ఈ కవులేమొ అరాచకవాదులుగానూ, మార్క్సిజం వాసన గూడ కిట్టని కవులేమొ మానవతా వాదులుగానూ వీళ్లకు కనిపించసాగారు' అంటూ పేర్కొనడం చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఇంతటి ఆశ్చర్యకరమైన ఆత్మ నైరుధ్యాన్ని ప్రకటించిన విమర్శకుడు బహుశః ఈ మధ్యకాలంలో ఇంకెవ్వరూ లేరనుకొంటాను. ఆనాడు స్వాతంత్ర్యానంతరమే తెలుగు కవిత శత ముఖాలుగా అభ్యుదయం సాగించిందన్న విమర్శకుడే, ఝంఝు తొలి మాటలో, అదే కవులను గురించి, నిరర్థకములైన శూన్యవాదమూ, వ్యక్తివాదమూ వగైరాలను చేపట్టి, 'సామాజిక వాస్తవంలోని అల్పిష్టి లక్షణాలనో, అశుభ్రాంశాలనో ఎప్పుడూ స్వీకరించి పీడ నడకలు పోసాగారు.' అంటూ ఖండిస్తూ సెలవిచ్చారు. ఈ ఆత్మ నైరుధ్యం విమర్శనలకే అయితే బాధలేదు. కవితల్లో కూడ ప్రదర్శించారు.

'ఉద్విగ్నత హృదినగ్నత
ఉత్సాహం వ్యామోహం
ఉన్మాదం జయనాదం
ఉల్లోలం కల్లోలం'

ఇందాక పేర్కొన్న 'క్రమం తప్పడంలో కూడ ..' అంటూ మొదలయ్యే కవితలోనివి మరికొన్ని పంక్తులివి. ఇందులో ఏమాత్రపు శాస్త్రీయ దృక్పథం అయినా వ్యక్తం అయిందా అన్నది మొదటి సందేహం. మూడు పదుల వెనుకటి ప్రయోగవాదుల పదచాపల్యం, దిగంబరుల ఆవేశం తప్ప అర్థమంటూ ఏదీ స్ఫురించడంలేదు. శిల్పదృష్ట్యా చూచినా ఎలాటి ఉదాత్తాశయం, పూర్వాపర అన్వయం కనపడవు. 'సంయమనం తోటి 'యు' అన్న భావన తప్ప ఇంకేదీ రాదు. ఇలాటి అశాస్త్రీయ పదప్రయోగ చాపల్యాలు. వాస్తవిక దృష్టికి చుక్కెదురుగా ఉండాల్సినవి. కవిత్వం - శాస్త్రీయ దృక్పథం వేరువేరే అని. నిన్నటి రీతిలో చెప్పాలనుకొన్నా, ఈనాడు ఆమాటకేసి నిదానించి చూసేవాళ్లు కూడ లేరు. శాస్త్రీయ ప్రజ్ఞకూ, కవిత్వానికి ఎలాటి నైరుధ్యమూ లేదని, ఉండకూడదని విజ్ఞులంతా ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చారు. పైపెచ్చు శాస్త్రీయవస్తువివేచన ఉన్నదే ఉత్తమ కవిత్వమన్నది, విప్లవ కవితాయుగంలోని మొదటి భావన. భావుకత్వం, పద చిత్ర నిర్మాణాది ప్రతిభా వ్యాపారం, శబ్దప్రయోగ చాతుర్యాది శిల్పకౌశలం కేవలం నిరర్థకాలన్నది రెండో భావన అలాటిది

3. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక—స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంపై వ్రాస్తూ.

బూర్జువా కవిత్వమని క్రిస్టఫర్‌కాడ్వెల్ వంటి విమర్శకుడే పేర్కొన్నాడు. 'వ్యవహార పదసంపదలకి దూరమైన శబ్దాల పటాటోపం బూర్జువా రచనే అవుతుంది.' అని 'లే' అన్న కవితాసంపుటికి ముందుమాటలు వ్రాసిన త్రిపురనేని మధుసూదనరావుగారు సెలవిచ్చారు.

* * *

విప్లవకవిత స్వభావ మేమిటి? గణనీయమైన గుణాలేమిటి? అన్న ప్రశ్నల్ని సహృదయ విమర్శకుడు పరిశీలించాల్సి ఉంది. ఇదమిద్దంగా దీని స్వభావాన్ని కాని, గుణాలనుకాని ఏ విరసం వక్తకూడ పేర్కొనలేదనే చెప్పాలి. స్థూలంగా అక్కడొకమాట, ఇక్కడొక మాటగా అన్నా, వాటిని క్రోడీకరించి విప్లవ కవితా స్వభావాన్ని ఆవిష్కరించడం అంత సులువైన పని కాదు. ఇందాక పేర్కొన్నట్టే ఆత్మవైరుధ్యాలు అనేకం సాక్షాత్కరిస్తాయి. విప్లవ కవిత ప్రత్యేక గుణాలను, సరిగ్గా వాచ్యంచేసిన కవి కూడ లేడు. కడకు వీరి ఆచార్యుడైన శ్రీశ్రీ కూడ

'సాయుధ విప్లవ బీభత్సుని సారధినై
భారత కురు క్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝంఝుని ప్రసరిస్తా.'

అంటూ గొప్ప పౌరాణిక భావ చిత్రంతో ఖరీదైన బూర్జువా తత్త్వంలోకే వెళ్ళిపోయారు. 'విప్లవం, సాయుధ విప్లవం',లాటి మాటలు ఈనాడు క్రొత్తగా వచ్చినవికావు. శ్రీరంగం శ్రీనివాసరావులోని శ్రీశ్రీ వెలికి వచ్చిననాటినుండి ఆమాటలు లోకంలో రూఢికెక్కాయి. ఆనాడంత గొప్పగా 'కవితా! నా కవితా!' అంటూ అపూర్వమైన ఆర్తిని చిత్రించి, తన కవితాత్మను ఆవిష్కరించిన మహాకవి, ఈనాడు అలాటి ప్రయత్నమే చేయలేదు. అలాటి యత్నంచేసిన కొందరూ, కవితాహంకారంలో కళ్లుమూసికొని గగనయానం చేశారు. 'కవి అన్నవాడికి అహంకార ముండితీరాల' అని ఒకానొక సందర్భంలో చెప్పిన విశ్వనాథ సూక్తి ఎలాటి నవ్వును తెప్పిస్తుందో, ఈ కొందరి కవిత్వమూ అంతే!...పట్టుబట్టి కవి కావాలనుకొన్న విక్రమార్కునికి ఈ అహం అధికమై, కవిత్వంగా వెలికి వస్తుందేమోకాని సహజకవులకు కాదు. 'అంతటి విప్లవం తెచ్చి, అనుప్రాసలకు లొంగాననని విహంగం వెక్కిరించింది.' అన్న కుందుర్తివంటి కవి వృషభులకు ఈ అహం ఉండాలికాని, నేలయీని చీల్చుకువచ్చే భూమీ పుత్రులకు అక్కరలేదు. అలా తన కవితను గురించి అధికంగా కాన్షస్ అయ్యే వ్యక్తి, ఆత్మ నెక్కడో మరచిపోతాడు. ఆ కవితా స్పృహ ఎంత తక్కువగాఉంటే అంత ఎక్కువగా తన ప్రజానీకానికి కవి దగ్గర కాగలడు. అలాటి స్పృహ ఉన్న ప్రభాకరదేవులనుండి కూడ ఈ విప్లవ కవితా స్వభావం అవగాహన కావడం కష్టం. అయితే వీరెన్నుకొన్న పాఠకులనుబట్టి, బూర్జువా కవితపట్ల వీరు చూపించే భావాన్నిపట్టి, దీన్నొకవిధమైన ప్రొలిటేరియన్ కవిత్వంగా చెప్పవచ్చును. ఒకవిధమైన ప్రొలిటేరియన్ కవిత్వం మాత్రమే. అచ్చంగా ప్రొలిటేరియన్ కవిత కూడ కాదు. 'లే' ముందు మాటలో త్రి. మ. రావుగారు తమ పాఠకుల్ని ఇలా పేర్కొన్నారు: 'విద్యార్థులు, చిన్న ఉద్యోగులు, చిన్నచిన్న దుకాణాల్లో పనిచేసేవారు, నగరంలో కార్మికులు, పల్లెల్లో రైతు కూలీలు, ఒక వర్గం సాహితీపరులు విప్లవ కవిత్వానికి పాఠకులు.' ఈ పాఠకుల్లో విద్యార్థులు, చిన్న ఉద్యోగులు, 'ఒక వర్గం' సాహితీపరులు అచ్చంగా బూర్జువా సంస్కృతి—అథవా—పెటీబూర్జువా మనస్తత్త్వంతో మనుగడ సాగిస్తున్నవారే. పల్లెల్లోని రైతుకూలీలు ఈ కవితను గురించి విన్నారా అన్నది అనుమానాస్పదమైన విషయం. వారికి కావల్సింది కవితలు కాదు, తమతో కలువగలిగే చేతులు. చేతలు. ఆ చేతల్లో పాల్గొకుండా వారికి దూరంగా కలం పట్టుకొని వార్ని గురించి ఎంత వ్రాసినా వారి హృదయాలకు దగ్గర కాలేరు. వీరెన్నటికీ తను వర్గంగా, ఆ శ్రమజీవులు భావించలేరు. ఈ కవితా సంస్కృతి అన్నదే ఇరువురి మధ్య పెద్ద అడ్డుగోడగా నిలుస్తుంది. అందులోనూ, ఇందాక ఉటంకించిన కవితాగంధం వారిలో ఎప్పటికీ విశ్వాసబీజాల్ని నాటలేదు. ఈ రహస్యాన్ని గుర్తించే కొందరు జానపదధోరణిలో విప్లవ కవితను వ్రాయాలని నడుం కట్టారు. ఇది చక్కని ఆలోచనే. కాని మళ్లీ అదే మౌలికమైన సమస్య. అనుకొన్నట్టుగా ఇది వారి గుండెల్లో చేరి ఉత్తేజాన్ని కలిగించాలంటే, ఈ కలంవీరులు కుహనాబూర్జువా వ్యవస్థను పూర్తిగా వదలి వాళ్లల్లోకి వెళ్లాలి. వారిలో ఒకరిగా కలిసిపోవాలి. పాణిగ్రాహిలాటి నిజమైన నేతగా పరివర్తన మందాలి. లేనప్పుడు—ఎంచక్కా బూర్జువా సంస్కృ

తిలో ఇస్త్రీమడతలు నలగని జీవనం సాగిస్తూ వీరు—దుమ్ములో దొర్లాడుతూ చెమటబిందువులో రవీంద్రుని దేవుణ్ణి ప్రతిబింబిస్తూ వారు...వీరి కవిత వీరి కొరకే. తామూ కవులమన్న అల్పసంతోషాన్ని తమకు తాము అనుభవించడానికే. అందుకే 'ప్రొద్దు'లో విప్లవ కవుల్నిగూర్చి 'ఏరుసెనక్కాయల తింటూ సినిమా కట్టాలు సూసే కన్నీరెట్టుకొనే కుర్రోళ్లు' అంటూ రంధి సోమరాజుగారు చెణికారు.

శ్రామిక సంస్కృతికి దూరమయ్యే రచన ఏదైనప్పటికీ బూర్జువా రచన అవుతుందన్న శ్రీ. మ. రావుగారి మాట విప్లవ కవితా స్వభావాన్ని గుర్తించడానికి కొంత దోహదం చేస్తుంది. 'ప్రేమగానం, మానవతావాదం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే అర్థం లేని రచనలు వర్గదృష్టి లేనివాడు, సమాజంలో వర్గ సంబంధాలు గ్రహించలేని వాడూ వ్రాస్తాడు.' అన్న వారి మాటలోని సత్యాన్ని తర్కించడం అటుంచి, వారి దృక్పథం అన్నది విప్లవ కవిత ప్రధాన లక్షణంగా మన కగుపడుతుంది. అయితే వర్గదృక్పథాన్నే ప్రధానంగా తీసికొన్న రచయిత జీవితంలోని అన్ని కోణాలను చూడగలుగుతాడా? లోతులను స్పృశించి ఆ లోతుల్లోని అనుభూతిని వెలికి వాగ్రూపంలో తేగలడా అన్నది ఒక క్రిటిక్కు—కాకుంటె సినిక్కు—ఉదయించే ప్రశ్న. వర్గదృక్పథం అంటూనే ఏవో కొన్ని ఇజాలకు కావలి కుక్కలుగా కట్టుబడిపోయి, కవితల్ను వినిపించే కవులు ప్రత్యక్షమౌతారు. వారికి శ్రీ. మ. రావుగారే చక్కని హెచ్చరిక చేశారు. సిద్ధాంత పటాటోపాలను కాక, జీవన వాస్తవికతను చిత్రించాలన్నారు. అలా కాని నాడు అది 'అతివాద బాలారిష్టం' మాత్రమే అవుతుందన్నారు. ఇంత చక్కటి మాటను ముందుమాటగా అలంకరించుకొన్న 'లే' కవితాసంపుటి, లోన మళ్లీ కుప్పలు తిప్పలుగా ఈ 'అతివాద బాలారిష్ట' కవిత్వాన్ని కలిగి ఉండడం శోచనీయకరం. విద్యార్థులు, నవయువకులు అయిన ఆ కొందరి ఉత్సాహాన్ని, విప్లవ భావననీ మాత్రం మన మంగీకరించాల్సి ఉంటుంది కాని, వారి కవితల్ని కవితలుగా అనుభవించలేము. రావుగారే ఒకచోట అన్నట్టు, 'అపరిణత అనుభవ భ్రాంతి'నుండి వచ్చిన కవితలవి. దాన్ని విప్లవభావనగా కాక, ఓ విధంగా, నియో—రొమాంటిసిజమ్‌గా అంగీకరించవచ్చు...జీవితాన్ని కళ్లారాచూసి, జీవన వాస్తవికతను గ్రహించి, గుర్తుపెట్టి దాన్ని చిత్రించే ప్రజ్ఞ కాక, కళ్లుమూసుకు కష్టాల సీన్లనిమూసి, క్యారక్టరిస్టిక్‌గా వ్రాసినట్లనిపిస్తుంది. 'నిస్సహాయంగా పడుపువృత్తికి దిగిన పడతి, రిక్షావాలా, నిరుద్యోగి, ఆకటమాడే కన్న కొడుకునిచూచి ఏడ్చే తల్లిరోదన, కన్న పిల్లల కడపటి కేకలు'—ఇవీ ఈ 'లే' సంపుటిలో కనిపించే శ్రామిక సంస్కృతి. వాస్తవ పరిజ్ఞానంతో రచయిత ఈ కష్టజీవులను చిత్రిస్తున్నట్లనిపించదు పెద్దలనుండి పరంపరగా వస్తున్న స్టాక్‌డిక్షన్‌నుండి చటుక్కున వాడుకొన్నట్లు స్ఫురిస్తాయి. 'క్లబ్బుల్లో నగ్నంగా నర్తిస్తున్న రోసీని చూచి, వ్యామోహంతో పెడుతున్న వెర్రికేకలు, కంట్రాక్టర్ ఇస్తున్న వాట్ పార్టీలో గ్లాసుల చప్పుడు'వంటి చిత్రణలు, సినిమాలందిస్తున్న రొమాంటిక్—ప్రొలిటేరియన్ కల్చర్‌కు ప్రతిధ్వనులు. ఈ 'లే' సంపుటి ముఖ్యంగా కాలేజీ ప్రాంగణంలోని విద్యార్థులనుండి వచ్చింది. విద్యార్థుల్లో కూడ విప్లవభావం ఎలా ప్రతిధ్వనిస్తుందో చూడమని ఈ సంఘటిని ప్రదర్శించేవాళ్లు నిజంగా తెలివితక్కువవాళ్లే. అసలీ 'లే' రచయితలు విప్లవమన్న మాటను అర్థం చేసికొన్నారా? అనిపిస్తుంది. జీవితం అంటే నిరాశగానూ, నిరర్థకంగానూ ఆలోచనలు పెంచుకోడానికి ఈ సంపుటి దోహదపడుతుందేమొ కాని, వీలైనంత బీభత్సాన్ని, అదీ కాల్పనిక బీభత్సాన్ని పెంచుకోడానికి అవకాశాన్నిస్తుందికాని, ప్రస్తుతమున్న అవ్యవస్థ ఎలాటిదో, ఆ అవ్యవస్థను తొలగించుకోడానికి ఎలాటి శాస్త్రీయ పరిష్కారం అవసరమో, శాస్త్రీయ దృక్పథం ఎలా అలవాటు కావాలో కించిత్తయినా చర్చించదు. అలాటి చర్చలేని కవిత, ఈనాటి సంఘానికి నిష్ప్రయోజనం...సంఘంకోసం వ్రాసిన అన్నపేరుపెట్టి అలా నియో—రొమాంటిసిజమ్‌లో పడిపోవడంకంటె ఘోరమైన ద్రోహంలేదు. వీరు తమ కవితలద్వారా సృష్టించే ఈ బీభత్సం, నిస్పృహ, మిగిలినవారు విప్లవోన్ముఖులవడానికి నేపథ్యరంగభూమిగా ఉపకరిస్తుందని ఏ విమర్శకుడైనా అంటే, అది ఇందాక శ్రీ. మ. రావుగారన్న 'అపరిణత అనుభవభ్రాంతి' మాత్రమే అవుతుంది. అదృష్టవశాత్తు ఎవరూ ఇందాక ఆ మాటను అనలేదు. ఒకవేళ ఇది నేపథ్య రంగభూమిగా ఉపకరిస్తుం

దన్న మాటను అంగీకరించిన పక్షంలో, తత్ఫలితంగా పఠల్లో ఉత్పన్నమయ్యేది విప్లవకాంక్ష కాదు. విధ్వంస కాంక్ష. విప్లవానికి—విధ్వంసానికి ఎన్నోరెట్ల అంతరం ఉన్నది. దాన్ని గుర్తించకపోవడంలోనే విప్లవ కవిత మొదటి దౌర్బల్యం దాగి ఉంది.

ఇంతదాక క్రమంత వికాసాన్నంది, సుస్థిరంగా నిల్చిన వ్యవస్థలో లోపం ఉన్నప్పుడు, దుఃఖభాజనత చోటు చేసికొన్నప్పుడు, ఆ వ్యవస్థ కేవలం అవ్యవస్థగా మాత్రమే పరిణమించినప్పుడు, జాతిజీవన సుఖానికి మళ్ళీ అందరూ కలిసి మరో క్రొత్త వ్యవస్థను క్రమ బద్ధంగా పునర్నిర్మింపచేసే శాస్త్రీయ ధోరణినే విప్లవం అని పిలుస్తాము. అలాకాక 'ఈ అవ్యవస్థ పరమ దుఃఖభాజనంగా మాత్రమే ఉన్నది; ఏదో మార్పు కావాలి' (అదేమిటో ఆలోచించకనే) అన్న ఆశయంతో ఉన్నదాన్ని తుడిచిపెట్టేయడానికి ఉపక్రమించే పద్ధతిని విధ్వంసం అంటారు. విప్లవం అన్నది ఒక శాస్త్రీయ మైన జాతిగీత ఉద్యమం. అతిసహజమైన చారిత్రక పరిణామం. విధ్వంసం అలా కాదు. అసంతృప్తి ఒక విధమైన పాశవికమైన సహజోద్భుద్ధంతో సమ్మేళన మంది వికసిత వ్యవస్థనుమాత్రం రూపుమాపే హింసా త్మక రచన విధ్వంసం. ఇందులో ఎలాటి నిర్మాణా త్మక దృష్టి, పునర్నిర్మాణ ప్రయత్నం, శాస్త్రీయ విచ క్షణ ఉండవు. విప్లవాన్ని ప్రబోధించే విద్వాంసులు మొట్ట మొదట గుర్తించాల్సింది, ఆ విప్లవానికి జీవనాడియైన శాస్త్రీయతను, శాస్త్రీయ పునర్నిర్మాణ పద్ధతినీ. దాన్ని గ్రహించకనే ప్రబోధనకు ఉపక్రమించే విద్వాంసులు, ఉద్యమాన్ని పోషించడం అటుంచి, కూకటి వ్రేళ్లతోసహా కూలిపోవడానికి మాత్రం కారకులవుతారు. ఈ నాడు విప్లవ కవితను వ్రాస్తున్న వాళ్లు నిజంగా విప్లవాన్ని ఎంతవరకు అర్థం చేసికొన్నారు? అసలు వారు ఆద ర్శంగా తీసికొన్న వాదాన్ని సమూలంగా చదివిన వాళ్లెందరు ? ... విప్లవకవితోద్యమానికి నేతృత్వం వహిస్తున్న పెద్దలు ఈ ప్రశ్నల్నేమాత్రం పట్టించు కోవడం లేదు. ఏదో ఆకర్షణతో అనుయాయులు తయారౌతున్నారన్న సంబరం తప్పితే, వారికి సమూ లకమైన శాస్త్రీయ పరిజ్ఞానం, తద్వారా నిశిత మానసిక శిక్షణ కలిగించాలి అన్న ఆశయం, ఆ నేత లకు మచ్చుకైనా లేదు. ఆ ఆశయంతో వారు పరిశ్ర మించడానికి పూనుకోని పక్షంలో ఇది ఒక్కొక విప్లవ తోద్యమం (?)గా మాత్రమే ఉంటుంది కాని, సమా జంలో వీరే వర్గాన్ని వస్తువాలంబనంగా తీసికొన్నారో, ఆ వర్గంలో ఎలాటి చైతన్యాన్ని కలిగించలేదు.

*

నిజంగా వారు సమాజగత చైతన్యాన్నే అభిల షిస్తున్న వారైతే, ఈ కవిత్వం వారికి సరియైన మాధ్యమికం కాదు. కవిత్వానికి మానవుని మేధతో కంటె, హృదయంతో ఎక్కువ అనుబంధం ఉంటుంది. ఎంత ప్రయత్నించినా ఆ హృదయానుబంధాన్ని—అధవా అనుభూతిని దిగనార్చి కవితల్లలేము. సుప్త చేతనానుభూతికి భాషానుగత ముద్రయే కవిత్వము. అంతర్జాతీయ స్థాయిలోకూడ ఇదీ దాదాపు సశాస్త్రీ యంగా నిర్వచనంగా ఆమోదింపబడిందని నిరూపించ వచ్చు. కావ్యాభివ్యక్తిని నిర్వహించే భావచిత్రాలు, పద బంధాల సొగసు, లయ—ఇవన్నీకూడ కవిత్వాన్ని వాస్త వానికన్న అతీతంగా తీసికొనిపోతాయి. అదో క్రొత్త లోకాన్ని నిర్మింప చేస్తాయి. ఈ క్రొత్త లోకంలో వాస్తవికతే ప్రధానంగా ఉండాలని కొందరు కర్తలు ఆశించినప్పటికీ, అక్కడవెలసే వాస్తవం, కేవల ప్రతిబింబ ప్రాయంగాకాక, ఇంకో ఊర్ధ్వ సౌంద ర్యంతో కూడి ఉంటుంది. ఈ సౌందర్యమన్నది, కేవలం అకృతీపరమైంది మాత్రమేకాక, తాత్త్విక పరమైనా కావచ్చు. కవిత్వంలో ప్రతిష్ఠాపితమయ్యే జుగుప్సాదులుకూడ హృదయాకర్షణను ఎలా కలి గిస్తాయో, సవిస్తరంగా చర్చించాడు హెర్బర్ట్‌రీడ్.[4] 'రమ్యం, జుగుప్సిత ముదారమథాపి' అంటూ ప్రాచీన ప్రావ్యాలంకారికులు దీన్నే ప్రస్తుతించారు. అంచేత ప్లేటో కవులను తన ఆదర్శరాజ్యంలోకి బహిష్కరించాడు. కవిత్వమొక జాగ్రత్స్వప్నం (Conscious dream)గా భావించారు వారు. కవులను అనుమతించినా, వారు వీరస్మృతి గీతాదులమాత్రం ఆలపించాలని ప్లేటో ఆంక్ష. కళావిదుడు వాస్తవాన్నికాక, నమూనా ఆకృతు లను మాత్రమే అనుకరిస్తుంటాడన్న ప్లేటో మాట లను మనం హేళనగా త్రోసిపుచ్చలేము. క్రిస్టఫర్ కాడ్వెల్‌వంటి ప్రఖ్యాత విమర్శకుడు, మార్క్స్ ప్రభావంతో సాహిత్యాధ్యయనంలో క్రొత్త అధ్యా యాలను సృష్టించిన ప్రతిభాశాలి, ప్లేటో మాట

4. The Meaning of Art,

ంనే సమర్థిస్తూ, కవులకొక వాస్తవికతాజ్ఞానం తోడి అత్యరిక్షణ అత్యవసరం అని హెచ్చరిస్తాడు. అయితే కవితాజననం కాని, కవితాస్వాదం కాని ఒక అవ్యక్త మానసిక దశలోనే, ప్రేరణతోనే జరుగుతూన్నదన్న ప్లేటో మతాన్ని త్రోసిపుచ్చలేదు. అంటే అవ్యక్త మైన ఆస్పందన, ఏ శబ్దసముదాయంవల్ల జనిస్తున్నదో, అదే కవిత్వమన్నమాటను కాడ్వెల్ ఆమోదించినట్లే. ఈ అవ్యక్తమానస తంత్రాన్ని పదచిత్రాల్లో పెట్టడానికే శ్రమిస్తుంటాడు కనుక, ప్లేటో అన్నట్లు అతని వాగభివ్యక్తిమీద అతనికే అధికారం పోతున్నది కనుక, అలాటి కవిత్వప్రభావం పామర జనంపైం— అందులోనూ యాంత్రికయుగంలో యంత్రాలవలె జీవిస్తున్న శ్రామిక జనంపైన పరిపూర్ణంగా ప్రసరించడం లనుమానాస్పద విషయం. యుగం— యుగలక్షణం మారుతున్నకొద్దీ, భావాభివ్యక్తి మాధ్యమికంకూడ మారుతుండాలి. పరమ ధర్మోద్దీపనమున కుద్దేశితమైన ఒకనాటి పురాణ కవిత్వం-- మార కవిత్వం (Classical Poetry), అవ్యక్తవేగంలో చలించిపోతున్న ఆధునిక కాలానికి సరియైన మాధ్యమికమని ఎవ్వరూ ఒప్పుకోరు. ఆ కవితకై ఆగి అర్థం చేసికొనే టపిక, విరామం ఆధునిక మానవునకు లేవు. మానవ పరిజ్ఞాన పురోగమనం ప్రతి రెండున్నర సంవత్సరాలకు రెట్టింపవుతున్నదని శాస్త్రజ్ఞుల అంచనా. అలాటి తరుణంలో, ఆధునిక వేగానికి ప్రతిబింబమైన లఘుకవిత, లఘు కథ ప్రాభవాన్ని అనుభవించే తరుణంలో, ఊర్ధ్వ వాస్తవికతను నిర్మించడానికి యత్నించే సంక్షిప్త వ్యక్తీకరణలో, జాగృత్‌చేతనకు అతీతంగా లిఖితమయ్యే భావచిత్రాల సాయంతో వెలికివచ్చే కవిత, ఇలాటి విప్లవ చైతన్యాన్ని నేల నలుచెఱగులకూ విస్తరింప చేయడానికి అర్హమైన మాధ్యమికం కాదు.

భాషాపరంగా చెప్పాలంటే ఆధునికయుగం ముఖ్యంగా వచనయుగం. రాజకీయ తత్త్వపరంగా వ్యాఖ్యానిస్తున్నప్పుడు ఆధునికయుగాన్ని సమసమాజయుగం— సామ్యవాదయుగం అని ఎలా గైతే పేర్కొంటామో, అలాగే భాషాపరంగా దీన్ని వచనయుగం—అథవా— వాడుకమాటలయుగం అని పేర్కొంటాము. భాషాపరంగా ఇది ప్రజాస్వామ్యస్థితి. అరిస్టాటిల్లాంటి విద్వత్తులు, విదగ్ధులు మాత్రమేకాక, భాషను నేర్చిన ప్రతి వ్యక్తీ రచనా స్వాతంత్ర్యాన్ని అనుభవించ గలడు. ఇలాటి యుగంలో, సమస్త సమాజ చైతన్యాన్ని ఉద్దేశించే రచన ఎప్పుడూ వచనంలోనే ఉండాలి. అందులోనూ మామూలు మాటల్లో, మామూలు భావనలలో ఉండాలి. అలా కానప్పుడు అది వ్యష్టిచేతన అవుతుందేమోకాని, సమిష్టిచేతన కాలేదు. కవిత ముఖ్యంగా ఒకే ఒక్క వ్యక్తి అనుభూతిసీమనుండి పదాలేరుకొని లోకంపై వ్రాలుతుంది అలాటిదాన్ని— అందులోనూ ఇలాటి సంక్షిప్తమైన అభివ్యక్తి కల దాన్ని, సర్వజాతి చైతన్యాన్ని మూర్తీభవించుకొని వచ్చిందనడం, విస్తారంగా విప్లవ భావనల్ని ప్రచారం చేయడానికి వచ్చిందనడం కేవలం భ్రమాస్పదమైన మాటమాత్రమే. ఈ కవితావిహంగాన్ని పట్టుకొని, అందులోని లోలోపలి ఆత్మను గ్రహించేవాళ్లు చాల అరుదు. సమస్త సమాజ చైతన్యమన్నప్పుడు ఈ కొద్దిమందినే ఆశయంగా పెట్టుకోకూడదు. త్రి. మ. రావుగారు పేర్కొన్న విప్లవకవితా-లక్షణలలో పదిశాతం కూడ వీరి కవిత్వాన్ని అర్థంచేసికొని, అనుభవించేవారుండరు.

విప్లవ చైతన్యాన్ని ప్రజావ్యాప్తం చేయడమే ఈ వర్గం వారి ఆశయమైతే ఈ కవిత్వం చాలా బలహీనమైన మాధ్యమికం. 'సినిమా కట్టాలుసూసి కన్నీరెట్టుకొనే కుర్రోళ్లు' అన్న చెణుకులు ఎన్నైనా రాగలవు. అయితే అవి నిష్కారణమైన చెణుకులు కావన్న ఆత్మజాగృతి వీరికుందో లేదో తెలియదు మఱి!...విప్లవభావనను ఆశ్మగా పెట్టుకొని కవిత్వం మాత్రమే వ్రాయదలచుకొనే సహజకవులు కొందరు, కొన్ని ప్రాథమిక నియమాల్నయినా గుర్తించుకోవాలి. అటు శైలిలోనైనా, ఇటు వస్తువులోనైనా ఆ ప్రాథమిక సూత్రాలను విస్మరించకూడదు.

1. మొదట శైలి విషయానికి వద్దాము. ఈ నవ వర్గీయుల కవితల్లో లయ ప్రధానంగా ఉండాలి. అభ్యుదయ కవితాయుగం అందులో వికసించిన వచన కవితలోని సాఫీ పద్ధతినుండి, శ్రీ శ్రీ వంటి ఒకరిద్దరు పూర్వుల రచనలు తప్ప అనేకుల ప్రయోగ చాపల్య పుంజాలనుండి ఈ లయ వీరిని విడదీసి చూపుతుంది. అంతేకాక, అతి ప్రధానమైంది— లయ శ్రామిక సంపు-[illegible], వారి [illegible]

[illegible] Illusion and Reality.

ప్రస్ఫుటంచేసే ప్రధానమైన భాషాసంకేతం అన్న విషయాన్ని మరువరాదు. "Rhythm is a form in which we see and feel and hear and know many persons acting as one man." అని లయనుగూర్చి ప్రఖ్యాత మార్క్సీయ విమర్శకుడైన జాక్ లిండ్ సే తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.[6] 'Art is the expression of man's pleasure in labour' అని విలియమ్ మోరిస్ భావన[7]. ఈ శ్రామిక కర్మను, వేగాన్ని ప్రతిబింబింపచేసే, ప్రతిధ్వనింపచేసే ఏకైక భాషాగత ముద్రలయ. దాన్ని గుర్తించి రూపందిన శ్రీశ్రీ కవిత నేటికైనా ఏనాటికైనా చెవులపడితే చాలు, విప్లవోత్తేజం అదంతకదే ఉప్పొంగి వస్తుంది. ఎంతజడునిలోనైనా నిద్ర లేస్తుంది. ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదన్నది ఆంధ్రదేశంలోని ప్రతిసహృదయునికీ తెలుసు. 'శరీర కష్టం స్ఫురింపచేసే' ఈ ప్రధాన అంశాన్ని ఒక్కరచయితకూడ గుర్తించక పోవడం చాలా విచారదాయకం. గురిఁచిన కె. వి. ర లాటి వారు కావ్యనికపు సొగసుల్లోకి జారుకొనో, ఏ ధ్వనీలేని పదాల గజిబిజితోనో కప్పదాటు వేస్తారుకాని, శ్రామిక సంస్కృతిని ప్రతిష్ఠించలేకున్నారు.

2. ఇకవస్తుగతంగా గుర్తించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. మొట్టమొదట తమ నవ్యపంథాకు ఒక ప్రత్యేక వ్యక్తిత్వం ఏర్పడేలాగ చూడాలి. ఇంతకు మునుపున్న పంథాలు స్వీకరించిన వస్తువునే తామూ స్వీకరించి నవ్యచైతన్యాన్ని సాధించలేరు. కనీసం నవ్యత్వాన్నిరూపించలేరు. ఉదాహరణకు అభ్యుదయ కవిత్వంకంటె వినూత్నమైన వ్యక్తిత్వంకల 'ఉద్యమం' విప్లవ కవిత్వం అంటూ చాటాలంటే వాళ్లిందాకా చేపట్టిన పదజాలాన్ని, దృశ్యాల్ని వీలైనంతవరకు తప్పించాలి. మొన్నటి కల్పనికత్వంనుండి వేఱుపడుతూ నిన్న శ్రీశ్రీ వ్రాసిన 'ఒక రాత్రి'ని గుర్తుకు తెచ్చుకొంటే చాలు విశదమౌతుంది. నిన్నటి అభ్యుదయ కవిత్వం కేవలం బూర్జువా కవిత్వమనే నేటి వారి భావన. అలాటప్పుడు వీరి కవితా చిత్రణలో ఆ బూర్జువా పదార్థం అణుమాత్రంకూడ అగుపించకుండా ఉండడానికి కృషిచేయడం వీరి మొదటి బాధ్యత. ఎలాగ? అన్నదానికి సమాధానం వాళ్లే సాధించాల్సి ఉంది. ఏ విమర్శకుడూ సూచించలేడు. అది అతని బాధ్యతకాదు. కందే. ఈ విషయాన్నే పేర్కొంటూ క్రిస్టఫర్ డ్వెల్ఇలాగంటాడు. "They will go to y the revolution as a kind of giant explosion which will blow up everything they feel to be hampering them But they have no constructive theory as artists the new as economists, accept the economic categories of socialism, but as artists they cannot see the new forms and contents of of an art that can replace bourgeois art." అయితే శ్రీకాకుళైట్లను సమర్థించాం సాయుధ విప్లవాన్ని ఆశిస్తున్నాం అంటూ విరసంవారు పేర్కొనవచ్చు. ఇది నిజమే. వస్తువులో వీరి ప్రత్యేకత ఇక్కడనే ఉంది. అయితే కవిత్వానికి ముందు వ్రాసిన మాటల్లోనూ, మధ్యలో అక్కడక్కడ ఒకరిద్దరి కవితల్లోనూతప్ప, కవితాచిత్రణలో అంతటా, పరిపూర్ణంగా ఉన్నదేమిటి?......ఇంతకుమునుపు వీరన్న 'బూర్జువా కవిత'నుండి వేఱుకానిదే. పోతే మరి కొందరు రాజకీయ జీవితాన్ని, రాజకీయ క్షుభిత జీవితాన్ని సాధ్యమైనంత శ్రద్ధతో చిత్రీకరిస్తున్నాం అని చెప్పొచ్చు. వారికి ఏంజల్స్ మాటే సమాధానం:' 'The more the political opinions of the author remain hidden, the better it is for the work of art.'[8] ఎప్పుడైతే కవి రాజకీయాల్ని చిత్రించడం మొదలుపెడతాడో, అప్పుడే అతడు కవిగా అంతరిస్తాడు. కవికున్న ప్రధానమైన స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకొంటాడు. కేవలం పార్టీ పక్షిలాగ మారిపోతాడు. జీవన వాస్తవికతను, వాస్తవ జీవనాన్ని రాజకీయాలు ప్రతిబింబిస్తున్నాయనడం క్షుద్రమైన సమాధానమే. దాన్ని గూర్చే చాలా వ్యాగ్రతతో గోథే ఇలాగన్నాడు: 'We moderns, had better say with Napoleon, 'Politics are our fate' 9 బాధ్యత

6. After the 'Thirties-Jack Lindsay.

7. Quoted in the above book.

8 & 9 Quoted in Cassell's Encyclopaedia of Literature -'Poetry'-by E. Sitwell.

కలిగిన ఏ కవి కూడ రాజకీయాలే కవిత్వమనికాని, లేక కవిత్వానికి చక్కని వస్తువు రాజకీయాలనికాని చెప్పడం చాలా ప్రమాదకరమైనదంటూ గోర్కీ హెచ్చరించాడు...రాజకీయాలనో, లేక వాని ఆసరాగ తయారైన పాక్షిక ఉద్యమాలనో కవితావస్తువుగా వరించి కొందరు విప్లవ కవులు వ్రాస్తే, శ్రామిక సంస్కృతిని ప్రతిబింబింప చేయడం పేరిట, కొందరు శుద్ధంగా శ్రామికుల నిత్య జీవితాన్ని చాలా వాస్తవికంగా కవితల్లో చిత్రించాలని పట్టుపట్టుతారు. దీనివల్ల కలిగే ప్రయోజనం చాలా స్వల్పం. నిత్యం యంత్రయుగంలో విసుగెత్తిపోయిన శ్రామికులు, తమ జీవితాన్ని మళ్లీ తామే చూచుకొని ఉత్తేజం పొందడమంటూ ఉండదు. దాన్నే లెనిన్ ఇలా పేర్కొన్నారు...'తమకు నిర్మాణ భవంలోఉన్న సామాన్య విషయాలనో, తమ ఫ్యాక్టరీ జీవితాన్నో చదవడానికి కార్మికులు ఇష్టపడతారని, ఏ కొందరు అర్భక మేధావులో భావిస్తుంటారు.'[10] వారికానైమిత్తిక జీవితాన్నిగూర్చికాక, ఇంకా విస్తారమైన వెలుపలి జీవితాన్ని, జీవితపు లోతుల్ని తెలియ చెప్పడం కళావిదుల మొదటి కర్తవ్యం అంటూ లెనిన్ పేర్కొన్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఇంకొకటుంది. మనదేశం జనాభాలో, భారీ కర్మాగారాల్లో పని చేస్తున్న వారి సంఖ్య—అందులోనూ ప్రత్యేక వ్యక్తుల సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య అంత అధికమైందికాదు. అత్యధికభాగం వ్యవసాయ కార్మికులు. ఏ మాత్రం చదువు సంధ్యల్లేని రైతు కూలీలు. ఇక కొన్నేళ్ల తర్వాతి మాటను చెప్పలేము కాని, ఇప్పట్లో వారికి కవితావగాహన శక్తి లేదు. కనీసం వినేపాటి రక్తికూడ లేదు. దేశంలో అధిక సంఖ్యలో మధ్యతరగతి జనాభా బూర్జువా వర్గమే ఉన్నది. అటూ ఇటూ చెల్లని ఈ మధ్య జాతిలోనే చైతన్యం కలగాలి. కలిగించాలి. బలవంతంగా వారు మరచిపోతున్న అనేక విలువలను, వాస్తవిక సత్యాలను సున్నితంగా, హృదయంలోని నరనరాలు కదిలిపోయే లాగ చిత్రించాలి. కేవలం వారి నిత్యజీవితాన్ని మాత్రమే కాదు. అందులోనూ వాస్తవికత పేరిట, విసుగెత్తిన జీవితాన్నే కాదు. అంతకన్న ఓ వన్నె అధికమైనా, ఓ వన్నె న్యూనమైనా సరే చెప్పేది సున్నితంగా, హృదయం చలించేలాగ, మేధస్సు కార్యప్రేరణ నందేలాగ చెప్పాలి. ఈ రహస్యాన్ని కనిపెట్టిన నిరసం సభ్యులు ఇద్దరు ముగ్గురే. వారిలో సి. ఎస్. రావు గారి విషయం ప్రత్యేకిస్తే, ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ వారు, కొడవటిగంటి, రాచకొండ గారలే. మిగిలిన ప్రచండ మేధావులందరూ, లెనిన్‌మాటలోని అర్భక మేధావులే అయిపోతున్నారు. ఇక పొయిటాస్టర్ల విషయం చెప్పపనిలేదు. రా. వి. శాస్త్రి, కొ. కు. రావుగార్ల ఒక్కొక్క రచన ఒక్కొక్క ప్రళయ మారుతం వంటిది. ఎంత సున్నితం అవసరమో అంత సున్నితాన్ని చెప్పడంలో ఒడుపుకొని చెప్పుతారు. కేవలం వాస్తవికాన్నే చిత్రించినట్లుంటుంది కాని, అంతకన్న లోతైనదేదో అణువణువునా ఆకర్షిస్తూ ఉంటుంది. హృదయమూ, బుద్ధీ రెండు ఒక్కచోట సంగమించి, వినూత్న ప్రేరణావేశం జనిస్తుంది. తమకుతగ్గ వ్యక్తీకరణ మాధ్యమికాన్ని, యుగ స్వభావాన్ని ప్రతిబింబించే సరియైన మాధ్యమికాన్ని ఎన్నుకొన్న ఘనత వారిద్దరికే చెందుతుంది. 'వారు కవులుకాదు కాబట్టి, గద్యాన్ని వరించారు' అని ఎవరైనా అంటే వార్నిచూసి జాలిపడాల్సి ఉంటుంది. అద్భుతమైన కవిత్వాన్ని ప్రదర్శించిన సందర్భాలు వారి వచన రచనల్లో కోకొల్లలు. ఈ కవులందరూ ఒకే ఒక సామాన్య వాక్యాన్ని పదముక్కలు చేసి క్రింద క్రింద పేరుస్తూ పేజీలు పెంచితే, వారు యెన్నో పేజీలు పట్టే గొప్ప భావాన్ని ఒక వాక్యంలో కూర్చి ఏకక్రమంగా వ్రాస్తారు. అంతే. ఇలాటివారు మరొక్క పదిమంది తెలుగుదేశంలో ఉద్భవించిఉంటే, ఈపాటికి క్రొత్తతరం, ఓనాడు కొ. కు. రావుగారు కలగన్నట్లు, నిజంగా సమసమాజ వ్యవస్థలో జీవిస్తూఉండేది. వీళ్లను గొర్రెమందలాగ అనుకరించే ఛట్టగాడుగులు

10. Quoted in 'Limits not Frontiers of Sur-realism' by André Breton. essay in 'Sur-realism' Ed. by. Herbert Read.)

ఆధికం కావడంవల్లా, ప్రజాస్వామ్య సూత్రంతో ప్రతి వాడూ కలంపట్టి కవులై తామూ కవులకున్న అహంకారాన్నీ అల్పసంతోషాన్నీ అనుభవించడం మొదలిడడంవల్ల, వీరి ప్రయాస నేటికీ 'ప్రయాస'గా మాత్రమే నిలిచిపోయింది. ఏ అరిస్టోక్రటిక్ యుగంలోనో పిల్ల వసుచరిత్రలు చందంలాటి ఈ 'గుంపు మేళం' పుట్టిఉంటే బాధలేదుకాని, ఇలాటి సంధి యుగంలో—అవ్యవస్థ యుగంలో, ఇలాటిది ఏర్పడ్డమే చాలా బాధను కలిగిస్తుంది!

లక్షణం మొదటపుట్టి లక్ష్యం యెన్నడూ తర్వాతగా రాలేదు. అలా వచ్చేది, కేవలం శుష్కానుకరణం మాత్రమే. అలాగే వస్తువిది అన్న నిర్దేశం మొదట ఏర్పడి, రచన యెన్నడూ తర్వాతగా రాదు. రారాదు. అలా వచ్చినా, వాటికి ఎలాటి ప్రభావ ప్రేరకశక్తీ ఉండదు. మేధావంతులు + ప్రతిభావంతులూ అయిన రచయితలు లోతుగా శ్రమించి, తాము చేపట్టిన క్రొత్తరీతికి స్వయం వ్యక్తిత్వాన్ని సమకూర్చాలి. అప్పటికే అది ఆధునిక కవితా చరిత్రలో ప్రత్యేక ప్రకరణ గౌరవాన్ని పొందగలుగుతుంది. అలా వారు తాము కలామణిచేసే క్రొత్తపేరన్నదానికి స్వయం వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకత్వాన్నీ సమకూర్చినప్పుడు, దాని ఆత్మను సాక్షాత్కరంగా ఆవిష్కరించి సమాజంతోటి చక్కని అన్వయానికి విమర్శకుడు శ్రమించగలడు. అంతవరకే విమర్శకుని బాధ్యత.

అంకితం

శ్రీ కె. శివారెడ్డి

ఇదేమీ
కొత్త గాదు నాకు
నువ్వేమో
పొద్దుటిపూడి చిగురుటాకులా
టపటపా రెండు కన్నీటిబొట్లు రాల్చటం—

అవి
ఈ కాలే ఇనుం మీద
ఆవిరై పోవటం—
నువ్వొక నువ్వే
నేనొక నేనే—
విరుద్ధాలకి స్నేహమన్నది ఎంత నిజం!

నేను
వ్యక్తిలోంచి
జనశక్తిగా జన్మించినవాణ్ణి
జనదృష్టిగా రూపొందినవాణ్ణి—

నాకు
నాదన్నది లేదు
నేనొక ఆయుధాగారం
ఆయుధ కర్మాగారం—

నువ్వు
నీ కేంద్రం వద్ద
స్పందించే బిందువువి
నేను నీనుంచి
ప్రసారం కావాలని నీ వాంఛ—

నన్ను
నేను హరించుకుని
జనం ప్రయోజనంవద్ద సమర్పించుకున్నవాణ్ణి
ఊపిరి
విద్యుత్తుగా పుష్పిస్తున్నవాణ్ణి—

చూడు!
నా నేత్రా లెప్పుడూ సజలాలే
ప్రజల జల జాల జన్మస్థానాలే—
నువ్వూ కన్నీటిబొట్టువే
రా! నా కన్నీటిలో కలువ్—

ధూర్తవిట సంవాదము

ఈశ్వరదత్తకృత సంస్కృత భాణమునకు తెనుగుసేత 'రజని'

అంకితం : 'బాలూ'కి

[ఈశ్వరదత్తుడు సంస్కృతంలో రచించిన 'ధూర్త విట సంవాదం' అనే ఈ భాణం—'చతుర్భాణీ' అనే పేరులో 1922 లో ప్రసిద్ధ విద్వత్పరిశోధకులు కే. శే. మానవల్లి రామకృష్ణకవిగారు సంస్కరించి, డి. జి. శర్మ అండ్ కృష్ణ, బకీర్‌గంజ్, పాట్నావారు అచ్చొత్తించిన ప్రాచీన భాణచతుష్టయంలో ఒకటి. వీటిలో శూద్రకుని 'పద్మప్రాభృత'కానికి ఇదే రచయిత అనువాదం 1969 ఏప్రిల్ భారతిలోను, వరరుచి రచించిన 'ఉభయాభిసారిక'కు అనువాదం 1972 సెప్టెంబరు భారతిలోను పాఠకులకు పరిచితము లయాయి. వాటిలో మూడవది ఈ 'ధూర్తవిట సంవాదం.'

పాట్నా ప్రచురణలో రామకృష్ణకవిగారు వ్రాసిన పీఠికలో ఈశ్వరదత్తుని గురించి చాల కొద్ది విషయాలే తెలిశాయి. అతడు బహుశా మగధ దేశస్థుడు. అతని భాణంలోని శ్లోకం 11 వ శతాబ్దపు భోజదేవుని శృంగార ప్రకాశికలో కనబడుతుంది. అదే శ్లోకం ఆ తరువాతి హేమచంద్రుని కావ్యానుశాసనంలో ఉంది. మరికొన్ని శ్లోకాలను మమ్మటుని కావ్యోల్లాసం ఉదాహరించింది. ఈ భాణంలోని 3 వ శ్లోకం ఈశ్వరసేనుడి రచనగా సుభాషితావళి అనే సంకలనంలో ఉదాహృతమయింది. దీనినిబట్టి ఇతడు ప్రవరసేన సర్వసేనులనీ ప్రసిద్ధిపొందిన రాజుల వంశానికి చెందినవాడా లని ఆశంకించారు రామకృష్ణ కవిగారు. నాట్యశాస్త్రం 22 వ అధ్యాయంలో భరతుడు చెప్పిన కొన్ని సూత్రాలపై చర్చయే ధూర్తవిటం అని కూడా వారు అన్నారు కాని, భరతుని నాట్యశాస్త్రానికి పి. యస్. ఆర్. అప్పారావుగారి అనువాదంలో ఈ చర్చకు మూలం అనదగిన సూత్రాల సందర్భం ఏదీ దొరకలేదు. దండి రచించిన అవంతీసుందరికీ ధూర్తవిటానికీ వర్ణనాశైలిలో చాలా సామ్యాలున్నా రెండవదే కొన్ని విషయాలలో మెరుగని రామకృష్ణ కవిగారు వ్రాశారు.

ఇది దత్తకుడు మున్నగువారు వ్రాసిన కామశాస్త్ర సిద్ధాంతాలపై చర్చ అని ఇందులోని ధూర్త విటులు తమ సంవాదంలో తామే చెప్పుకుంటారు. దేవిలకుడనే విటుడు వానకాలం రాగానే, ఆ ఋతువు అందాలను వర్ణిస్తూ కుసుమపుర రాజమార్గంగుండా వెడుతూ త్రోవలో వివిధ స్త్రీ పురుష పాత్రలను పలకరిస్తూ, వారి స్వభావ చరిత్రలను విమర్శిస్తూ, చివరికి వేశ్యావాటిక చేరుకుని అక్కడ ధూర్తుడైన విశ్వలకుడనే మిత్రునింటికి వెళ్లి, వానితో స్త్రీ పురుషులకు ప్రథమ సమాగమ ప్రణయ కారణాలు, సామాన్య నాయికల ప్రణయ కారణాలు, ప్రణయకలహ సందర్భాలకు, గోత్రస్ఖలనంవల్ల కలిగే ఉపద్రవాలకు ప్రతిక్రియలు, మున్నగు కామశాస్త్ర సిద్ధాంతాలపైని స్త్రీ పురుష స్వభావానుగుణంగా వ్యాఖ్యానిస్తూ చర్చించుకుంటారు.

విద్యయా ఖ్యాపితా ఖ్యాతిః
సజ్జనా రాధనం ధనం
తేషాం ప్రీత్యా భవేద్ధర్మ
ఇత్యస్మాక ముపక్రమః

అన్న భాణం ప్రారంభంలోని నాంది శ్లోకాన్ని బట్టీ

సత్వహ మతివర్తిష్యే
వేలామివ మహోదధిః
ఇమామపి మహీం పాతు
రాజా సాగర మేఖలామ్...

అనే భాణం చివరి భరత వాక్య శ్లోకాన్ని బట్టీ, భాణం చివరి భాగంలో స్వర్గలోకం, అప్సరసలు అనేవి అసలు ఉండడం చాలా అసందర్భమూ, అసంభవమూ అని చేసిన హేతువాదాన్నిబట్టీ, మౌర్యసామ్రాజ్యంలో

ప్రాధాన్యానికి వచ్చిన పాటలీపుత్రం లేక కుసుమపురం ఇందులో కథాస్థలం కావడాన్నిబట్టి కూడా ఆలోచిస్తే, శుంగవంశపు రాజులుగాని, గుప్తవంశపు రాజులుకాని ఆర్షధర్మాన్ని పునఃప్రతిష్ఠించే ప్రయత్నాలు చెయ్యక ముందే ఈశ్వరదత్తుడు క్రీస్తుకుపూర్వం ఒకటవ శతాబ్దానికి దరిదాపుల ఉండినవాడేమో అనీ నాకు (ఈ అనువాదకునికి) తోస్తుంది. బౌద్ధ ధర్మ ప్రచారం వల్ల స్థిరపడిన భావాలతో నాందీ శ్లోకం సాంప్రదాయికంగా బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతలకెవరికీ అంకితం చెయ్యకపోవడం మానవుని సజ్జనతనీ ఆరాధించడం, ధర్మానికే ప్రాధాన్యం ఇవ్వడం—చిట్టచివర శ్లోకంలో 'వేలను అతిక్రమించని నియతి' అనే సూత్రంతో తాను నడుచుకునేవాడిని అనీ, రాజు అదే సూత్రంలో మహిని పరిపాలించాలని చెప్పడం—భాణం మొదటిలోనే సమాజంలో కల్గినవారినీ లేనివారినీ స్మరించడం, ఇవన్నీ ఈశ్వరదత్తునిలంబ ప్రాచీన కవిలో మనకు ఈనాడు ఆశ్చర్యాన్ని కలిగించే ఆధునిక లక్షణాలు.

మిగిలిన భాణాలలోలాగే, ఇందులో కూడా ఒకే నటుడు ప్రధానపాత్ర అయిన విటుడుగా ప్రవేశించి, మిగిలిన పాత్రల నాటకాలను=సంభాషణలను=ఆకాశ భాషితాలుగా 'ఏమంటున్నావు— అలాగ' 'అనా' అనే విధంగానే మూలంలో రచించినప్పటికీ, అనువాదంలో మిగిలిన పాత్రలపేర్లు ఆయా సందర్భాలలో మార్జినులో మామూలుగా నాటకాలలోలాగ సూచించడమయింది. —రజని.]

సాంప్రదాయికమైన నాందీ ప్రార్థనానంతరం

సూత్రధారుని ప్రవేశం

సూత్రధారుడు

సజ్జనారాధనము, ధనసంచయమ్ము
ఖ్యాతి, విద్యచే లోక విఖ్యాతి బడయు,
ప్రణయ పూర్వక తదవలంబనమె ధర్మ,
మిదియె యిం ప్రాప్తి మా ప్రార్థనీయమునుడి.

కాబట్టి, మాననీయులైన పెద్దల వినోదం కోసం మేం ఒక ఆట ఆరంభిస్తాం. పెద్దలారా. కలిమి కలవారికి ఆనందం కలిగిస్తూ, కాసులేని వారు పేదకు జవ్వనపు ఒత్తిళ్లతోపాటు హెచ్చిస్తూ, కమలా; కేతకీ, నిచుళా, కకుభా, కందళి మొదలయిన రకరకాల పూలను విరివిగా అందిస్తూన్న యీ వాన కారులో హృదయాన్ని కదిలించే పాటొకటి పాడాలి. ఈ వర్ష ఋతువు సరిగ్గా ఎలా వుందంటే?

మబ్బు నీలిమయే ముఖలేపనముగ
మెరపే తళుకు బెళుకు తనులతగా
విరి గుత్తుల దుస్తుల మస్తాబయి,
వానకారు వచ్చెను విటరాలయి.

(సూత్రధారుడు నిష్క్రమిస్తాడు)

అప్పుడు దేవిలకుడనే విటుడు ప్రవేశిస్తాడు.

దేవిలకుడు:—బాగా చెప్పారు. అచ్చంగా ఎలాగంటే,

కలవారి యిండ్ల ఢంకా బజాయించు మ
బ్బులగుంపు వర్షధారలను నింపు;
కుపితయౌ లేమ భ్రూకుటి శరంగము వంటి
వంపు సొంపుల శంప వన్నె లలుకు,
చెలరేగి క్రమ్ము మబ్బుల చల్లనౌ గాలి
కవుగిలి బందాల కవల గలుపు,
వలరాజు వాడిమ్ముల నారిసారించి,
కాముక హృదులు గక్కాదల వదలు.
ఇంకా ఏమంటే.

మెరుగుడు రెదలందు పొరుగూరు పోయిన
ప్రియులు, నోంటరులగు ప్రియలు కూడి,
అవశలై యుందురు అలుగక బ్రతిమాలు
వారును, పాలయల్కా వనరువారు;
శ్లాఘ్యులు ప్రియలు పశం పదలగు నారు
లలనేల పశులౌచు మెలగువారు.
వినుడంచు జలద గంభీర ఘోషణముగ
కాలమ్మ వాన రాకడను తెలిపె.

అవును ఈ వానాకాలంలో సహృదయుల హృదయాలను ఆకట్టుకునే సంఘటనలు ఎంత సమృద్ధిగా జరుగుతాయో. సరిగ్గా ఇప్పుడేకదా వానమోసే మబ్బుల వల్ల చండభానుడి కిరణాలు వాడి తగ్గి పొలం మళ్లు చెమ్మతో చెలిమి చేస్తున్నాయి. ఎన్నాళ్లకి తర్వాతనో ఇన్ని సంగతులు సాధించగలిగినందుకు పగళ్లు సౌకుమార్యాన్ని సంతరించుకున్నాయి. మద్దిపూల సువాసనలో సొక్కిసోలే తుమ్మెదలూ, నాట్యంలో మునిగిఉన్న నెమలీ, చల్లదనాన్ని వెదజిమ్ముతూంది. తోటలు భ్రిమ్మరులకి విహారయోగ్యాలవుతున్నాయి. మట్టి ఉండలను దొర్లించుకుపోయే ఆరుద్ర పురుగులతోను,

అప్పుడే తలలెత్తుతున్న ఆకుపచ్చని కొదమగడ్డి మొలకలతో, వనభూములు, లత్తుకమెత్తని ఏసు దరాంగి అడుగులు మోపడానికైనా అనువుగా విలసిల్లాయి. అశుభ్రమైన నీటికాల్వలు చేరి, పట్టుతప్పిన గట్లతో నదులు దుశ్శీలలైన స్త్రీలలాగా అవగాహనానికి దుష్కరం అవుతున్నాయి.

మరీ యేమంటే
కడిమి విరుల కమ్మదనము
బడయుచు లోలోన తోటం బడుచుండెనదే
జడివాన. బహుమతులతో
గడపం జేరుకొను చల్లగాలికి వలెనే.

అందుచేత ఈ ఋతువు చాలా ఆహ్లాదకారి అని చెప్పాలి. కాకపోతే దాని రాకకై ఎదురుచూడరు కద. ఎందుకంటె,

ప్రజలు సుఖవంతులే కాని వారి మదులు
కడిమివిరి కమ్మదనములు కలయబారి
యుపవనమ్ముల ద్రిమ్మరిల్లు పవనాల
తోడ బరువెక్కు నుత్కంఠ దుర్దినముల.

ఈ ఉత్కంఠ రెండు విధాలు. కారణంవల్ల కలిగేది, కారణం లేకుండా కలిగేదీని. కారణంవల్ల కలిగే ఉత్కంఠకి చికిత్స ఉంటుందికాని, కారణం లేక కలిగే ఉత్కంఠ, తార్పుడుగత్తె దొంగయేడుపులాగా చికిత్సకు లొంగేదికాదు. ఈ ముసురు పట్టిన (దుర్) దినాలలో స్వేచ్ఛగా తిరుగాడే అవకాశాలు తగ్గిపోవడంచేత మా ఉత్కంఠ మరింత పెరిగిందనే చెప్పాలి. ఇప్పుడు వ్యాప్తమై ఉన్న మనోధర్మంలో మాఘుస్నే కట్టిన ఇల్లాళ్ల తియ్యమాటలు ఈ ఉత్కంఠవల్ల చెవుల కింపైతే కావచ్చుగాని, ఆవ్యాస బొత్తిగా తిరోగమనంగా భావిస్తాం.

బలే, ఇప్పుడు నిజంగా సుదినం అని చెప్పాలి.
మబ్బు విడిపోయి, సందడి మాటు మణిగి,
తాళవాద్యగతుల పాట తాళి నిలువ,
సౌధ మెక్కి రెక్కలు, పూరి, చాచుకొంచు
కేకి యుప్పొంగు హాయిలో కేకపెట్టు.

మీటి వదలిన తంత్రి కంపిస్తూంటే చలిగాలికి వణికిపోయే జవరాలి కౌగిటిలో వీణలాగ వీణా (శంపా) లత క్షీణమైన సూర్యకాంతిని సేవిస్తోంది. మంచి ముత్యాల సరాలు రాలిపడుతున్నట్లు మేడలపై నీటి గొట్టాలనుంచి వాని నీటి అవశేషాలు బైటికి చిమ్ముతున్నాయి. తేమగాలికి మెరుపు తరిగిన నిలువుటద్దాలను తుడుస్తున్నారు. అంతేకాక,

వేళమించెడుదాక విభునింట నలయు జవ్వనులు చేరుదురు గవాక్షములను,
నడుములు చలిగాలిం గడు బిర్ర బిగిసిన
కనక మేఖల విప్పికొని ధరింత్రు,
తోటలం దిరుగాడ, తోడుగా, వారముఖ్యల వెంటనడిపింతు కాముకాళి,
కొదమ పచ్చికం బోలు పదపద్మములనచ్చు
పడును లత్తుక కాము పటిమ తెలియ.

కాబట్టి ఈ ఉత్కంఠ, తీర్చుకోడం ఎక్కడా అని ప్రశ్న. ద్యూతశాలలోనా, లేక వేశ్యావాటికలోనా?

జూదానికో నమస్కారం— నా దుస్తుల్లో మిగిలిందల్లా ఈ శాలువా. పాచికలు—జన్మరహస్య మెరుగని సామంతుడిలాగా మనకి ఎప్పుడు పడితే అప్పుడు సుముఖంగా ఉంటాయి. అందుకని, వేశ్యవాటికకే వెడతాం.

ఈవులాకర్షించు నెదురు చూపులు, నవ్వ
తేనెల పలుకుల తియ్యదనము,
ఉరువైన పిరుదులు వరవక వదలిన
అతుల సంసర్గ మర్దానమ్ము,
చెలిమి చూపుటలును, చేతుల మార్పులు
నాయాయి రమ్యగుణావళియును
ప్రేమ వినాగ, లభించు వేశ్యలనుండి
జ్ఞాతోపచారులౌ జనులకెపుడు.

తెరవండి తలుపు.

లోపలి కంఠం : నువ్వు లోపలికి రావడానికి, చీమలపుట్టకి లాగే మా యింటికి చాలా ద్వారాలున్నాయి

దేవిలకుడు : మరో ద్వారం ఉంటె అది నగర రక్షక భటులకి పనికివస్తుంది. వాళ్లకికూడా ఎరిగున్న యిల్లు గుర్తుపట్టడానికే ద్వారం ఉపయోగం. చాలింక మా ప్రసంగం. —హాయ్ నా ప్రాణం ఎక్కడికో పోయింది. (పరిక్రమించి, చూసి) దీనికి సాటియైన మహానగరం ప్రపంచంలో లేదన్న ప్రతిష్ఠకి తగినట్లుగానే ఉంది కుసుమపురం. ఎత్తుగా వసతి గృహా

లెన్నెన్ని లేస్తున్నాయో ఈ నగరంలో. ఇక్కడి వర్తకసముదాయమూ, జనబాహుళ్యమూ సమకూర్చుకున్న సమృద్ధి సంపదలను చూసినవారికి అచ్చెరువు కలగక మానదు. ఎందుకయ్యా అచ్చెరువు అంటే — ఉండవచ్చు సమృద్ధిమంతములైన నగరాలింకా, అయితే, ఈ నగరపు అసాధారణ లక్షణాలేమిటంటే—

సులభులు దాతలు, కలలుసమ్మానిత
మ్ములు, స్త్రీలు దాక్షిణ్యభోగ్యలీలట,
ధనికులకున్మత్తతయె నాసి, నరులు వి
ద్యావినీతులును, మత్సర రహితులు,
శిష్టసమాజ చర్చితము సర్వము, పర
స్పర కృతజ్ఞులు జనుల్ సహృదయులును.
సుఖియింప శక్యమౌ సురలకైనను నిందు
స్వర్గమ్ము త్యజియించి జననమొంది.

ఓహో, శ్రేష్ఠిగారబ్బాయి కృష్ణలకుడు కదా. వీడు వేశ్యల పాలిట సఫలీకృత యౌవనుడై మావంటి పెద్దల వాత్సల్యానికి పాత్రుడైనాడు. వంశవృద్ధి ఆగిపోతుందేమో అనే భయంతో తండ్రి సాయశక్తులా కాపలా కాస్తున్నా. ఎలాగోలాగ వీడు వాడవేరుకుని, ప్రియురాలు లా జేయగా కరిగిన మేని మెరుగుతో తొందరగా ఇటే వస్తున్నాడు. తప్పక మెచ్చుకో తగినవాడు. కనుక వీడిని కలుసుకుంటాను. (కలుసుకుని) ఏవోయ్ కృష్ణలక, ఈలాగే సఫలీకృత యౌవనుడవు అవుతూ ఉందువుగాక. మాధవసేన యింటినుంచే కాదూ వస్తూ ఉంట?

కృష్ణి : ఎలా తెలిసిందో మీకు?

దేవి ఇక్కడ తెలియడానికేం వుంది? సరిపోయె జంటలను అలా కూర్చడమే పంచబాణుని పని. మరి నేను నీ బాగోగుల్ని పట్టించుకోనివాడిని కాదు. కాకపోతే, క్షణమైనా సందివ్వకుండా పొందు కోరే జవరాలిని వదిలి ఎక్కడికి బయలు దేరావు?

కృష్ణి : ఇదంతా మీ కిప్పుడెలా తెలిసిందో?

దేవి : ఇందులో అంత తెలియరాని సూక్ష్మం ఏం ఉంది చెప్పు—

అరచేత నా ముందర అశ్రులు నిండిన
కంటికి లోటుక గుర్తు కాదటోయి?
రేగి యిప్పటికి నిల్చెను జుట్టు తలపైని
పాత పణతికాన్క కాదటోయి?

తనువుచే వేరైతి, మనసా మేను త్యజింప
లేదంచు గ్రహియింప లేనటోయి,
గాలిదెబ్బకు పల్లటిలు కొట్టెడు నావ
యట్లొ దారి తారాడుదోయి.

కృష్ణి : ఇంతకీ ఇప్పుడు మా నాన్నని చూడబోతున్నాను.

దేవి : ఎలాగ?—ఈ వేషంలోనా? బడితె బాజా చేస్తాడు

కృష్ణి : మా నాన్నగాని నన్నిలాటి అవతారంలో చూస్తే ప్రాణాలే వదిలేస్తాడు.

దేవి : (తనలో తాను) అస్తమానం అంటిపెట్టుకొని ఉండగోరే ఆడదాన్ని వీడు వదిలి బయటపడడంకోసం వాళ నాన్న ఏం చెయ్యకుండా వదిలాడు? వయసువచ్చిన మగవాడికి ఈ తండ్రనే వాడు ఎదుట నిల్చున తలనెప్పి. ఒండొరులు కక్షదారా రెచ్చిపోయే పందెపు మోజుతో వెటకారాల విసుళ్లతో రక్తి పెంచుతూ తెలివైన మగరాయుళ్లకి గీటురాయనదగ్గ జూదం కేవలం చూడాలంటే కూడా తండ్రి చాటువాడికి వీలయ్యేది కాదు గదా. మరిన్ని, తునిగిన కలువ పూరేకులవంటి గోటిగిల్లులనుగాని, చెలిమి చమురువల్ల అంటుకొనే రంగు రంగుల మరకలనుగాని, తరుణి నిట్టూర్పులతో చెలరేగే కెరటాలనుగాని, ఆడ నెమళ్లలా మూసపోసిన పానపాత్రలనుగాని, వాసిన చూడడానికయినా వీలయ్యేది కాదుగదా. ఇరుపక్షాలుగా గోష్ఠులు తీర్చిన నెచ్చెలులతోపాటు అర్ధాసనాలలంకరించిన గణికాంగనలలో వగలాడుల చెంగట కిందువిూదు తెలియకుండా పందాలు వేసే పక్షి యుద్ధాలలో తీర్పరితనం నెరపడానికైనా వీలుండేది కాదుగదా. వెడదైన జారుడు గుబ్బలు కిటకీ కమ్ములకానించి, తొట్రుపాటుతో చాపిన మృదువైన చేతులూపుతూ పౌరవధువులు పరికించే మత్తగజాన్ని వెంబడించి పోవడానికి వీలయ్యేది కాదుగదా. చెలికాడిని చెరనుండి విడిపించడానికని, అరవిడిన అంగీతో విచ్చుకత్తిమాత్రం చేతపుచ్చుకొని, కోరి వరించిన పేదతనంలో, మండే ఉల్కలు రాలే పారాణి చాయ మాపటివేళ రాజమార్గాన చొరబడే అవకాశం ఉండేది కాదే. కలిగిన మేలుకు బదులు తీర్చేకాంక్షతో పొగడ్తకు లొంగని పొరపాటువల్ల కుంగదీసే కృతజ్ఞతా భారంతో తన సర్వస్వాన్ని మిత్రుడికోసం

త్యాగం చెయ్యకలిగేవాడు కాదు గదా. ఇవన్నీ సహించ వచ్చు. కాని, యీ తండ్రి బానిస కొడుకులు యౌవ నపు పొగరు తెలియని వాళ్లలాగ స్వయంగా వాడివాడి సెల డబ్బు సంచులు సంపడానికి కొడుకుల్ని కంటు న్నట్లుంది. అందుచేని, క్షత్రియ సంహారానికి పూను కున్న జమదగ్ని కొడుకు పరశురాముడిలాగ గొడ్డలి తీసుకుని లోకంలో పితృశేషం లేకుండా చెయ్యాలనే బుద్ధిపుడుతోంది. అలా చేస్తేగాని యీ లోకాన్ని లక్ష్యపెట్టరు కదా ముసలి బడుగులు! విచ్చిన తామర విరితేనె పరిమళంతోటి అమృత రసంలా తియ్య నైన వేశ్యా ముఖరసం మృతజీవినికూడ ఉజ్జీవింప జేస్తుందని తపస్వులకే తెలియదు. మరిన్నీ.—

వలుదైన పిరుదుల నిలిచి యుండని కాంచి,
అధరోష్ఠ మందించు నవశతయును,
ఊర్పుల నరికించు ఉరువైన వక్షమ్ము
జంకు కన్బొములును, జింకచూపు,
నిడుదయూర్పుల మాల్గు నిలువు గగుర్పాటు
అయిన నేళల పాలయల్కపూన్కి.
పొంగు మదముతోడ లొంగిపోకయు, వార
వనితచర్య లౌవని వశము మరవ.

కృష్ణి : మరో యిబ్బంది గురించి చెప్పనా బావగారికి ?

దేవి : ఏమిటది ?

కృష్ణి : మా నాన్న నాకు శోభనం చేయిం చాడు.

దేవి : సిగ్గు. సిగ్గు. ఇటువంటి సంకటం ఎవరికీ వద్దు మొర్రోయి. నేనింకా యిలాటి దుర్వార్త కూడా వినాలి. చేతులు పైకెత్తి ఏడ్వాలిసిందే. వేశ్యాప్రణయ రాజమార్గాన్ని విడిచిపెట్టి కులవధునే గొందిలో పడిపోతున్నాడయ్యా నిర్భాగ్యుడూ అని. ఇలా చూడబ్బాయి.

పుట్టుగుడ్డి, సురతమ్మున మొగము వాల్చు.
పలుక బోవదు లోజూపు పరచికాని,
హర్షమతికూడ దిగులొందునట్లు చేయు:
సిగ్గు తెరగప్పియుండు, కొంచెమును కూడ
కారణము లేక తేనె శ్రోణి కానబోదు:
మెడను త్రాటగట్టిన యజ్ఞమృగము వంటి

కుల వధువనేటి చెరసాల కోరి చొరక
యుండుటే నీకు కర్తవ్యమోయి మనస.

కృష్ణి : అదే నా నిశ్చయం కూడ బావగారూ.

దేవి : ఇదే నీ నిశ్చయమయితే మాకు సంతో షమే. మన నేస్తానికి తగ్గ నిర్ణయమే. వెళ్లిరా. ఇంటికొచ్చి స్థితిగతులు తెలుసుకుంటానులే. (పరిక్ర మించి) క్రిక్కిరిసిన జనసమూహంతో, తెరలు తెర లుగా తరంగాలావరించిన సముద్రంలాగా చొరబడ డానికి వీలులేకుండా ఈ కుసుమపుర రాజమార్గం చూడడానికి భయం వేస్తోంది. ఇక్కడ ఎలా వుందంటే—

చూచువా డేమాట తోచక మునుముందె
సాగు వేరొకపక్క సత్వరముగ,
సంకులమ్మగుచు నుత్సాహితమ్మగు జన
సందోహ మెడమిచ్చి జరిగిపోవు,
అదను మించగ నన్ను నాపడొక్కండును
మించెడు తన కార్యమెంచి యేమొ,
ప్రాపంచికజ్ఞుడౌ ప్రతిపౌరు డీ పురి
నాప్తయశమె లక్ష్యమైనవాడు.

విటరాయడి మనస్సులాగ ఈ రాజమార్గం తిన్నగా వేశ్యావాటికకే దారితీస్తోంది. అక్కడికే వెడలాను. నాకుమట్టుకు—

ఇట కలహ మొదవె, చేడియ
ఇటనే మరుగయ్యె చెలదు నీక్షణము మొగి
డ్చిట చకిత యయ్యె నను స్మృతు
లిటనట నుత్సుకత రేపు హృదయ మ్మందున్.

అమ్మయ్య. ప్రాణాలు లేచొచ్చాయి. ఇదిగో వేశ్యావాటిక చేరుకున్నాను. (స్పర్శ అభినయిస్తూ) హాయి హాయి.

సగము కన్పించునట్లు వేశ్యాముఖాల
కప్పి, తూగాడు నలకల గదిసి, పూల
చెండ్ల తేనెల సౌరు మోసికొని వచ్చు
వదినెవాడి యూరపువంటి వాయు విదిగో.

ఓ హోహో, కైలాస శిఖరంలాంటి ఈ సౌధాగ్రానికీ, వాడివాడిసెల రొమ్ముల కొత్తిడి కలిగించే గవాక్షాలూ, అగరు ధూపపు మబ్బులతో మసకబారిన పగళ్లూ, పూలతోరణాలతో కలకలలాడు గృహోప

ద్వారాలూ, ఘలు ఘలుమనే గజ్జెల ఒడ్డాణాల సవ్వడికి ఉవ్విళ్లూరే కాముకులూ, కాలి అందెల రవళి లాగే తెణంకాడే గొంతులతో పలుకరించే కలకంఠులూ కలిసి, ఇన్ని విధాల మదన కర్మాంతభూమియైన వేశ్యా వాటిక ఎంత వైభవంగా ఉందని. ఇక్కడే కనామరి వాలుచూపుల బాణాల విసుళ్లతో, పకాలుమనే నవ్వులద్వారా బైటపడే పలువరుసలతో ముడిచిన కనుబొమల కదలికల ననుసరించిన పలుకుల మెలికలతో ఉబికన రొమ్ములపై, నిలకడ కుదరని వల్కలాలతో, ఒయ్యారంవల్ల పయిజారే పైటలతో, కులుకులొలికే లలిత చపల గతులతో, కామదేవుడి విజయకేతనాలవలె ఇటూ అటూ తిరుగాడుతున్నారు గణికా పరిచారికలు. చిరునవ్వు వెలువారే ముఖాలవారు, వింతలేకయే వింత వెలార్చే కన్నులవారు తళుకు లొలుకు వంపుసొంపులు సన్నని పొడనాటితల కట్లవారు, ఉరువైన పిరుదుల బరువుమోసే మెల్లని నడకలవారు, మదించిన యేనుగుల నడకను సిగ్గు పరచేవారు వెల్లడియౌ వలపు చెయ్దాలతో కామరస పానీయమును పంచిపెట్టే చలి వేంద్రలలా ఇటూ అటూ తిరుగాడుతూ, పగల నెగజిమ్ముతూ ఆయిన గణికా దారికల రూపవిశేషాలూ విలాసాలూ కంటబడుతున్నాయి. మరిన్నీ, తొట్రుపడి రెక్కలార్చే పావురా జంటలతో ప్రాసాద పంక్తులు గర్జిస్తున్నట్లున్నాయి. ఎడతెగని మద్దెల దరువులు. ఆవతులనుఅంది పుచ్చుకునే శిల్పిజనమూ తమ తొట్రుపాటుతో పుష్ప తోరణాలను తునిగిపోయేటట్లు చేసే భృత్యజనమూ అన్యోన్యం పోటీ పడుతున్నారా అన్నట్లున్నాయి, భవనద్వారాలు. యుద్ధ శ్రమాపహారులైన గంధతైలాలను కలుపుతున్నారు. పీన పయోధరాలపైని పూయడానికి వర్ణలేపనాలు నూరుతున్నారు. మనస్వినీ జన హృదయసుకుమారంగా పూల దండలు గుచ్చడం నేర్పిస్తున్నారు. సకియ సల్లాపంలాగ చెవులను ఆ కట్టుకునేట్లు మోగుతోంది వల్లకి. ప్రియజనాధర దరిశనాభిలాషియై కదిలిపోతోంది మదిం—మరిన్నీ

కన్నులరమోడ్చి, లజ్జనగవు నలర్చి,
కారణము చూపి చిన్నవి కానిచ్చి,
శ్రవణ సుఖముగ నల్పభాషణ లొనర్చి
మందమగు నూర్పుల స్వభావ మధురతాల
గతుల గీతులతో గణికాజనమ్ము
వదలనీ డున్నీ డమ్ములపాదిని మదను.

(ముందుకుసాగి) ఓహో' ఇదిగో వారుణిక. ప్రాయపు పొగరుతో ఉత్తరీయంబదులు రొమ్ముపైని పెలసమైన అంశకం చుట్టుకుని, పిరుదులను నీవితో అలంకరించుకుని, ఒయ్యార ఒలకపోసేటు ఒక చెవికిమాత్రం కర్ణపాశంలో బెదురులేడి చూపులతో తెరచిన పై పెదవి ముడుచుకుని అప్రయత్నంగా వచ్చేనవ్వుతో మునీశ్వరుల హృదయాల్నికూడి దడదడలాడేట్లు చెయ్యగల జాణ—మదన సేన—పరిచారిక వారుణిక ఎడమచేతి వేలితో కరోత్పలాన్ని సర్దుకుంటూ ఒక కనుబొమ్మ కొంచెం పైకెత్తి నన్ను చూసి నవ్వుతూ దాటిపోతోంది. దీనిదే కదా—

ఉరుపు పిరుదులనొప్ప నీ యువిదే చెక్కు
పైని పులకల దర్శించు భవ్యుడెవడొ
చెవిని ముడిచిన కలువపూ చెంపదగిలి
మాటలేనట్టి మధుర చుంబనము గొనడొ.

దీనితో మాటాడకుండా దాటిపోవడం యెవరి తరం? ఇప్పుడు దీన్ని పలుకరిస్తాను. పిల్లా వారుణికా, నిన్ను నువ్వు అదుపులో ఉంచుకో. ఆయ్ నా మాటలు విదిలించేసుకుని ఎలా వెళ్లిపోతోందో అమ్మాయి, నీ నిర్లక్ష్యమూ మీకు ఆనందమే కలిగిస్తుంది. నవ్వి ఎలా నిలబడిపోయిందో.

వారుణిక : దణ్ణాలు.

దేవిలకుడు : చేమోడ్పులు చాలు. నిన్నొకటడగా లిప్పుడు. శరత్కమలపు పుప్పొడి పచ్చందనాలు పూసుకుని మింటి కెగయబోయే జక్కవ జంట లాంటి నీస్తనయుగళపు ప్రథమావతారం యెవనిచేత సుఖాన్ని పొందగలదో.

వారుణిక : హి.

దేవిలకుడు: హి అని శబ్దంచేసి, సిగ్గుతోచూసి, తనమాట సగమైనా పూర్తికాకుండానే వెంటనే నన్ను చేరుకుంది. ఇది కదా కాముని పెన్నిధి. (ముందుకుసాగి) ఓహో. ఇది బంధుమతిక కాదూ-తన ఇంటి గుమ్మంలో నిలబడి పక్కనున్న చతురిక చెప్పేమాటలు వింటూ, ముంగురులు కప్పే కనుబొమ్మలతో, సాయం సంధ్యా కమలంలాగచూపు మొగిడ్చి, తన ఒడ్డాణం సరిచేసుకుంటోంది. ఈ చేష్ట ఆమె ప్రాయానికి తగినట్లుంది. హాయ్ హాయ్ సుకుమారంగా ఉంది

ఆమె ఒయ్యారం. ఆమె శ్రద్ధ ఎంతో లలితంగా ఉంది. ఓహో—ప్రయత్నించి చూపుతోంది కార్కశ్యం. దర్పంతో మోటనూలు బిగించి ఎందుకని ఏం మాటాడదు? ఈమె విహార సమయ చాతుర్యానికి చెయ్యెత్తి జేకొట్టాలి. ఇదిగో దగ్గరకు వెడతాం (వెళ్ళి) పిల్లా, పని బాగా సాగాలని నీకు మా ఆశీస్సు. ఈ ఆసనం చాలు. నిన్నొకటడగనా ఇప్పుడు?

కాముక జనములకై ప్రేలి నెచ్చెలి, బొద్దు
చెలమ యూటమునుగు తేప, మెరపు దూయు
వర్షమేఘంపు రుచిరత, కర్కశత్వ మొర్వ లుగు
కట్టె కాముని వింటి నారి, కమనీయ జఘన కల
స్వనమ్ము మేఖల యిదియేల భిన్నమయ్యె సకియ
చెప్పవో రతి సుఖాభ్యాస యోగశీల అక్షమాల.

లేదా ఇక్కడ తెలిసికో తగ్గ దేవిటంటే -
ఎడమైన నలువతో నేకాంతమున శయ్య
నిను ప్రీతి ప్రియుడు కాంక్షించు వేళ—
ఉన్మత్త మాతంగి యుత్తమాంగ వపుస
వాడయో ద్రేకమ్ము నూను నట్లు
ఒడలంటు నాశతో నుసుకబోయెదు నీదు
ఉరువైన పిరుదున కోసి యెర్ర
కన్నుల దాన నీకాంచీపథము కూర్చు
తెగిన తీగవల్ల నగు విరసిత.

వంచిన ముఖంతో ఎలా నుంచుందో. నా మాటకు జవాబు లేదా? ఇక కదులుతాం.

బంధుమతిక : కదలడానికి వీల్లేదు.

దేవిలక: అబ్బ. మంత్రానికి కట్టుపడ్డ పాములాగ యింది నా పని. ఎలా వదలడం? చస్తిమిగదరా. (ముందుకు సాగి చెవియొగ్గి) రామదాసి ఇంట్లో ఎవరిదో ఆడగొంతు ఏడుపులా ఉంది. దీనికి చాలా కారణాలుండొచ్చు. అయితే ఇప్పుడు ఎందుకు ఏడుస్తోందో? ఏమంటే—

ఒపిక తడబడు కోపగించిన గొంతు,
నీరసమ్మగును విచారమందు
తెగి జీరపడు ప్రేమ తెల్పుచో,
మూగవోయెదు భీతి, హర్షాన నడకువుటు
తొలుత నోపమితోడి తొందరపాటుమ,
ఆగియాగి పిరుందన డరుటగుఱ
తెల్లనయ్యే నీమెకీని పరిస్థితి
కుపితయయ్యు వలపుగొన్న దనుచు

ఆ ఏడిచేది రామదాసియే—మరొకటి కాదు. కనక లోపలికి వెడతాను. (వెళ్ళి) అది తనే. తానే నన్ను చూడగానే మరింత బావురుమంటోంది.

కను కొలకు లంట జారెడు
తన కోపపు బరువు నెల్ల తామే భరియిం
చిన యశ్రు జలకణమ్ములు
తన ప్రియునపరాధములను తా మెంచు నటుల్.

ఓసి కోపరిదాన, ఏమిటిది ?

కమలనీ ద్వయిమించు కనుదోయిలో నిండి,
అందుండి పయనించి యధరమునకు,
అటనుండి దిగజారి పటువైన చనుదోయి
కాస్పద మందక యచటనుండి,
శోకాన జారు నశ్రులు నీదుతనుగత
రోమపంక్తులలోన లూనములయి,
ప్రియువేలి కొనగోటి క్రీడాస్థలంబైన

నాభి బిలము పూరణమ్ము సేయు.

కుంజరకుపి ప్రసర్పన అతని స్వభావానికి తగినట్లుగా లేదు.

రామదాసి : అసలు ఏమయిందంటే—ఏరాలి పెదవి గంటుతో నన్ను చేరవచ్చాడు. వాకు ఒళ్ళు మండి కోప్పడితే బైటికి వెళ్ళిపోయి, ఇన్నాళ్ళయినా ఈనాటికి తిరిగి రాలేదు.

దేవిలక : హహ్హాహ్హా, తప్పులమీద తప్పులు. ఒకతప్పు చేసినవాడికి అన్నివిధాలా కులంనుంచి వెలి వెయ్యడమే దండనకదా, అలాంటప్పుడు ఇన్నితప్పులైతే. అందుకని మేఘమండలావృతమైన కాలాన్ని నిరీక్షిస్తూ దుర్జనుల దురుసు తనాన్ని సహింతుముగాక. ఇటీవల అన్యోన్య బద్ధవైరులయిన రాజ్యాధిపతులే పరస్పరం రాజీకి వస్తున్నారు. శిరీష కుసుమసుకుమార చిత్తలయిన కామినీ జనం సమాధానానికి రావడం ఏమంత కష్టమైనపని ? నా మాటలపై నీకు లక్ష్యం ఉంటే, సమయం చూసి ఈవేళే నీ ప్రియుణ్ణి కుసుకో.

హర్మ్య శిఖరాల నంటి ప్రేలాడు మబ్బు
చీకటుల, రాత్రివేళ, చీల్చుకొని, యిండ్ల

తూరలందు వెల్వడు నీటిదార జారు
నవ్వడులు నిండు మార్గాన సాగిపోయి,
చేరి నీప్రియు, వానమోసేటి గాలి
వణకి పోయేటి తనువుతో వాయు వెచ్చ
దనమునకు మోవి యదరుట తాళి, పిరికి
దాన, యెదవిప్పి కోవె రత్యన్తరమున.

బలే రెండు చెంపలా పొడమిన పులకరింతల ద్వారా నా సలహాకు అంగీకారం ఎంత చక్కగా తెలియజేసిందో. ఇక కదులుతాం. (ముందుకు సాగి)

ఓహో ఇదిగో రతిసేన—లోపలి గదిలో ఉండి పొదంచేత మొహం కప్పివేసిన చెమటబొట్లతో, అందమైన అరమోడ్పు కళ్లదూరం కానని చూపులలో, చెంపలపక్కల చిక్కుకుపోయిన ముంగురులతో, దిగజారని జవాలి పొంగులో, చూస్తే, ఇప్పుడే మేలుకొన్నట్లుంది. అదిగో, కిటికీ దగ్గరకు చల్లగాలిని సేవించడానికి చేరుకుంది. మంచి రమణీయమైన అవస్థలోనే ఉంది పలకరిస్తానిప్పుడు దీన్ని. (దగ్గరకు వెళ్లి) పిల్లా, సౌభాగ్యవతీభవ. సంజకెంజాయ మిగిలిపోయిన తూర్పుదిశలాగ ఉట్టే ఉండిపోయిన ఆ కాస్త నుదుటితోటే నిన్ను చూసి, బాసనం చేజారిన మన్మథుడు కూడా దిగులుపొందగలడు. ఇంక తదితరుల సంగతి చెప్పేదేమిటి?

మాట కోల్పోలేదు తేటదనమ్మును,
తొలుగాటి మృదుత్వమే నిలిచియుండె,
కనుగల్వలం దెరదము మాయదు సుంత,
నీడు ధోరణలేదు వీడకైన,
మనసులో పైకొను మధుర స్మృతులతోడ
ముఖమును క్షణమును మురిసిపోవు;
గుణముల పరిణతి గొప్పనై నీయందు
నిలిచె మదము దోషముల త్యజించి.

రతిసేనా, నీకు లోపలికి వెళ్లవలసిన తొందర పనులుంటాయి. నాకు నేనై నిన్ను వదిలివెళ్లడానికిష్టపడననుకో. అదే—నవ్వి కిటికీ ఎలా తటాలున మూసిందో. అబ్బ. విడిపోయాం. అబ్బ. ఆమె దూరం కావడంతో నా మనస్సెక్కడికో పోయింది. (ముందుకు సాగి.)

ఇదుగో ప్రద్యుమ్నుదాసి. అప్పుడే జతవిడిచి రావడంలో అలసిన చెక్కిళ్లతో, కళ్లు పెద్దవిచేసి చూస్తూ, బొట్టు చెరిగి జేగురువారిని నుదుటితో, చెదరిన ముంగరుల శోభలో రతిశ్రమను భరిస్తున్నట్లున్న ముఖంతో నీటి అడుగునుండి మెరిసే అశోక కుసుమచ్ఛాయలలాగ జఘనాంశుకం లోపలినుండి తొంగి చూస్తున్న సరకొత్త నఖక్షతాలతో, పొరులో కుసుమం విడిచిన అడుకాచులా రతిశ్రమలో నలిగిపోయిన నగలతో, గాలిలో పెట్టిన దీపంలా కదలాడిపోయే చేతితో అడుగు పెదవి లోపలికి కరచుకుని, ఒక అంగలో నూరు అంగలువేస్తూ వెంబడించే పసిపిల్లలాగ నడుస్తూ, వేశ్యావీధికి అలంకారంగా సాగిపోతోంది. ఈ చిన్నది నా కిష్టం. దీనితో కొంచెం పరిహాసమాడాలి. (దగ్గరకువెళ్లి) క్షతగాత్రుడైన యోధునిలాగ పొగడదగిన చెలువుని పలుగాట్లతో మెరిసే నీ అధరాన్ని ఎందుకు కప్పుకుంటున్నావు? ఎలా నవ్విందో. పాపం. నేను తప్పు పట్టినందుకు తన లోపాన్ని ఏకరించుకుంటోంది. మెల్లగా పెదవి విప్పినా ఆమె నవ్వు దంతక్షతాలవల్ల ఆమెకు వికృతంగానే ఉంది.

నిదురమూర్చున లేచి వడి చన్నుగవ, చన్ను
గవ యదర్పున పొత్తికడుపు స్రుక్క,
ఎగుదిగు బొమలలో నింపు హెచ్చగ చూపు,
గాయాల విసర ముంగియి కలువలు,
అన్యపాలితయయ్యు నట్టి జవ్వని నవ్వ
వెకిరింతగుగాని వీథి ప్రజకు,
గాటుపడ్డ పెదవి తలయింతి మోమున్న
పొట్టపగుల నవ్వు పుట్టు గదె.

ప్రద్యుమ్న : శానాళ్లకి అవుపడ్డారు బావగారు.

దేవిలక : ఈ పాతకపు మునురురోజున ఇటొన్లో కట్టుపడిపోవలసి వచ్చింది. (అయితే) ఇప్పుడు నీ అనుగ్రహం ఎవరికి దక్కిందో.

ప్రద్యు : రామిలకుడి యింటినుంచి వస్తున్నా,

దేవిలక : తగినట్టుగానే ఉంది జంట. స్థిర మవుగాక. ఓహో, రామిలకుదు ఒక్కడూ (తానై) మదనాగ్రహారం చేజిక్కించుకున్నాడయ్యా. ఎలాగంటే,

సగముపయి నిండు నెల వె
ల్గగ మెరసే కోరనుండి క్రోలు నటుల నీ
మొగమున నగ వాను జవ్వను
డగు ధన్యుదు నడుము సన్ననౌ నెరజాణా.

పిల్లా, దుష్టవకుల బారినుండి రక్షించు కోవాలి నీ అధరాన్ని. పోయిరా. మేమూ కదులుతాం. (ముందుకుపోగి) ఓహో ! ఈ యింటి తలుపు, దారినిపోయే బాటసారుల దాడికి భయపడి, నిద్రపోయే కుంభకర్ణుడి మొహంలా యెప్పుడూ మూసుకునే ఉంటుంది. ధూర్త దంపతులు విశ్వలకుడూ సునందా కాపురం ఉండే దిక్కడే. భక్షిత సరస్సుడైన నగ్న శ్రమణకుడికి లాగా విశ్వలకుడికి శరీరం మాత్రం మిగిలింది. సునందకి డబ్బుకి ఇబ్బంది రాబోతున్నాకూడా అది తనకి ఇష్టమైన ప్రియురాలు కనక ఊరి పొలిమేర దాటిపోని కాకిలాగా దాన్నే కనిపెట్టుకుని ఉన్నాడు. దిగజారిన యౌవనంతో ఆదికూడా నట్టడివిని శుష్కనదిలాగా ఇంకెవ్వళ్లకీ పనికిరాక, విశ్వలకుణ్ణే అంటిపెట్టుకుని ఉంది. అంచేత ఈ జంటని పలకరించకుండా వెళ్లడం భావ్యంకాదు. (చెవి ఒగ్గి) ఎవరో ఇక్కడేదుస్తున్నారు. ఎవరక్కడ. నడుస్తున్న గుర్రపు డెక్కల చప్పుడు లాగే కొయ్య పావు కోళ్ల సవ్వడి వినిపిస్తోంది. విశ్వలకుడు ఇక్కడే ఉన్నట్టున్నాడు. అరే పాపం...వాడే అలా ఏడిచేది.

విశ్వలక : ఎవరది—గాడిదలా అరుస్తున్నాడు.

దేవిలక : నేను యముకింకరుణ్ని. సునంద కోసం వచ్చాను ..నా గొంతు గుర్తించి ఊరుకున్నారు... ఏం తలుపు తియ్యవేం ? సరే అలాగే నిలబడు. ఇదిగో శాపాగ్ని రాచబెడుతున్నాను.

వలపు చెలరేగు వేళను
కలహమ్మున నందె ఘల్లు ఘలుమను ధ్వనితో
వెలయాలి యెడమ కాలికి
తల నీయది దూరవౌచు తలగును గాతన్.

ఇదిగో తలుపు తెరుచుకుంది. ఇప్పుడు లోపలికి వెడతాను.

విశ్వలక : బావగారికి ఆత్మీయులం కమా మీరీశాపాన్ని ప్రసాదించడం న్యాయమే మరి.

దేవిలక : బాగా చెప్పావు. ఇటువంటి శాపం బ్రహ్మలోకాన్ని కూడా కంపింపజేస్తుంది. ఇక నీలెక్కేవిటి ? కనక, ఇప్పుడు ఈ శాపానికి విరుగుడుగా ప్రాయశ్చిత్తం. ఎలాగంటే.

కుదిరేది యెగిరి సుడియుచు
కదలే యలలెర్రకలువ కాంతుల చిమ్మే
మదిర నొసగంగ దగు నీ హృదయు
కుటుంబిని కవశ్యమిదె పరిహారమ్.

ఇదో కూర్చుంటున్నాం. (కూర్చుని) కాళ్లు కడుక్కోడం అయినట్టే. కుసుమపుర రాజమార్గం ధూళీ, దుమ్ములేక పోవడంలో ప్రాసాదావరణాలను తలదన్నింది. నా పాదాలు కర్తవ్య నిర్వహణలో దారి తప్పవు.

విశ్వలక : రామిలకు నింటిలో ఒరిగే గోష్ఠులలో సమావేశం అవుతూండే విష్ణుదాసూ మొదలైన సదస్యుల పరస్పర చర్చలలో కామశాస్త్రానికి సంబంధించి కొన్ని సంశయాలు బయలుపడ్డాయి. వాటిని గూర్చి వారికెవరికీ సమాధానాలు దొరక్కపోవడంతో నా అసంభవాన్నిబట్టి వివరించమని నన్నడిగారు. నాకు తోచినవి వాళ్లకు చెప్పాను. దేవిలకుడు బావగారికి కూడా ఆ నా అభిప్రాయాలు వినిపించాలని కోరిక. ఆ సందర్భాలలో బావగారు ఏది చెపితే అది మాకు ప్రమాణం అవుతుంది. ఈ విషయాలు చెప్పాలని మీయింటికి స్వయంగా వద్దామనే అనుకున్నాను.

మరిప్పుడు తానై బావగారే మాయింటికి దయచేశారు. బావగారు ఒక్కక్షణం ఆగితే చెపుతాను మరి.

దేవిలకుడు : కానీ సిద్ధంగా ఉన్నాను. నా ఓపిన కొలది చెపుతా. బుద్ధి కుదురులేని నీలాగే గాలికూడా ఈ కుటీరాన్ని వదిలిరాదు. అంచేత చిరకాల స్నేహం

చేత నే ననలే వదలలేను. నీ కిష్టమైతే పచారు చేస్తూ మాటాడుకుందాం. ఈ గోష్ఠీశాల విశాలంగా ఉంది.

విశ్వలక : అవును. అది దోషం కాదు.

దేవిలక : (లేచి) చెప్పు మరి.

విశ్వలక : పురుషులతో వేశ్యలకు పొత్తు కూర్చేది డబ్బే అయితే, వారిలో ఉత్తమ, మధ్యమ, అధమ వర్గాలను తెలుసుకోవడం ఎలాగ?

దేవిలక : దానం అనేది సర్వసామాన్యంగా లోకాన్ని వశపరచుకునే గుణం. విశేషించి వేశ్యల విషయంలో మరిన్నీ. అయినా కూడా మరో విశేషం ఉంది. పరాపరజ్ఞులేమన్నారంటే—

దానమున రాగమును చెందు తరుణ వేశ్య
'యధమ', అట్టులే నిష్కారణానురక్త.
యౌవనాన్వితు రూపమ్ము, ఈవి, వలచి
హర్షమును బడయునట్టి యాయతివ 'మధ్య'.
దాత, వీత మత్సరుని, రూపాతిశాయి,
మంచి వయసు, దాక్షిణ్య, సమ్మాన్యతగల
నరుని సేవింప 'నుత్తమ'నారి యనరె.

విశ్వలక : కామపూరితయైన వేశ్యను ఎలా గుర్తించడం?

దేవిలక : చెపుతాను. విను మరి.

గేయం : సూదంటు నరకంటి చూడ్కుల చెళకులు,
చిరునవ్వుతో మోము చెలువొందు బొమ ముడులు—
చప్పట్ల రూపుతాల్చే వాక్యలేశాలు,
చూచిన వెంటనే సురుగు హాసాలు—
కప్పు వెల్వడెడు చంకలు, నాభియు, స్తనాలు,
చీటికి మాటికి చెయితాకు మొలనూలు,
బరువైన యూరుపుల వగరుపుల్—సూచనలు
మరునమ్ము గురికొన్న మదవతి నెరుగంగ.

విశ్వలక : స్వాభావికమైన టక్కులమారితనం వల్లగాని, వేశ్యాజనానికి పారంపరికంగా పట్టుబడ్డ నిష్ఠాపరత్వవల్లగాని కామచిహ్నాలు బహువిధాలని చెపుతారుగదా. అటువంటప్పుడు ఇది అసలయిన కామపూరిత అని ఎలా తెలుసుకోడం చెప్పండి బావగారు.

కనుల నీయునిండ, కలుగ నిట్టూర్పులు,
కొలకులందు చెలిమి నొలుక చూపు,
చిక్కి, పాలిపోయి, చెమటచుక్కలు లేచి,
చెంత కాసదెల్ల చెలి పోయి
నపుడు కూడ భావనాసక్తి ప్రార్థించు
చెలియ భావశుద్ధి చెప్పవచ్చు.

(ఇంకా వుంది)

ముద్రణాలయంలో ముప్పు

శ్రీ వేలూరి సహజానంద

ముద్రణాలయంలో
స్వరాజ్య ముద్రణాలయంలో
సమ్మె చేసినై 'అచ్చులు'
విరగబడుతున్నై హల్లులు
తిరగబడుతున్నై అచ్చులు
ఆవులిస్తున్నై అక్షరాల ఉచ్చులు

హల్లులకూ అచ్చులకూ మధ్య
చెలరేగే హాలాహలం
కంఠస్థం చేసుకోలేక......
కంపోజిటర్ల చేతుల్లో
చినిగిన కాగితాల చొక్కాతో
బైటపడ్డాడు కవి జనంమధ్య
జారిపడ్డది కవికలం జనం చేతుల్లోకి......

ప్రకటించిన పుస్తకం ఏది?
పాతిక వర్షాల ప్రజాకావ్యం ఏదయ్యా?
కృతిభర్తలం మేం......కృతిభర్తలం మేం—
సవాళ్ల రివాల్వర్లలోంచి
దూసుకొని వచ్చింది కలం
కవి గుండెలో గుచ్చుకుంది
గుండె నిండా ఎర్రసిరా !

ముద్రణాలయంలో
స్వరాజ్య ముద్రణాలయంలో
సమ్మె చేసినై 'అచ్చులు'
అక్షరాల ఉచ్చులు !

బ్రతుకు తెరువు

హిందీ మూలం :

డా. మహీప్‌సింగ్

అనువాదం :

శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

వాళ్ల బలవంతంమీద నేను భోజనం చేసిన తర్వాతనే ఇంటికి వెళ్దామని నిశ్చయించుకొన్నాను. నేను వాళ్లయింటికి వెళ్లి ఐదేళ్లు దాటినా, అతని భార్య చేతివంటకాల ఘుమఘుమలు ఇంకా మరచిపోలేదు. అతని భార్య వంటచేసే ప్రయత్నంలో మునిగిపోయింది. అతని కూతురు ఓ మూల కూర్చొని కూరగాయలు తరుగుతున్నది. ఆ జానెడు గదిలో నేను కూర్చొనలేకపోయాను. అలా బయటికి వెళ్లొద్దాం పద' నేను అతన్ని పిల్చాను.

మేమిద్దరం అలా రోడ్డుపైకి వచ్చాం. బొంబాయికి నలభైమైళ్ల దూరంలోవున్న ఆ ఉపనగరంలో ఇళ్లు అక్కడక్కడ విసిరివేయబడ్డట్లు చాలా దూరంవరకు వ్యాపించి వున్నాయి. భూమి మిట్టపల్లాలుగా ఉనందువల్ల అక్కడ కట్టబడిన ఇళ్లుకూడ ఎగుడు—దిగుడుగావుండి ప్రకృతి సహజ రూపాన్ని ప్రదర్శిస్తున్నాయి.

'ఎలా వుందోయ్ జీవితం?' నేనడిగాను.

'ఫరవాలేదు. బండి సాగుతూ వుంది' అతడన్నాడు. అతని పొడి సమాధానం వినగానే సంభాషణ పొడిగించటం అతని కిష్టంలేదని నేను వెంటనే గ్రహించాను.

'నీవేదో కంపెనీలో కమిషన్ ఏజెంట్‌గాకూడా పని చేస్తున్నట్లు నీ భార్య చెప్పింది.

'నాకు నెలసరి ఆదాయం ఠంచనుగా రావటానికి గట్టి ఉద్యోగం ఏదో ఒకటి వుందని ఆమెను నమ్మించాలని నేనా విధంగా అబదం చెప్పాను. కాని వెలిగిస్తున్నది అదే వుద్యోగమే.'

దూరంగా పోయి పోయి మేము ఓ వంతెన మీద కూర్చున్నాం. వంతెన క్రింద మురికి కాల్వ మోతగా పారుతున్నది. దుర్వాసన ముక్కులను బద్దలను కొట్టేస్తున్నది.

'మొదట్లో నీవు పత్రికల్లో సినిమా ఇంటర్వ్యూలు వ్రాసేవాడివి. ఈమధ్య ఆపేసినట్లు తోస్తుంది.'

'నేను ఇప్పుడాపని ఎక్కువగా చేయటంలేదు'

నేను బాధపడ్డాను 'నీవు ఆ పని చెయ్యటం లేదు. ఈ పనీ చెయ్యటంలేదు. మరి ఏ పని చేస్తున్నట్లు?' అతన్ని నిలదీసి అడగాలనిపించింది. కాని యెలా అడగాలో తెలియక వూరకుండిపోయాను.

చీకటి రాక్షసి చేతులు చాస్తున్నది. అతని ముఖం నాకు మసకమసకగా కనపడసాగింది. రోడ్డు ప్రక్కనవున్న లైటు స్తంభం కాంతికూడ అంతంతమాత్రంగానే వుంది. కాని అతని ముఖాన్ని, పదేపదే నాకు చూడాలనిపిస్తున్నది. నేను సుమారు ఐదేళ్లతర్వాత అతన్ని చూస్తున్నాను. అంతకుముందు ఇరవైయేళ్లు అతని ముఖం ప్రతిరోజూ ఎన్నోమార్లు చూశాను. ఆరోజుల్లో అతని ముఖాన్ని చప్పున గుర్తుపట్టేవాడిని. అతని మనోగతభావాల్ని ముఖకవళికల ద్వారా అట్టే చదివేసేవాడిని.

కాని ఈరోజు అతని ముఖంలోని భావాల్ని పసిగట్టలేకపోతున్నాను. వాడు ఓ పట్టాన అర్థమయి చస్తేనా ?

చివరికి నేను వాణ్ణి నిగ్గదీసి అడిగాను. 'నీ విప్పుడు ఏం వుద్యోగం వెలగబెడుతున్నావో వున్న దున్నట్లు చెప్పవోయ్.'

వాడు తాపీగా అన్నాడు. 'నేను వివరంగా చెప్పినా నీకు పూర్తిగా అర్థంకాదు. ఈ సినిమా రంగమే అంత, వంకరటింకర త్రోవ; కొరకరాని

కొయ్య. నేనీ లైనులో 15 ఏళ్ళుగా పనిచేస్తున్నాననే విషయం నీకు తెలుసు. కొత్త—పాత తారలను సినిమారంగానికి పరిచయం చెయ్యటం, వాళ్ళకు పబ్లిసిటీ ఇవ్వటం, నా సొంత సినిమాకు కావలసిన ఏర్పాట్లు చేసుకొనటం— ఒకటేమిటి సవాలక్షపనులు చేస్తుంటాను.

మధ్యదారిలో ఎన్నిచోట్ల ఆగుతానో నీకర్థంకాదు; నీ ఊహకందదు. ఐనా ఓ విషయం అర్థంచేసుకో. ఓచోట విశాలమైన, చక్కని రాజమార్గం వుంటే, మరోచోట ఇరుకైన చీకటి సొరంగమార్గం వుంటుంది. ఓచోట సముద్రం వుంటే, వేరేచోట దుర్వాసన కొట్టే మురికికాలువ వుంటుంది."

"నీవు ఈ వెధవ సినిమాలైను వదిలి, జీవితం సుఖంగా, సాఫీగా గడిచిపొయ్యే మరోమార్గం ఎందుకు చూసుకోకూడదు ?" నేను సలహాఇచ్చాను.

అతడు నావైపు చూసి పేలవంగా నవ్వాడు. ఆ నిర్జీవమైన నవ్వులో నాకు మొదటిసారిగా నా పాత స్నేహితుడు దీనంగా తొంగిచూసినట్లు అగపడ్డాడు.

"ప్రపంచంలోని బ్రతుకు తెరువులన్నీ నాకు మూతపడ్డాయి. ఇదొక్కటే శరణ్యం. చచ్చినా, బ్రతికినా దీన్లోనే" మెల్లగా, క్షీణస్వరంలో అన్నాడు.

"ఈ లైనులో నీకేమైనా భవిష్యత్తు ఉందంటావా ?" నేను కుతూహలంగా అడిగాను.

"భవిష్యత్తా...? ' అతడు మరలా నవ్వాడు. "సినిమారంగంలో లక్షలాది ప్రజలు భవిష్యత్తు ఉందనే ఆశతోనే జీవిస్తారు. కాని ఆ భవిష్యత్తు ఎక్కడవుందో, ఎంత దూరంలో వుందో ఎవరికీ తెలియదు. కాని దూరంగా ఆకాశంలో మినుకుమినుకుమనే తారలా అందరికీ అగపడుతూ వుంటుంది,"

నేను తలెత్తి చూశాను. మా తలమీద సరిగ్గా ఓ నక్షత్రం గుడ్డిదీపంలా ఎర్రగా వెలుగుతూంది.

"కడచిన ఐదేళ్ళలో నేను నీకు ఎన్నో వుత్తరాలు వ్రాశాను. ఎంతోమంది ద్వారా కబురు పంపించాను. నీవు కనీసం ఒక్కదానికైనా బదులిచ్చిన పాపాన పోయావా ? నీవు ఏ పనైనా చెయ్, నేను కాదన్నానా? కాని మిత్రులను, శ్రేయోభిలాషులను మరచిపోవటం ఏమీ బాగు లేదు' నేను కాస్త కటువుగా అన్నాను.

'మిత్రులు! ..శ్రేయోభిలాషులు!...ఎవరికి?' నా వైపు అతను నిశితంగా చూశాడు.

'ప్రపంచంలో ఏదో ఓ విధంగా బ్రతుకుచున్న వారికి వీరందరూ వుంటారు. కాని నేను అలా బ్రతుకుచున్నానా? బ్రతకాలనే ఆశనే ఊపిరిగా పీలుస్తూ బ్రతుకుచున్నాను. నిజంగా—అందరిలా జీవిస్తుంటే నాకూ అందరూ కావాలనిపిస్తారు. అందరికీ నేనూ కావాలసి వస్తాను. నీ విషయమే ఉదాహరణగా తీసుకొందాం. ఐదేళ్ల తర్వాత రాక రాక వచ్చావు. ఏ ఉద్యోగమూ లేకుండా వీడలా బ్రతుకుచున్నాడా? అనే సందేహం నీ కళ్లలో మెదులుతూ వున్నది. నీ కళ్లలోని వాడితకాన్ని నేను భరించలేకుండా వున్నాను. ఇలాంటి ప్రశ్నలు నీ కళ్లలోనే కాదు, నీలాంటి మిత్రులు, శ్రేయోభిలాషులు— అందరి కళ్లలోను కొట్టవచ్చినట్లు కనపడుతుంటాయి. అందుకే అలాంటి వారి చూపులంటే నాకు తగని భయం.' అతని మాటలు ప్రవాహంలా సాగిపోతున్నాయి.

నావైపు వింతగా చూస్తూ ఇల్లా అన్నాడు. 'చూడోయ్, నీవు నా చిన్ననాటి స్నేహితుడివి. కాని ఇప్పుడు నీకూ నాకూ మధ్య పెద్దఅగాధ మేర్పడింది. నీ జీవితం పూలబాట. మరి నా జీవితమో ముళ్లబాట. మనిద్దరి మధ్యా స్నేహలత చిగిర్చాలంటే నీవైనా నా జీవితపథంలోకి రావాలి లేదా నేనైనా నీ జీవిత మార్గంలోకి రావాలి.'

మేమిద్దరం పరిసరాలు ప్రతిధ్వనించేలా నవ్వాము.

తర్వాత ఇద్దరం మెల్లగా ఇంటివైపు నడిచాము. త్రోవలో తానొక సినిమా తీస్తున్నట్లు అతను

నాతో అన్నాడు. కాని నేనాతని మాటల్లో ఎలాంటి ఆసక్తి కనపరచలేదు. పైగా అతని మాటలు నిజమని నేను నమ్మలేకపోయాను.

కొంతసేపటి తర్వాత తాను మరల సినిమా ప్రసక్తి ప్రస్తావించాడు. నా కతనిపై జాలివేసింది. పాపం! గాలిమేడల్లో విహరిస్తున్నాడు! అక్కడినుంచి నాకు వెంటనే వెళ్లిపోవాలనిపించింది. బొంబాయి చేరాలంటే కనీసం రెండు గంటలయినా ప్రయాణం చేయాలి.

భోజనం రెడీగా వుంది. మేము తిన మొదలెట్టాం. రెండు గిన్నెలలో ఘుమఘుమలాడే కూరలు, ప్లేటులో పరోటాలు. వంటకాలు ఎంతో రుచిగా ఉన్నాయి. ఆకలి ఎక్కువగా ఉన్నందువలన ఐదు పరోటాలు తినేశాను. ఆత్మారాముడు తృప్తిచెందాడు.

భోజనం చేసిన తర్వాత అతడు బ్రేవ్‌మని త్రేన్చాడు. అల్మారాలోంచి ఫైలు తీసికొని నా దగ్గరకువచ్చి కూర్చున్నాడు.

'చూడవోయ్, నేను తీస్తున్న సినిమా ప్రారంభోత్సవం నాటి కొన్ని ఫోటోలు.'

నేను ఫైలు చూడసాగాను. ఒక ఫోటోలో తాను ఓ మంత్రిగారి ప్రక్కన నిల్చున్నాడు. అటూ ఇటూ నాలుగైదుమంది నిలబడ్డారు.

'నీవు తీస్తున్న సినిమా పేరేమిటి?'

" 'వీరూ మనుష్యులే!' నేను అనాధ బాలబాలికల సమస్యగురించి సినిమా తీస్తున్నాను" అతనన్నాడు.

'కథ ఎవరు వ్రాశారు?'

'నేనే. మాటలు— పాటలు కూడా నేనే వ్రాశాను.'

'దర్శకు డెవరోయ్?'

'ఆ బాధ్యతకూడా నాదే.'

'వండర్‌ఫుల్' నాలో నేనే అనుకొన్నాను.

అతడు నా ముందొక పేపర్‌కటింగ్ వుంచాడు. ఏదో సినిమా పత్రికలో అతని సినిమా ప్రారంభోత్సవం నాటి ఫోటో వివరణతో సహా ప్రచురింపబడింది.

ఆ ఫోటోలో మంత్రిగారి ప్రక్కన అతనున్నాడు. ప్రసిద్ధ సినిమా ఎలేశరి అయిన ఎస్. డి. శర్మా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారని. నరేష్‌గారు నిర్మాత అని వివరణ ఇవ్వబడింది.

నేను కుతూహలంగా "ఈ నరేష్ ఎవరు?" అని అడిగాను.

'నేనేనోయ్' అన్నాడు అతడు కనుబొమ లెగురవేస్తూ.

"భలే బాగుందోయ్. సినిమా నిర్మాతేమో నరేష్. దర్శకుడుచూస్తే ఎస్. డి. శర్మా. కథా రచయిత నరేష్‌దత్. మాటలు—పాటలు వ్రాసేది నరేష్‌శర్మా. కొంపతీసి ఆ సంగీత దర్శకుడు కూడా నీవేనా ఏంటి?" నవ్వుతూ అడిగాను.

"అబ్బే, లేదోయ్. సంగీత దర్శకులుగా పని చేస్తామని రావ్‌లాల్—శ్యామ్‌లాల్ మాట ఇచ్చారు. సినిమా రంగానికి వీరిద్దరూ క్రొత్తే అనుకోకాని నా పిక్చర్ రిలీజ్ అయిన తర్వాత చూస్కో వీరిద్దరూ త్రివిక్రముల్లా ఆకాశానికి ఎదిగిపోతారు. కొత్త నటవర్గంతోనే సినిమా తీస్తున్నా నటీనటుల్లో ఎవరూ పదేళ్లకు పైబడ్డవారుండరు.'

'డబ్బెలా సర్దేవోయ్' ఆత్రంగా అడిగాను.'

'ఆ. ఆదే ప్రయత్నంలో వున్నానోయ్' నసుగుతూ అన్నాడు.

'బహుశా ఈ సినిమా ప్రపంచానికి ఇక్కడి నుంచే రాచబాట ముగిసి, చీకటి సొరంగమార్గం ప్రారంభమవుతుందనుకొంటాను.'

'అవును. ఏ నాటికైనా సొరంగమార్గమునుంచి బయటపడి వెలుతురులోకి రాకపోతానా?'

'పెట్టుబడి విషయంలో గట్టిప్రయత్నమేమైనా చేశావా? లేదా?'

'ఆపద్బాంధవు లెవరైనా అవలరించకపోతారా? రెండు మూడు రీళ్ళు తీశాక ప్రభుత్వంనుంచి సబ్సిడీకి ప్రయత్నం చేయాలి. ప్రస్తుతం దేశాన్ని పీడించే ఘోరమైన సమస్య గురించి సినిమా తీస్తున్నాకదా? ప్రభుత్వం నా కృషిని హర్షించి, సహాయం చేయక పోతుందా?'

నన్ను సాగనంపటానికి అతడు స్టేషనువరకు వచ్చాడు.

మరునటి రోజు అతను నా బసకు వచ్చాడు. ఆ రోజంతా అతను నాతో వుంటాడనుకొన్నాను. ఐదేళ్లనాటి మధుర స్మృతులను' నెమరు వేసుకోవా లనుకున్నాను. కింగ్స్‌సర్కిల్ దగ్గర మేమిద్దరం ఎన్ని సార్లు 'భేల్—పూరీ' తిన్నామని! ఆ రోజు అతనితో పాటు ఏదైనా సినిమాకు వెళ్లాలని అనుకున్నాను. కాని దాదర్ స్టేషను చేరిన తర్వాత అతనన్నాడు. 'నీవు జోషిని చూడ్డానికి వెళ్లిరా. గంట—గంటన్నర తర్వాత నేనక్కడకేవచ్చి నిన్ను కలుసుకుంటాను.'

'అంత కొంప మునిగేపనే మొచ్చిందోయ్ ఇప్పుడు?'

'ఆఁ ఇంకేముంటుందోయ్. బ్రతుకు తెరువు కోసం ఎన్నెన్నో తిప్పలు పడాలికదా! మా హీరాలో ఉన్న ఓ అమ్మాయిని బాంద్రాలోఉన్న ఓ ప్రొడ్యూసర్ దగ్గరకు తీసుకెళ్లాలి. ప్రొడ్యూసర్ ఆ అమ్మాయిని ఒప్పుకున్నాడంటే నా రొట్టె విరిగి నేతిలో పడ్డట్లే. ఆ అమ్మాయి ఫోటోలు కొన్ని త్రోవలో ఉన్న ఓ సినిమా పత్రికాఫీసులో ఇవ్వాలి.'

'ఈ పనులన్నీ చెయ్యాలంటే చాలా సేపవుతుందనుకుంటాను.'

'లేదోయ్. త్వరలో వచ్చేస్తాను. అయినా ఆ జోషీ నిన్ను అంత త్వరగా వదిలే ఘటం కాదులే.'

ఆ రోజు అతడు సుమారు మూడు—మూడు న్నర గంటల తర్వాత వచ్చాడు. అతన్ని చూడగానే జోషీ 'ఏమండీ నరేష్‌గారూ! మా అమ్మాయికి మీ మాలో 'రోల్' ఎప్పుడిస్తారు?' అని అడిగాడు.

'మీ అమ్మాయి ఫోటోలను ముగ్గురు—నలుగురు ప్రొడ్యూసర్లకు ఇచ్చాను. త్వరలోనే 'సెట్' అవుతుందనుకుంటాను.' కంటద్దాలను తుడుస్తూ తన మాటలను ముందుకు పోనిచ్చాడు. 'జోషీగారూ! మీరేమీ బెంగపెట్టుకోవద్దండి. నేనే స్వయంగా ఓ సినిమా తీస్తున్నాను. పైగా ఇది పిల్లల సినిమా. మీ అమ్మాయికిగాను ముఖ్యభూమికను నేనెట్టే పెట్టి వుంచాను.'

ఉన్నట్లుండి అతని కళ్లలో కాంతి జిగేల్ మంది. అలాంటి కాంతిని అతని కళ్లలో నేనెప్పుడూ చూచి వుండలేదు.

'జోషీతో అత నిలా అన్నాడు.' మరో రోజు వచ్చి నేను మీతో అన్ని విషయాలు వివరంగా మాట్లాడుతాను. అతడు జోషీ ప్రక్కకెళ్లి కూర్చొ- 'అమ్మాయి ఫోటోలు ప్రస్తుతం నా వద్ద లేవు. ప్రొడ్యూసర్ల కివ్వటానికి మరికొన్ని కాపీలు తీయించాలి.' నసుగుతూ అన్నాడు.

జోషీ పర్సులోంచి పది రూపాయిల నోట్లు మూడు నాలుగుతీసి అతని చేతిలో వుంచటం నేను చూశాను.

కొత్త కోకిల   శ్రీ గడియారం శేషఫణి శర్మ.

ఇది
ఇప్పుడిప్పుడే
నిసుఁల గొంతుముడి విప్పుకుంటున్న
కొత్త కోకిల!
దూరపు
తూరుపు కొండల్లోంచి
బాణంలా—ప్రాణంలా
దూసుకొని వచ్చిన
గుండెలున్న గండు కోకిల!!
ఈ కొత్త కోకిల కుత్తుకలో
మెత్తని జీర లేదు—
నెత్తుటి చార తప్ప!
కాకలి లేదు—
ఆకలి తప్ప!
పొలికేకలు తప్ప!!
ఇది తింటున్నది
కొన కొమ్మల లేత ఇగుళ్లని కాదు,
కొత్త మామిడి చిగుళ్లనీ కాదు—
కొరకుడు పడని ముళ్లని!
కొండంత దిగుళ్లని!!
ఏ కంతుడికో,
వసంతుడికో,
కైవారాలు చేస్తూ,
తొత్తుగా బ్రతికేందుకు,
ఆ మత్తులో పలికేందుకు,
దేశవళీ 'పరభృతం' కాదు—
ఇది మీసమున్న మగ కోకిల!
దీని పలుకుల్లో మత్తు లేదు,
మరి ఉన్నది
చీకట్లని చిత్తు చేసే విద్యుత్తు!
జడహృదయాల్ని జాగృతం చేసే
చైతన్య సరిత్తు!!
ఇది
ప్రళయాన్ని సూచించే
శకునపక్షి [illegible]డు.
రానున్న
మహా ప్రళయానికి
కర్మసాక్షి!
నిప్పువులు వెలిగ్రక్కుతున్న
తేజఃకుక్షి!!

త్రిశంకుడి స్వర్గం

శ్రీ మధురాంతకం రాజారాం

"ఇదిగో, నిన్నేనయ్యా శేఖరం! ఏమిటాదూకుడు? నేనూ వస్తున్నానుండు..."

—వెనుకనుంచీ ఈ మాటలు వినిపించినప్పుడే అనుకున్నాను, ఈ ప్రయాణం పూర్తయ్యేలోగా తలనొప్పి తప్పదని!

అయినా ప్రారంభమయ్యేదాకా ఊరుకోకుండా రాకుండా చూచుకోడం మంచిదిగదా! నేల ఈనినట్టుగా ప్లాట్‌ఫారం కిటకిటలాడి పోతావుంది. అడుగులు సాచివేస్తూ జనం మరుగున తలచాటు చేసుకోడానికి ప్రయత్నించాను. వెనుకవైపునుంచీ మళ్లీమళ్లీ పిలుపు వినిపిస్తున్నట్టే అనుమానం! నన్ను చూడు, నా అందం చూడు అంటూ మునుపటి కొక రాజకుమారుడి వెంట తగులుకున్న దేవతాస్త్రీలా ఈ పుణ్యాత్ముడొకడు దాపురించాడు నాకు!

దిగుతున్న, ఎక్కుతున్న ప్రయాణీకులకు మధ్య తాత్కాలికంగా ఒక రాజీ ఒడంబడిక కుదిరినట్టుంది. దిగేవాళ్లు చింతపండు మూటల్లా ద్వారాల్లోనుంచీ ఈవల పడుతుండగా, ఎక్కేవాళ్లు కిటికీలనే ద్వారాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఎలాగో ఓ పెట్టెలో జొరబడి, కూచోడానికొక సీటుగూడా చూచుకోగలిగాను. కానీ చేతికందిన కవళం నోటికందే ప్రాప్తం లేకుండా పోయింది. సుడిగాలిలా ఒరుసుకుంటూవెళ్లి 'అబ్బో,' తావు కనిపెట్టేశావే!' అంటూ నేను చూచుకున్న సీటును కన్నుమూసి తెరిచినంతసేపట్లో దురాక్రమణ చేసేశాడు కామేశం. అంతటితో ఎక్కడ ఊరుకున్నాడు! అప్పటికేదో దయాధర్మభిక్షలాగా 'పోనీలే, నువ్వూ కూచో' అంటూ నాకు కొన్ని చదరపు సెంటిమీటర్ల జాగా ప్రసాదించాడు.

'అన్నట్టెందాకా?'—కామేశం సంధించిన మొదటి బాణం. చెప్పుకున్నాను.

'అరరే, నువ్వూ అక్కడికేనా! పరవాలేదే! ఏమిటో వ్యవహారం?'

చూచారా, ఇదే కామేశంతో వచ్చిన చిక్కు! కొన్ని ఊళ్లకు రాకపోకలు నల్పడం, కొందరు వ్యక్తులతో పరిచయాలు కలిగివుండడం, కొన్ని కొన్ని సదుపాయాలు అనుభవించడం—ఇలాంటివాటికి తాను గుత్తగా లైసెన్సు పుచ్చుకున్నట్టు వ్యవహరిస్తాడు కామేశం.

నాదగ్గరనుంచీ జవాబు లేకపోయేసరికి, 'సర్లే, ఎవరి పనులు వారికుంటాయి' అంటూ నేనా వూరికి వెళ్లిరావడానికి ఆతడు పర్మిషన్ జారీ చేసేశాడు. కానీ అంతలోనే నాపట్ల అంతగా ఔదార్యం వహించడం సంభావ్యం కాదనిపించిందేమో, 'ఎన్నాళ్లుంటావ్?' అన్నాడు.

'అబ్బే, నాకేమంత పెద్దపనులున్నాయిలే కామేశం! రేపిపాటికల్లా మనవూళ్లో ఉండనూ' అన్నాను. నా మాటల్లో నామట్టుకు నాకే క్షమాపణ ధ్వనించింది.

కామేశం పుంజుకున్నాడు.

'ఏమిటోనయ్యా శేఖరం! నేనెప్పుడు పట్టణానికి వెళ్లిపడినా వారం పదిరోజులదాకా అక్కడినుంచి విడిపించుకోలేము. ఏం చేయమంటావు చెప్పు' వీధి వీధికీ ఫ్రెండ్సే నాకు!

అప్పల్రాజు నెరుగుదువా, యం. పి. గా పోటీ చేసి ఓడిపోయాడే, వాడే! వాడూ, నేనూ క్లాసు మేట్లం. అయితే అప్పుడొకసారి కొట్లాడుకుని విడిపోయామనుకో! కారణం చాలా చిన్నది. ఓ గమ్మత్తయిన ఆటంటే చాలా యిష్టం వాడికి! ఏంలేదు. నాలుదారానికి ఓ బిస్కట్టుకటి, బకెట్టును చేద బావిలోకి వదిలినట్టుగా దాన్నొక పుల్లీనుంచి క్రిందికి జారవేసేవాడు. నేను ఎగిరెగిరి నోటితోనే దాన్ని అందుకోవాలి. దారాన్ని క్రిందికి వదుల్తూ, పైకి లాగుతూ ఎగురుతున్న నన్ను చూచి వాడు తెగనవ్వేసాగాడు. కాళ్ళు నొప్పెడుతున్నాయని చెప్పి నేనా ఆటకు రానన్నాను. అయితే నువ్వు నా సావాసం వద్దుపొమ్మన్నాడు అప్పల్రాజు. అదే విడిపోవడం! మళ్ళీ మొన్నటి యెన్నికల్లోనే మేము కలిసింది! వచ్చిన పధి పన్నెండు వేల ఓట్లయినా యెలా వచ్చాయంటావు? నేను నడుం కట్టి, వాడి తరపున పనిచేయబట్టి! ఆ కృతజ్ఞత మాత్రం దండిగానే వుందిలే! కనిపిస్తే వదిలిపెట్టడు. ఆకాడికీ వాడే నయం. ఇంకొకడున్నాడు, మురళీధరం. వాడైతే నన్నెప్పటికీ తన దగ్గరే ఉండిపొమ్మంటాడు. బస్టాండుకు దగ్గరగా శ్రీ దేవీ సిల్కుహౌస్ అని వుందే, అది వాడిదే! ఇప్పుడైతే వాడు కాలక్షేపంకోసమని ఓ జవిళికొట్టు తెరిచిపెట్టుకున్నాడుగానీ, వాళ్ల తాతగారు ఆయన హయాంలో నారగింటిపాళ్యానికి సోల్‌మిరాసిదారు. వాళ్ల బంగళా చుట్టూరా తోటలో పనసచెట్లుండేవి శేఖరం, ఒక్కొక్క పండునూ ఒక భారీమనిషి యెత్తలేకపోయేవాడు. అరమైలు దూరం దాకా కొడుతుండేది వాసన. చెట్టెక్కి కాయనుకోసి పదిలంగా క్రిందికి తీసుకరాగలిగితే ఆ కాయ నీదే నవే వాడు మురళీధరం. భలే కొంటెకోణంగి అనుకో! వాళ్ల నాన్నమాత్రం? అంతటి వేటగాడు ఈ గడ్డపైన లేడే! ఒకసారి నేనూ, మురళీ ఆయనతో కలిసి వేట చూడ్డానికి వెళ్లాం, ఓ ఏదుపంది తుపాకి వేటు తప్పించుకుని మాపై కొచ్చేసింది...'

ప్రయాణంలో యింకా ఒక్కస్టేషనైనా గడవలేదు. అప్పల్రాజు దగ్గర ప్రారంభమైన కథ ఏదుపంది దాకా వచ్చింది. ఒక ఏదుపంది, ముగ్గురు మనుషులు. వెరశీ నాలుగు జీవాల్లో ఏది ఏమైందన్న జిజ్ఞాస నాకు లేదు. నేను నా సంచీలోనుంచీ పుస్తకం పైకి తీశాను.

కానీ కామేశం మాటల జడివానలోనుంచీ నా పుస్తకం నాకు రక్షణ యివ్వగలదన్న ఆశగూడా అడియాసే అయిపోయింది.

'ఏమిటిది, పుస్తకమా ?'— అంటూ చరాలున దాన్ని నాచేతినుంచీ లాగేసుకున్నాడు కామేశం. 'ఏం పుస్తకం ?' అన్నాడు. నాలుగుపుటలు త్రిప్పి 'నాన్సెన్స్, ఏముందిందులో ?' అన్నాడు. నా పుస్తకం నాచేతికి దొరక్కుండా జాగ్రత్తపడుతూ 'అన్నట్లొకసారి ఏమయిందంటే శేఖరం' అంటూ ఈసారి జ్యావల్లిని చెవిదాకా లాగి, అక్షయతూణీరం అందుకున్నాడు.

'బాణావరం పైడి రాజుగారి పేరు విన్నావా ఎప్పుడైనా!' 'బారట్లా' పట్టా పుచ్చుకుని బారులో పేరు నమోదు చేయించుకోలేదంటే ఆయన స్టేటస్ ఏమిటో ఊహించుకోవచ్చు. ఆయన మా నాన్నగారికి క్లోస్‌ఫ్రెండ్. ఏదోపనిమీద వెళ్లి వాళ్లింట్లో నాలుగైదు రోజులు ఉండవలసివచ్చింది. ఆ ఆదరణ, ఆ గౌరవం, ఆ భోజనాలు, వాటినిగురించి చెప్పడ మెందుకులే! ఆ లంకంతమేడలో ప్రొద్దుపోక చదువుకోడానికి ఏదైనా మేతదొరికితే బాగుండునని వెళ్లి పుస్తకాల బీరువా యెదుట నిల్చున్నాను. అద్దాలవెనుక భారతం, భాగవతం, భగవద్గీత, కొరాను, షేక్స్పియరు, షెల్లీ, కీట్సు,విశ్వనాధా, బాపిరాజు అలాంటివి మంచిమంచి లావుపాటి పుస్తకాలెన్నో వున్నాయి, లేనిదొకటే!... తాళంచెవి!'

'అడగలేక పోయావా ?'

'అడిగా నడిగాను. పైడిరాజుగారి నడిగితే అమ్మగారి నడిగి చూడమన్నారు. అమ్మగారి నడిగితే అబ్బాయిగారి నడిగి కనుక్కోమంది. అబ్బాయిగారి నడిగితే చెల్లెమ్మకు తెలిసుండాలన్నాడు. చెల్లెమ్మ నడిగితే తానా తాళం చెవిని ఆరుమాసాలకు మునుపెప్పుడో చూచినట్టు జ్ఞాపకం అంటుంది. మొత్తం

మీద తేలిన సారాంశం ఏమిటంటే—గడచిన సంవత్సర కాలంలో ఆ బీరువా తెరవబడిన పాపాన పోలేదు. మరైతే అక్కడ పుస్తకాలుండడం యెందుకు — అంటావు నువ్వు! అదే పొరబాటు. పుస్తకాలు బీరువా--కలంకారం. బీరువా ఆ మేడ కలంకారం. మేడ ఆ వూరి కలంకారం...'

ఆ ఊరు ?'

'అదేం వూరు, పాడు వూరు!' ... విదిలించి పారేశాడు కామేశం. 'పాడు గోడలు. పశువుల కొటాల్లాంటి ఇళ్ళు. మాసిన తలల మురికిబట్టల మనుషులు. అంతెందుకు? అక్కడ ఆ మేడలేకపోతే ఆ వూరికి నల్లముంతతో నీళ్లు ఘట్టవనుకో!'

దాని పైన కామేశం అలాంటి అభిప్రాయం కలిగి వుండడం ఆ వూరి దురదృష్టం. ఏం చేద్దాం! శతాబ్దాల తరబడీ ఆ వూరలాగే పడివుంది. ఇకమీదట గూడా అలాగే పడివుంటుంది. మాటలెన్నయినా చెప్పొచ్చుగానీ అలాంటి వూళ్లను బాగుచేయడం సులభ సాధ్యమేమీ గాదు. నేను కాదనను. కానీ నాకు బాధయినా, ఆశ్చర్యమైనా ఇల్లలికేపాటి భాగ్యానికి మురిసిపోయి ఈగ తన స్వవిషయం మరిచి పోయినందుకే!

కామేశం స్టేట్‌మెంట్లలో బొత్తిగా నిజం లేకపోలేదని మాత్రం నేను ఒప్పుకుంటాను. వాళ్ల నాన్న బాణావరం పైడి రాజుగారి కమతంలో పాలేర్ల పైన పెద్ద తాబేదారుగా వ్యవహరించాడు. డిఫెన్సు, డిపాజిట్లు పోగొట్టుకున్న అప్పల్రాజుకు పాటలు పాడి, కరపత్రాలు పంచి కామేశం ఎన్నికల్లో కొంత కాలిపనీ, చేతిపనీ చేసిపెట్టాడు. చిన్నప్పుడు నారగింటి పాళెంలో మేనమామగారింట వుండి చదువుకున్నప్పుడు గోలీ కాయలాడుకోడంలో మురళీధరానికి సహచరుడుగా పనికొచ్చి వుంటాడు. ఆమాత్రపు సాన్నిహిత్యాన్ని భూతద్దం పట్టి చూపించడంవల్ల కామేశానికి ఒరిగేదేమిటో బోధపడదు. బ్రతుకు వెళ్లదీయడ మెలాగన్నది కాకుండా, డబ్బెలా ఖర్చుచేయడమన్నది ప్రధాన సమస్యగా వున్న ఆ ఊర్ధ్వలోకాలు కామేశంలాంటి వ్యక్తిని యెంటర్‌టెయిన్ చేయడంలాంటి పనికిమాలినపనికి పూనుకుంటాయంటే నమ్మడం కష్టమే!

గమ్యస్థానానికింక ఓ అరగంట ప్రయాణం వుండనగా ప్రొద్దుపోయి, చీకటి పడింది.

'రాత్రికి బసెక్కడ ?'— అన్నాడు కామేశం.

'తెలిసినవాళ్లెవరో వున్నారు. కానీ వాళ్లని తొందరపెట్టడ మెందుకులే కామేశం! నాలుగో, అయిదో చల్లించి హోటల్లో గది తీసుకుంటాను' అన్నాను.

'చూచావా, చూచావా?' — ఆశ్చర్యాతిరేకంతో నోరు తెరిచేశాడు కామేశం. 'అంతపనీచేస్తే ఇంకేమైనా వుందీ! మా తమ్ముడు పీక నొక్కేయడూ! తెలియదూ, పద్మనాభమని, ఉన్నాడులే! నేనెప్పుడు వచ్చినా అక్కడికి వెళ్లాల్సిందే! యెన్నిరోజు లుండినా అక్కడుండాల్సిందే! కాలేజిలో అదేదో సబ్జక్టుకు వాడు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు. నవభారత్ హోటలు కెదురుగా ఓ పచ్చమిద్దెవుందే, అదే వాడిల్లు. అసలా యిల్లొక సేటుది. ఆ సేటు కాస్తా కళ్లు మూస్తే, వాడి భార్య దగ్గిరనుంచీ మావాడు సలీసుగా దాన్ని కొట్టేశాడు. క్రింద వంటగదీ, స్నానాలగదీ గాక మూడు గదులు, ఒకటి లైబ్రరీ. ఇంకొకటి యెవరైనావస్తే కూచోడానికి. మూడోది పూజగది. మిద్దె పైన ఓ గది కాకుండా పెద్దహాలు. నూరుమందైనా అందులో హాయిగా పడుకోవచ్చు. ఇల్లుపూరా పాలగచ్చు. పాలుపోసి యెత్తుకోవచ్చు. తల దువ్వుకోడానికి అద్దం అక్కర్లేదు. గోడల్లోనే ముఖం చూచుకోవచ్చు...'

గృహవర్ణన కంతరాయం కలిగించే దురుద్దేశం లేదని చెప్పను. అడ్డుతగిలి 'ఆయన నీ కెలా తమ్ముడు?' అని ప్రశ్నించాను.

'వరసకు తమ్ముడే నయ్యా! వాడి తల్లీ, నా తల్లీ పిన్నమ్మ, పెద్దలమ్మలబిడ్డలు. నా మాటంటే యెంత గురుత్వమనుకున్నావు! చెప్పలేను. వాడి భార్య వాడికి డిటో. బావా, బావా అంటూ...'

'అవునవును. రక్త బాంధవ్యం. అంతే'! మరి అంటూ ముక్తసరిగా త్రుంచేశాను.

* * *

ఇంటితో పోల్చిచూస్తే హోటలు గదిలో సదుపాయాలు తక్కువైపోయాయని కాదు. కొత్త చోటు కావడంవల్లనేమో ఒకపట్టాన నిద్రపట్టింది గాదు. నిద్రపట్టని కారణాన్ని పురస్కరించుకుని కామేశాన్ని పలుసార్లు తిట్టుకోవలసిన అవసరం ఏర్పడింది. నా పుస్తకం నా దగ్గరుంటే చిరాకులేకుండా నిద్రపట్టేదాకా చదువుతూ వుండిపోయేవాణ్ణి. రైల్లో దాన్ని నా దగ్గరనుంచీ లాక్కోడ మొకటే తెలుసు! తిరిగి యివ్వనేలేదు మహానుభావుడు.

అడిగి తీసుకోకపోవడం నాదీ పొరబాటే! 'తుపాను'లోనుంచీ బయటపడే తొందరలో నాకు పుస్తకంమీద ధ్యాసలేక పోయింది.

అర్ధరాత్రి తరువాతెప్పుడో నిద్రాదేవత కరుణించింది. అయినా వాడుకమేరకు ఆరుగంటలకే మేలుకున్నాను. నిద్రలేవగానే కొంతదూరం నడచి రావడం నా అలవాటు. ఎంత పట్టణమైనా అలవాటు తప్పించడ మెందుకని క్రిందికి దిగివచ్చాను. రెండు మూడు వీధులు నడిచి కోనేటి మిట్టదగ్గర మలుపు తిరుగుతుండగా నవభారత్ హోటలు కనిపించింది. దాని యెట్టయెదుట పచ్చటిమిద్దె! ఆమిద్దె కనిపించగానే నాలో కలిగిన మొదటి ఊహ—వరాండాలోనో, కిటికీ సందులోనో కామేశం కనిపిస్తే నా పుస్తకం తీసుకోవచ్చుగదా అని!

చరచరా ఆ మేడవైపు నడక సాగించాను.

పేవ్‌మెంటు కంచుగా పిట్టగోడ, చిన్నగేటు దాటుకుని గృహావరణలో కాలుపెట్టాను. ముద్దులా ముడుచుకున్న క్రోటన్ మొక్కల నడుమ, మంచులో చల్లగా తడిసిన నాపరాళ్లతో అయింటిముంగిలి అప్పుడే నీళ్లన్నీ వదిలిపెట్టిన చన్నీటి తొట్టిలావుంది. లోవైపున తాళం బిగించిన ఇనుపకమ్ముల తలుపు కీవల ముచ్చటగా మూడు మెట్లున్నాయి ముఖంనిండా ముసుగు కప్పుకున్న కామేశం ఆ మెట్లమీద కూలబడి యెందుకో—దీర్ఘాలోచనగా నిమగ్నుడై వున్నాడు.

భుజంపైన చేయివేశాను. ఉలికిపడి కళ్లు తెరిచాడు. వెంటనే నోరుగూడా విడివడింది.

'వెళ్లనేగూడదు. బుద్ధి పొరబాటయిపోయింది. రెండో సినిమాకు వెళ్లాను. వీళ్లిలా మొద్దునిద్రపోవడం యిదే మొదటిసారి—మొన్న సాయంకాలం యిక్కడెక్కడో పెళ్లికనివెళ్లి ఆ రాత్రంతా కంటిపైన రెప్ప వేయకుండా జాగారం వుండిపోయారట! మెలకువంటూ వస్తే దిగివచ్చి తలుపు తెరవకుండా వుండేవాళ్లు కారు, పాపం! చూడు, ఫాన్‌గాలిలోనైతే నాకు నిద్రపట్టదని మా తమ్ముడు పడక తీసుకొచ్చి వరాండాలో వేసేశాడు గూడా......'

నిజమే. కవాటబంధనం గావింపబడివున్న సింహద్వారానికీ, లోపల తాళం బిగించివున్న ఇనుపకమ్ముల తలుపుకు నడుమ వరాండాలో జానెడెత్తు తెల్లటిపరుపు కన్నులకు విందుగా కానవస్తోంది. పైడిరాజుగారి అద్దాల బీరువాలో పుస్తకంలా, అప్పలరాజు బాల్యక్రీడలో నోటికందని బిస్కట్టులా, మురళీధరం వాళ్ల పనసతోపులో చిటారుకొమ్మకు కాసిన పనసకాయలా ఆ పరుపు గూడా చూపులకు మాత్రమే అందుతోంది. చేతుల కందడమున్నూ లేదు, మనిషికి దక్కడమున్నూ లేదు!

నిత్యయౌవనం సాధ్యమా?

శ్రీ కాసుఖేల నరసింహారావు

దేవ దానవులు క్షీరసాగరాన్ని మధించి అమృతాన్ని సాధించారనీ, దేవతలు దానిని సేవించి అజరామరు లయ్యారనీ, వారు నిత్యయౌవను లయ్యారనీ మన పురాణగాథలు తెలుపుతున్నాయి. గత అర్ధ శతాబ్ద కాలంలో జీవశాస్త్రంలో జరిగిన విప్లవాత్మక పరిశోధ నలు పాతకాలంనాటి ఆశ దురాశ కాదేమో అని పించేట్లున్నాయి. రేపటి మానవుడు అమరుడు కాక పోయినా అజరుడై—ముసలితనము,దానితో వచ్చే బాధలు లేకుండా మృత్యువుని ఎదుర్కొనవచ్చునేమో అన్న ట్లున్నాయి.

ఆధునిక జీవశాస్త్రం:దాని పరిధులు

జీవుల శరీరాలు కణ నిర్మితాలు. వీటిలో జరిగే సమాపనయప్రక్రియే శరీరంలోని ప్రాణానికి హేతు భూతం. ఈ ప్రక్రియయొక్క సంపూర్ణత్వం భంగ పడితే ప్రాణహాని, కనీసం రుగ్మత ఏదయినా కలుగు తుంది.

కణ కేంద్రంలో క్రోమోసోములని ఉంటాయి. వీటిలో జన్యు రేణువులు ఉంటాయి. వంశపరంపరంగా సంక్రమించే గుణాలన్నిటికీ ఈ జన్యు రేణువులే కార ణాలు.

ఈ జన్యు రేణువులలో 'డి. ఎన్. ఏ.' (డిఆర్సి రితో న్యూక్లియెయికీ యాసిడ్) అనే 'కేంద్రక—ఆమ్లం)' (న్యూక్లియెయికి యాసిడ్) చేత నిర్మింప బడినవి.

కేంద్రకానికి బయటి పదార్థాలలో 'ఆర్. ఎన్. ఏ.' అని పిలువబడే మరొక కేంద్రకామ్లం ఉంటుంది. ఈ రెండు అమ్లాలూ కలిసి, కోణంలో ఉత్పత్తి కావల సిన పదార్థాలని ఉత్పత్తి చెయ్యటానికి, సమాప నయ ప్రక్రియ నిర్విరామంగా జరుగటానికి తోడ్పడుతాయి.

డి. ఎన్. ఏ. నిర్మాణాన్ని కొంత మేరకి పరి శోధనాగారంలో మార్చవచ్చు.ఈ మార్పుద్వారా వంశాను గత లోపాలని దిద్దటానికి వీలు ఉంటుందని ఊహించవచ్చు. జీవశాస్త్ర పరిశోధనలు ఈ ధోరణిని బయట పెడుతున్నాయి.

వయస్సుతో వచ్చే మార్పులేమిటో అందరికీ తెలుసు. వెంట్రుకలు తెల్లబడటం, దంతాలు ఊడటం, చర్మం ముడతలు పడటం వగయిరా.

ఇవి స్థూలమయిన మార్పులు.

వాటితోబాటు మన దృష్టికి అందని సూక్ష్మ మయిన మార్పులు వేరే ఉంటాయి. కణ పరిశోధ నలు ఇవి ఎటువంటివో కొంతవరకు తెలుపుతున్నాయి. ఈ చిన్న మార్పులు కంటికి కనిపించే పెద్దవాటికి కారణాలు.

సూక్ష్మమయిన మార్పులని అరికట్టగలిగితే పెద్దవాటిని కూడా ఆపవచ్చునని భావించవచ్చు. అంటే—ముసలితనాన్ని వాయిదా వెయ్యటానికి వీలు ఉందన్నమాట.

జరాశాస్త్రం

ఇంగ్లీషులో ముసలితనాన్ని పరిశోధించే శాస్త్రాన్ని ''జెరాంటాలజీ'' అంటారు. తెలుగులో దీనిని ''జరా శాస్త్రం'' అనవచ్చు.

ప్రతి ప్రాణికీ నిర్ణీతమయిన జీవితకాలం ఉంటుంది. ఒక్కొక్కజాతికి ఇది ఒక్కొక్క పరిమాణం కలిగి ఉంటుందనవచ్చు. కుక్కలకి సుమారుగా 12–13

సంవత్సరాలు, మనుష్యులకి దీనికి కొన్ని రెట్లు ఉంటుందన్న సంగతి మనకి తెలుసు. వెదురుచెట్టు 70–80 సంవత్సరాలు బ్రతుకుతుంది. ఈ కాలంలో అది ఒక సారి మాత్రమే పూత పూస్తుంది పూతకాలమయి పోగానే అది ఎండిపోయి చనిపోతుంది. సాల్మన్ అనే చేపకూడా పిల్లలు పెట్టగానే ముసలిదయి పోతుంది.

ఆయుస్సు: సంతానోత్పత్తి: ముసలితనం

దీనంతటనీబట్టి సంతానోత్పత్తికీ ముసలితనానికీ ఏదో సంబంధం ఉందని తెలుసుకోవచ్చు. ఈ సంబంధం ఏమిటి? ఎటువంటి జీవ రసాయనిక ప్రక్రియల వలన ఈ మార్పులు కలుగుతున్నాయి? ఏవయినా గుర్తింపగలిగిన రసాయనిక పదార్థాలు ముసలితనపు మార్పులని తెస్తున్నాయా?

'కొలెస్టరాల్' అన్న రసాయనం ఒకటి ఉంది. ఇది రక్తనాళాల లోపల గోడలమీద పేరుకుంటూ ఉంటుంది. గోడలు దళసరిగా అయి, వాటి సంకుచిత శక్తి తగ్గి, రక్తపుపోటు ఎక్కువ అవుతూ ఉంటుంది.

కొలెస్టరాల్‌కీ ముసలితనానికీ ఏదో సంబంధం ఉందని చాలాకాలంగా శాస్త్రజ్ఞులు అనుమానిస్తూనే ఉన్నారు. వీటిమీద పరిశోధనలు జరుగుతున్నాయి.

పార్శ్వ సహజీవనం

ఈ సందర్భంలో ఒక రకం ప్రయోగాలని గురించి చెప్పవలసి ఉంది. ఇవి ఎలుకలమీద జరిగిన ప్రయోగాలు.

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఫ్రెడరిక్. సి-లుడ్విగ్ అనే ఆయన ఎలుకలమీద వింత ప్రయో

జీవకణం కేంద్రంలో ఉండే కేంద్ర మాంసకృత్తుల (న్యూక్లియో ప్రొటీన్ల)లో రెండు ఆమ్లాలు ఉంటాయి. ఇంగ్లీషు పొడిఅక్షరాలు వాడి వీటిని 'ఆర్. ఎన్. ఏ., డి. ఎన్. ఏ.' అని పిలుస్తారు.

వీటి నిర్మాణాన్ని పరిశీలించగా వాటిలో అ) ఒక చక్కెర, ఆ) ఒక భాస్వరికామ్లం, ఇ) ప్యూరిన్‌లని పిలువబడే ఒక రకం క్షారపదార్థం అణుసముదాయాలు **ఉంటాయని తెలిసింది.**

'డి–ఆక్సీరిబోస్'అనే చక్కెర అంటే డి.ఎన్.ఏ. అవుతుంది. 'రిబోస్' అనే చక్కెర ఉంటే ఆర్. ఎన్. ఏ. అవుతుంది. (ఇంగ్లీషు పొడిఅక్షరాలు 'డి, ఆర్' లు ఏవిధంగా వాడబడినాయో వేరే చెప్పనవసరంలేదు!)

'మామూలుగా' పయిన చెప్పిన మూడు రకాల రసాయన పదార్థాలూ ఎలాగ కలిసి ఉంటాయో ఈ కింది బొమ్మ తెలుపుతుంది. ఇందులో 'చ' అంటే చక్కెర; 'ప్యూ' అంటే ప్యూరిన్; 'భా' అంటే భాస్వరికామ్లం.



ఇది అడ్డంగా పడుకోబెట్టిన నిచ్చెనలాగ ఉందనవచ్చు!

దీనిని నిలువుగా నుంచోబెట్టి రెండు మెలికలు కనిపించేట్టు మెలిబెడితే ఈ కింది విధంగా కనిపిస్తుందేమో! ఈ స్వరూపాన్ని ఇంగ్లీషులో 'డబుల్ హెలిక్స్' అంటారు.

'హెలిక్స్' అంటే ఇంగ్లీషులోనే 'స్క్రూషేప్డ్ కాయిల్' అని అర్థం చెప్పబడుతోంది తెలుగులో దీనిని 'రెండు మెలి తిరిగిన చుట్టలు' అని అనువాదం చెయ్యవచ్చు! 'ద్వ్యావర్తనం' అని కూడా అనవచ్చునేమో!! వాట్సన్, క్రిక్ అన్న ఇద్దరు శాస్త్రజ్ఞులు ఈ 'డబుల్ హెలిక్స్' అన్న మాటని సుప్రసిద్ధం చేశారు.



గాలు కొన్ని జరిపి, వాటి ముసలితనాన్ని అరికట్టి ఆ సంస్పుని పొడిగించగలిగాడు.

ఒక పడుచు ఎలుక తోకని ఒక ముసలి ఎలుక ఘాానికి 'తగిలించి' ఒకదాని రక్తం ఒకదానిలోకి పారేట్లు చేశాడు. ఈ రెండు ఎలుకలూ కలిసి జీవించటాన్ని 'పార్శ్వ సహజీవ విధానం' (లేక ఇంగ్లీషులో పారా బయోసిస్) అనవచ్చు.

పడుచు ఎలుక రక్తం ముసలి ఎలుక దేహంలోకి పారటంవలన అది సాధారణంగా జీవించే కాలంకన్నా ఎక్కువకాలం జీవించింది. వయసులోవున్న ఎలుక దేహంలోనుంచి ఏదో పదార్థం ముసలి ఎలుక దేహంలోకి ప్రవేశించినదని ఊహించటానికి వీలు ఉందన్న మాట.

బాల్టిమోర్‌లోని జాతీయ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డీట్రిచ్ బోడెన్ స్టెయిన్ అనే అతను బొద్దింకల మీదగూడా ఈ విధమయిన పయోగాలు చేశాడు. పడుచు బొద్దింకల కాళ్లు, మీసాలు విరిగిపోతే కొత్తవి మొలుస్తాయి. ముసలి వాటికి ఈ శక్తి పోతుంది. పార్శ్వసహజీవనం చేసిన ముసలి బొద్దింకలు పోయిన కాలుని మొలుచుకొన గలిగాయి.

ఒక ప్రాణిలోనుంచి మరొక ప్రాణి దేహంలోకి ఏ పదార్థం వెళ్లిందో తెలుసుకొన గలిగితే జరా శాస్త్రంలో ఉదయించే ప్రశ్నలకి ఎన్నిటికో సమాధానాలు తెలుస్తాయి.

కణాల ఆయుష్షు: దాని నిర్ణయం

జరాశాస్త్ర పరిశోధకులకి కణాల విభజన ఒక ముఖ్యమయిన పరిశోధనా రంగం. ఆడ, మొగ కణాలు కలయికవలన ఏర్పడిన ఒక కణం రెండుగా విభజన అయి, ఈ రెండూ తిరిగి విభజనంలో చివరికి కొన్ని కణాలు తయారవుతాయి.

కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పనిచేసే డా. లియొనార్డ్ హేఫ్లిక్ అనే శాస్త్రజ్ఞుడు తన పరిశోధనల ఫలితంగా ఒక కొత్త విషయాన్ని కనుక్కున్నాడు. మంచి ఆరోగ్యమయిన ఏకణమయినా ఏభయిసారులకన్నా విభజన కాదని ఆయన తెలుసుకున్నాడు. అంతేకాక, ఇరవయిసారులు చీలిన కణాలని శీతల ప్రయోగంద్వారా విభజన కాకుండా ఆపి తిరిగి వెచ్చబెడితే మరొక ముప్పయి సారులు మాత్రం చీలి ఆగిపోతుందని ఆయన కనుక్కున్నాడు.

ఒక కణం ఎన్నిసారులు విభజనకావాలో దాని జన్యుసంకేతంలో ఇమిడి ఉంటుందని దీనంతటనీబట్టి ఊహించవచ్చు. అయితే అది ఎలాగ జరుగుతున్నట్లు?

రెండు సిద్ధాంతాలు:

ఈ ప్రశ్నకి రెండు సమాధానాలుగా రెండు సిద్ధాంతాలు ప్రతిపాదించ బడినాయి. ఈ సమాధానాలు ప్రయోగరూపంగా నిరూపింపబడలేదు కాని, ఇది విజ్ఞాన చరిత్రలో కొత్త విషయం ఏమీకాదు. ప్రతిపాదనలు జరిగితే వాటిని ప్రయోగాలద్వారా పరీక్షించి చూడవచ్చు.

మొదటి సిద్ధాంతం : దీనిని జాన్ మేనార్డ్ స్మిత్ అనే (ససెక్సు విశ్వవిద్యాలయ) అధ్యాపకుడు ప్రతిపాదించాడు. కణంలో ఉండే ఒక ప్రోటీన్ (లేక మాంసకృతు) కణ విభజనం కారణమని ఈయన అంటాడు. ఇది హరించుకు పోవటంతో విభజన ఆగిపోతుందనీ ఈయన సిద్ధాంతం.

రెండవ సిద్ధాంతం : ఇంగ్లీషులో 'ఫ్రీ రాడికోల్' అన్న మాటని తెలుగులోకి 'స్వేచ్ఛాణువుల' అని అనువాదం చెయ్యవచ్చు. కొన్ని రసాయనిక పదార్థాలలోని అణుసముదాయాలు కొద్దికాలంపాటు 'స్వతంత్రం'గా లేక 'స్వేచ్ఛ'కు వేరే పదార్థాలుగా ఉండగలవు. ఆ తరువాత అవి ఇతర రసాయనిక పదార్థాలతో కలిసి కొత్త రసాయనిక పదార్థాలు ఏర్పడుతాయి. కణంలో 'స్వేచ్ఛాణువులు' సగ్నయించబడిన పదార్థాలతో కాక వేరే పదార్థాలతో కలిసి అసాధారణ సంయోగ పదార్థాల సృష్టికి దారి తీసినట్లయితే కణ నయాపనమక్రియ, దాని వలన కణ విభజన ఆగిపోతుయిని ఈ సిద్ధాంతం ప్రతి

పాగిస్తోంది. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వ్యక్తి సుప్రసిద్ధ జరాశాస్త్రజ్ఞుడు అలెక్స్ కమ్‌ఫర్ట్.

ప్రోజరియా

ముసలితనం కణ విభజనతో ముడిపడి ఉందనటానికి కొన్ని నిదర్శనలు ఉన్నాయి. ఇటువంటి నిదర్శనాలలో ముఖ్యమయినది 'ప్రోజరియా' అనే వ్యాధి ఒకటి. దీనిని తెలుగులో 'బాల్య జరా' అనవచ్చు. కొందరు చిన్నపిల్లలకి బాల్యంలోనే ముసలితనం లక్షణాలు వస్తూ ఉంటాయి. ఇటువంటివారు 10–12 సంవత్సరాలకే తనువులు చాలిస్తూ ఉంటారు.

ఈ వ్యాధికలవారి కణవిభజన 50 సారులు జరుగదు. అది అంతకన్నా తక్కువగానే జరుగుతుంది.

ఇటువంటి నిదర్శనలు మరికొన్ని ఉన్నాయి కాని వాటిని వివరించటం వలన వ్యాసం పెద్దదయిపోతుంది! ఒక విషయాన్నిమాత్రం ఇక్కడ పేర్కొనవచ్చు: కొత్తగా తయారయిన కేంద్ర కామ్లం టి. ఎన్. ఏ. అణుసముదాయ స్వరూపం కొంతకాలం ఉన్న దాని స్వరూపంకన్నా వేరుగా ఉంటుంది. ఈ ఆమ్లం అణుసముదాయం వంకీలు చిరిగిన దారాల మార్పులాగ ఉంటుంది. కొత్తగా తయారయిన డి. ఎన్. ఏ. వంకులు సాఫీగా ఉంటాయి. కొంతకాలం తరువాత అవి బాగా మెలికలు తిరిగిపోతాయి. ఇంకొక విధంగా చెప్పాలంటే, కొత్త కేంద్రకామ్లం అణుసముదాయం విడివి ఎక్కువ. (సమానమయిన ఘనపరిమాణానికి.)

గాలక్టోసెమియా

పయిన చెప్పినదానినంతటినీబట్టి, కణాలలో జరిగే మార్పులు ముసలితనానికి ముడిపడి ఉన్నట్లు గ్రహించవచ్చు. ఈ మార్పులని అరికట్టడంద్వారా ముసలితనాన్ని నివారించవచ్చు. అయితే, మార్పులు జన్యుసంకేతములోనే రావాలి. ఇది అంత తేలికగా జరిగేది కాదు. దీనిని సాధించటానికి శాస్త్రజ్ఞులు ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నాలు నిష్ఫలంగా కనిపించటంలేదు.

ఉదాహరణకి: శిశువులకి కొందరికి పాలని జీర్ణం చేసుకునేశక్తి ఉండదు. వాటిలో ఒక ''ఎంజయిము' లోపించటంవలన ఈ ఇబ్బంది వస్తుంది. ఈ రోగాన్ని 'గాలాక్టోసెమియా'' అంటారు. గాలాక్టోసెమియా పోవాలంటే ''లాంబ్డాషేజి'' అనే ''వయిరస్''ని శిశువుల చర్మంలోకి ఎక్కించినట్లయితే రోగం పోతుంది. ఈ వయిరస్ పయిన చెప్పిన ఎంజయిముని తయారు చేస్తుంది. గాలాక్టోసెమియా జన్యుసంజనితమయిన రోగం అని గమనించాలి.

ఇంతదాకా జరిగిన ప్రయోగాలు జంతువుల మీదనే జరిగాయని అంగీకరించాలి. మానవుడిమీద ఇంకా జరుగలేదు. మనిషిమీద ప్రయోగాలు చెయ్యటం యెంతవరకు సాధ్యం అని ఆలోచించి చూడాలి. అన్ని అవరోధాలనీ అధిగమించి క్షీరసాగర మధనం తరువాత అమృతాన్ని పొందినట్లు సత్ఫలితాలని పొందటం జరుగలేని విషయం మాత్రంకాదు. మానవుడు దేవత కావచ్చు.

బనగానపల్లిలో బ్రహ్మముగారు

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

సామాన్యుల కరమగు భాషలో, సంఘ సంస్కరణోద్దేశముతో నీతులు చెప్పిన వేమన్నను మహాకవి యని యీనాఁడు పెక్కురు నొక్కి వక్కాణించుట ముదావహము. అట్టివారు బ్రహ్మముగారిని గూడఁ దమ సిద్ధాంత సులోచనములతోఁ బరిశీలించినచో నాయన గూడ మహాకవియే యగును! నిరక్షర కుక్షులకు సైతము బ్రహ్మముగారి తత్త్వములు వచ్చును. సామాన్యులా తత్త్వములను బాడుకొనుచు నానందించుచున్నారు. ఆ తత్త్వములన్నియు సంఘ సంస్కరణోద్దేశముతోఁ జెప్పినవే! వేమన్న పద్యములు గూడ రానంతటి సామాన్యులకు సైతము బ్రహ్మముగారి తత్త్వములు వచ్చునన్నచో నీయన 'కవిత్వ'మెంత 'గొప్ప'దో తెల్లమగును. జీవిత తత్త్వమును వేమన్నకంటె బ్రహ్మముగారెక్కువగా నర్థము జేసికొనిరని వారితత్త్వముల నరసినచోఁ దెలియును. ఆయన జీవితమే మహాకావ్యము. ఈయన విశ్వబ్రాహ్మణుఁడు. ఆవులఁ గాసినది రెడ్లయింట. ఈ యోగికి మొదట శిష్యుఁడు బ్రాహ్మణుఁడు. ప్రసిద్ధ శిష్యుఁడు సిద్ధయ్య మహమ్మదీయుఁడు. ఈ సంస్కర్త కక్కయ్య యను మాదిగవానికి మోక్షమార్గము నుపదేశించెను. సంసారము సేయుచునే మహాయోగిగాఁ గీర్తిగాంచెను. కులమత భేదములను నిరసించిన ఘనుఁడు బ్రహ్మముగారు. ఊరక బోధన లందఱును జేయగలరు. ఆచరించి చూపు ధైర్యమెందఱ కుండును? భక్తులు బ్రహ్మముగారి నవతార పురుషునిగా భావింతురు. ఆయన కథ యిది.

ఎనమదల వీరభోజయాచార్య, వీరపాపమాంబలకు వీరంభొట్లయ్య పెంపుడు కొడుకు. వీరభోజయాచార్యులు వీరంభొట్లయ్య పసివాఁడుగ నుండగనే స్వర్గస్థుఁడయ్యెను. జీవితపరమార్థము నన్వేషింప వీరంభొట్లయ్య తీర్థయాత్రలకు బయలుదేరెను. దుఃఖితమతియైన వీరపాపమాంబకుఁ బ్రపంచ స్వరూపమును, మానవజన్మ విశేషములను దెలిపి, యామె నోదార్చి, యతఁడు స్వగ్రామమును విడచెను. పుణ్యక్షేత్ర దర్శన సమయమున నతఁడు వీరప్పయాచార్యులయ్యెను. హంపి, అహోబిలము, మహానంది, ఓంకారము మొదలగు పవిత్ర క్షేత్రములను దర్శించి, చివరకు బనగానపల్లెకుఁ జేరెను. ఆ నాఁడు బ్యాంకు దోపిడీకి ప్రసిద్ధినందిన బనగానపల్లె, యొకనాఁడు బ్రహ్మముగారి వలనఁ గీర్తిఁ గాంచినది! బ్రహ్మముగారి కాలమును పదునాఱు, పదునేడు శతాబ్దముల నడుమగా గుర్తింపవలెను. అప్పుడు బనగానపల్లెను నవాబు పాలించుచుండెను.

వీరప్పయాచార్యులు బనగానపల్లెకు వచ్చునప్పటికి పదునైదేండ్లు గూడలేని పసివాఁడు. అతఁడొక గుట్టపై నా రాత్రి పరుండి నిద్రించెను. ప్రాతఃకాలముననే యా గుట్టకెదురుగానున్న గృహమునుండి యొక స్త్రీ బయటకు వచ్చెను. ఆమె యెవరో కాదు— గరిమిరెడ్డి యచ్చమ్మ! ఆమె సంపన్నురాలు. గుట్టపైనున్న చిట్టివాని నచ్చమ్మగారు ప్రశ్నించిరి. ఊరు పేరుల నడిగిరి. 'ఉద్యోగాన్వేషిని. ఆవులను గాయఁగలను; మేపఁగలను. పశువైద్యము నెఱుఁగుదును' అని వీరప్పయాచార్యులు వినయ ముట్టిపడఁ బలికెను. ఆనాఁటినుండి యతఁడు గరిమిరెడ్డి యచ్చమ్మగారియింట పశువులకాపరి యయ్యెను. ఈనాఁటికిని మనము గరిమిరెడ్డి యచ్చమ్మగారి యింటి ప్రదేశమును బనగానపల్లెలోఁ జూడఁగలము. 'చింతమాను మఠము'గాఁ గీర్తిగాంచినది యచ్చమ్మగారి గృహమని తెలియవలెను!

రవ్వలకొండ

అచ్చమ్మగారిచ్చిన సంగటి ముద్దను దీసికొని,

వీరప్పయ్య గోవులను దోలికొని రవ్వలకొండ ప్రాంతమునకు బోయెను. ఆలమందనొకచో జేర్చి చుట్టు నొక గీతను గీసెను. గోవులా గీతను దాటం జాలవాయె! వీరప్పయ్య గులజారిముల్లులో దాటి యాకులపై గాలజ్ఞానములను వ్రాయందొడగెను. జనులు చెప్పుకొను కథలనుబట్టి తాటిచెట్లు వంగి, యాకుల నాతని కందించుచున్నట్లు తెలియవచ్చుచున్నది. రవ్వలకొండ బనగనపల్లె సమీపముననే యున్నది. ఈ ప్రాంతము రమణీయము. రవ్వలకొండపై 'రవ్వలు' దొరకుచుండునని ప్రతీతిగలదు. ఇప్పటికిని వాన వచ్చిన తరువాత గొందఱు రవ్వలకై వెదకుచుందురు. ఇది దూరమునుండి యెఱ్ఱగాం గన్పించుచు, రత్నముల రాశియో యనిపించుచు నుండును. ఈ ప్రాంతముల సంచరించినచో నిప్పటికిని మనమొకటి గమనింపవచ్చును. ఈ ప్రదేశములలో నాలమంద లెక్కువగాం దిరుగుచుండును. బాహ్యప్రపంచముతో బనిలేని వైవస్వరూపులైన 'బాలబ్రహ్మము' లెందఱో యీ పశువులవెంట నిచటం గనుపట్టుదురు.

ఆలమంద నిట్లు గిరిగీచి నిలబెట్టుట గనుగొని, కొందఱాంగతి నచ్చమ్మగారితో జెప్పిరి. తన యింటి పనిపిల్లవాండింతటి మహత్తును జూపుటను విని యామె చకిత యయ్యెను.

యాగంటి

విస్మృత క్షేత్రములలో యాగంటి ముఖ్యమైనది. ఇందున్న బుక్కరాయల శాసనమును జూచినచో దీని ప్రాముఖ్యము స్పష్టమగును. ఇందుమా మహేశ్వరులు స్వయంభువులు. అతి ప్రశాంతమైన ప్రకృతిలో వెలసిన యీ పుణ్యక్షేత్రము దర్శనీయము. ఇచటం బ్రవహించు జలధారకు మూలమా మహేశ్వరుని జటాజూటమునం గాపురమున్న గంగమ్మకే తెలియవలెను. పర్వత కందరములను జూడవలెనే కాని వర్ణించినచో నంతు పట్టనివికావు. యాగంటి బనగానపల్లెకు సుమారామడ దూరమున నున్నది.

బ్రహ్మముగా రాలమందలను దోలికొని యీ ప్రాంతమంతయు సంచరించుచుండిరి వీరప్పయ్యయే వీరబ్రహ్మముగారని వేఱుగం జెప్పంబనిలేదు గదా! ఆయన మహత్తును విని యచ్చమ్మగారామనను రహస్యముగా ననుసరించిరి. ఎప్పటి వలె నాయన గోవుల నొకగీత నడుమనుంచి, గుహలో గూరుచుండి కాలజ్ఞాన తత్త్వము ను వ్రాయుచుండిరి. అచ్చమ్మగారామహనీయుని పాదముల నాశ్రయించి, చులకనగాం జూచినందులకు తన్ను క్షమింపుమని వేడికొనెను. బ్రహ్మము గారామెకుం గాలజ్ఞాన ముపదేశించిరి. వారప్పట ముచ్చట లాడిరి. యాగంటి సమీప పర్వత ప్రాంతమున కందుకే 'ముచ్చట్లు' అని పేరు వచ్చినది. ఈ పర్వతప్రాంత మతి మనోహరము. ఇందలి గుహలను జూచినచో బ్రహ్మము గారివంటి వారిందుం గూర్చుండి కాలజ్ఞానమును జెప్పుట సత్యసమ్మత మనిపించును.

యాగంటి దేవాలయమున పెద్ద నంది యున్నది. ఇది దినదిన ప్రవర్ధమాన మగుచున్న దందురు. 'యాగంటి నంది రంకెవేసి లేచినపుడే ప్రళయకాలమగు'నని బ్రహ్మముగారు చెప్పిరట!

చింతమాను

బ్రహ్మముగారు పదునాలుగువేల కాలజ్ఞానములను వ్రాసి యచ్చమ్మగారి యింట నొక పాతరలో వేసిరి. వారి కచ్చమ్మ గారిచ్చిన చద్దిలోని చింత యిత్తొకటి దానిపైంబడి మొలచెను. అదే నేటి చింతమాను చిత్రమైనది. దానియెత్తు సుమారేబది మూరలు. దీని వయస్సు తొమ్మిదివందల సంవత్సరము



గరిమిరెడ్డి అచ్చమ్మగారి యింట చింతమాను

లని చింతమాను చెంతనుండు పూజారి చెప్పెను. కొందఱు నమ్మరు. బ్రహ్మముగారు క్రీ. శ. 1594 లో సమాధిలోనికిం బోయిరని నాగభూషణము

గారు వక్కాణించిరి. పదునేడవ శతాబ్దారంభమున బ్రహ్మముగారు బ్రతికి యుండిరని విజ్ఞాన సర్వస్వమునుబట్టి దెలియుచున్నది. కాని భక్తులు బ్రహ్మముగారు కొన్నివందల సంవత్సరములు జీవించిరని నమ్ముదురు. యోగమున కసాధ్యము లేదుగదా ! బ్రహ్మముగారి తత్త్వములనుబట్టి చూడగాఁ గాలనిర్ణయ మొకతీరున నుండును. నాయకురాలు మొదలుకొని ముసలమానుల ఏలుబడిని విషయములు తత్త్వములలోఁ దగులుచున్నవి. వీరు పలనాటి యుద్ధమునకు ముందే జన్మించి, పదునేడవ శతాబ్దమువఱకు జీవించి యుండిరని భక్తుల నమ్మకము. దీని నాధునికులు విశ్వసింపరు ! అయినను చింతమానుకు కనీసము మున్నూఱేం డ్లయిన నుండు నట విశ్వసనీయమే! ఈ మానెండిపోయి మూఁడేండ్లయినది. చింతమానును ఛాయలోఁ జూడనగును. నేఁడిది శిథిలావస్థలో నున్నది. వృక్షశాస్త్రజ్ఞులువచ్చి, యీ మానును పరీక్షించి, కాలమును నిర్ణయించిన బాగుండును. బ్రహ్మముగారు వ్రాసిన కాలజ్ఞానతత్త్వము లీ మాను క్రింద నున్నవో లేవో పరీక్షించు ధైర్యము భక్తులకు లేదు. ఈ వృక్షమున్న ప్రదేశ మచ్చమ్మగారి యిల్లు. ఆమె సమాధి యందే యున్నది. ఆ ప్రక్కనే, నేలలోఁ గూర్చుండుటకుఁ దగినచోటు గలదు. అగి చూడఁ దగినది. అందు మునిస్వామి యను బ్రాహ్మణుఁడు కొన్నాళ్ల తపమొనర్చెను. ఇప్పుడాయన మిక్కిలి వృద్ధుఁడై, సమీపమున నున్న స్వగ్రామమున నున్నాఁడు. ఇందు బ్రహ్మముగారి బొమ్మ యున్నది.

ఈ చింతమానును గూర్చి యిచ్చటి జనులు వింతగాఁజెప్పిరి. దీని నడుమనుండి పాలు స్రవ మప్పుడప్పుడు కారుచుండెనట. ఆ మరునాఁడు లెప్పక దేశమున నేదో యుపద్రవము సంభవించు చుండెనట ! చిత్రమే ! ఈ చింతమానును గూర్చియే బ్రహ్మముగారు కొన్ని తత్త్వములతోఁ జెప్పియున్నారని భక్తుల విశ్వాసము.

'చింతమానిమీద చెమంతి
పూసెను తెలిసికోండి
ఆ చేమంతి మీదను చెంగల్వ
పూసెను తెలిసికోండి'

'చింతమాని మీద—చేమంతి
పువ్వు పూసె తెలిసికోరా
దాని చెంతనున్న—కోతి
పులిపిల్ల నీనను తెలిసికోరా'

'చింత బుట్టిన రాతిమీదను
చింతమా నొకటాయెరా
అంతలోనే దానిలో చేమంతి
పువ్వులు పూసెరా.'

వీని యర్థములను బరిశీలించుట కిది తావుకాదు. ఈ 'చింత' శబ్దమునకు 'యోజన' యను నర్థమును వివరించుట కిట చోటలేదు. నిజముగాఁ జింత మానుకుఁ జేమంతి పూవులు పూయునని విశ్వసించు వారలకుఁదగిన సమయమాసన్నమైనదేమో ! వింత వచ్చినది కదా ! పులులున్నచోఁ జిగురింప వచ్చునేమో ! 'వేమన్న తత్త్వము'లలోఁ గూడ నిట్టివి పెక్కున్నవి. వేమన్న తత్త్వములు ప్రచారములో లేవు. బ్రహ్మముగారికి వేమనగారు గురుతుల్యులు బ్రహ్మముగారి తత్త్వములలో వేమన నామము పలుచోటుల నున్నది.

నేలమఠము

బనగానపల్లిలో బ్రహ్మముగారి నేలమఠము భక్తులను బాగుగ నాకర్షించుచున్నది. ఇది నవాబుకోట సమీపమున నున్నది. సుందర ప్రకృతిలో, నేత్రపర్వమగు వృక్షరాజముల నడుమ వెలసియున్నది.

భూమిలోపల నున్న శివాలయమే నేలమఠము. దీనిని గరిమిరెడ్డి అచ్చమ్మగారు కట్టించిరట ! పైభాగమును నవాబుగారు నిర్మించిరని తెలియుచున్నది. ఇచటనుండి నవాబుగారి కోటకు భూమార్గమున్నదని వాడుక. ఈ నేల మఠమున శివలింగమునకు బ్రహ్మముగారి వెండి విగ్రహమును దగిలించిరి. బ్రహ్మముగారు అచ్చమ్మగారి పుత్త్రుడు, బంధుఁడునైన బ్రహ్మానందరెడ్డి

గారికి కన్నుల నొసంగిరట! అంధునికిఁ గన్నులు వచ్చెనని భటులవలన విన్న నవాబు బ్రహ్మముగారిని పరీక్షింపఁదలచి, యాయన నాహ్వానించి, పళ్లెరములో మాంసముంచి యెదుట నుంచగా—మాంసపు ముక్కలు పూలుగా మారెనని చెప్పుదురు. నవాబు బ్రహ్మముగారికి శిష్యుఁడయ్యె నన్న నిట్టి బలవత్తర కారణమేదియో యుండవలెను గదా! నవాబుగారు బనగానపల్లెకు రెండు మైళ్ల—దూరమున నున్న ఏబది యెకరముల మాగాణిని మఠమున కొసఁగిరి.

బ్రహ్మముగారికి అన్నాజయ్యయను శిష్యుఁడుండెను. ఇతఁడు బ్రాహ్మణుఁడు. బ్రహ్మముగారీ యుత్తమ శిష్యునకుఁ గాలజ్ఞాన తత్త్వముపదేశించిరి. అన్నాజయ్య నేలమఠమనే యొకప్రక్క సమాధిఁ జెందిరి. ఇప్పుడాయన కారాధన జరుగుచున్నది.

బ్రహ్మముగారీనాటి మాటల నేనాడో యూహించి చెప్పిన ధీశాలి.

'రూకకు చిట్టెడు బియ్య మమ్మును'
'వావి వరుసలు వల్లకాటిలో చేరును'
'సకల జాతి దొరలు నష్టపడెదరు'
'360 వ్యాధు లెగయును'
'వైద్యము పారదు'
'బాపల పంచాంగములు పనికిమాలును'
'మసి పాత మాడకమ్మును.'

అన్ని తత్త్వములను నగ్నము చేసికొని, విడమరచి చెప్పుట మిక్కిలి కష్టము. మూఢులను భయపెట్టి, వారిని సన్మార్గగాములుగా నొనర్చుటకై కొన్ని చిత్రమైన తత్త్వములను జెప్పిరి. ఈనాఁడును మనము కొన్ని వింతలను జూడగలము. అవి ప్రకృతి సిద్ధములో, బ్రహ్మముగారి మాహాత్మ్యములో!

నేలమఠములో రెండు వేపచెట్లొక కుదురులో నున్నవి. ఇవి యద్భుతమైనవి. ఒకటి నేలమఠము వైపు మ్రొగ్గియున్నది. దీని యాకు తీపిగా నుండు ననియు, రెండవది చేదుగా నుండునని యచ్చటివారు చెప్పిరి. నేను తిని చూచితిని. ఒకటి చేదుగా నున్నది రెండవది తీపిగా లేకున్నను, చేదుగా మాత్రములేదు. ఆ యాకులను హాయిగాఁ దినవచ్చును. ఆ వేపచెట్టు మొదలనున్న మాను ముడినుండి తీర్థము స్రవించుచుండెనట. మైలస్త్రీ తాకుటచే నది యాగిపోయెనని తెలియుచున్నది.

సర్వమానవ సమానత్వమును జాటిన యసామాన్య సంసారి పోతులూరి. ఆయన సంచరించిన బనగానపల్లి ప్రాంతము భారతీయులకు పుణ్యక్షేత్రము.

తెలుగు కన్నడ ఛందోరీతులు : ఏకత్వములోని భిన్నత్వములు

శ్రీ సంపత్కుమార

తెలుగునందుకన్న ముందే కన్నడమందు కావ్య రచనయు, తద్ద్వారా ఛందః ప్రయోగము కూడ ప్రారంభమయినది. అందువలన, పలువిధములుగా తన వంటిది, పొరుగు భాషయునగు కన్నడము నందలి ఛందోవిధానమును అనుకరించుట తెలుగునకు సహజమే యగును. ఆ కారణముగా తెలుగు కన్నడ ఛందో విధానములందు ఏకతా లక్షణము కన్పించుటయు సంగతమే, అయితే ఆ యేకత్వమునందే భిన్నత్వ లక్షణములు గూడ కొన్ని పరిదృశ్యమానములగును. తెలుగు యొక్క ప్రత్యేకవ్యక్తిత్వమును వ్యక్తీకరించునవి యీ భిన్నలక్షణములే మరి. అందువలన, ఏకత్వము నందు భిన్నత్వాకలితములయిన లక్షణములలో కొన్ని యిక్కడ ప్రస్తుతీకరించబడును. సంస్కృత చ్ఛందోరీతుల ప్రభావము ఉభయ భాషలకు సమానమే. అయినను కొన్ని యంశములు గమనింపవలసిన తేడాతో లేకపోలేదు. కాని ప్రస్తుతము దేశీయములయిన యంశములే ప్రధానముగా ఇక్కడ స్వీకరింపబడినవి.

1

పేర్లలోనే భేదము తప్ప, కన్నడములోని త్రిమూర్తి గణములు—అనగా, బ్రహ్మ—విష్ణు—రుద్ర గణములు, తెలుగులోని సూర్య – ఇంద్ర – చంద్ర గణములు ఒక్కటే. రెండు, మూడు, నాలు గురువులను ప్రస్తరింపగా వరుసగా నాలుగు, ఎనిమిది, పదునారు గణములలో మూడు గణవర్గము లేర్పడును. వీటిలో లఘ్వాదిగణముల ముందు ఆదనముగా ఒక లఘువు చేర్చవలసి యుండును. ఈ మూడు గణ వర్గములే వరుసగా బ్రహ్మ, విష్ణు, రుద్రగణములని కన్నడమందు, సూర్య—ఇంద్ర—చంద్ర గణములని తెలుగునందు పేర్కొనబడినవి. అయితే ఈ మూడు వర్గములకు చెందిన గణములన్నియు కన్నడ దేశి పద్యములం దుపయోగించును. కాని తెలుగునం దట్లుకాదు. సూర్యాది గణములు కేవలము 'అక్కర జాతి' పద్యములకే ఉపయోగించునని తెలుగులో మొదటి ఛందోగ్రంథ నిర్మాత అయిన భీమన[1], ఆయన ననుసరించే రెండవ వాడయిన విన్నకోట పెద్దనయు చెప్పినారు. 'అక్కరజాతి' పద్యములనగా, అయిదు విధములైన అక్కరలు ద్విపద, త్రిపద, షట్పదలు మాత్రమే. ద్విపద ననుసరించి తరువోజకూడ పై వాటిలో చేరును. ఇవిగాక మిగిలిన దేశి పద్యములగు సీస, గీతాదులకు సూర్యాది గణవర్గత్రయములోని గణములన్నియుగాక కొన్నిమాత్రమే ఉపయోగించును. ఉపయోగించని గణములు ప్రతి గణవర్గమందలి మొదటి రెండేసి గణములు. ఇట్లు మొదటి రెండేసి గణములను— మొదటి (సూర్య)వర్గమున గగ—సగణములను, రెండవ (ఇంద్ర)వర్గమున మ—సగ గణములను— వదిలివేయగా సూర్యేంద్ర గణవర్గములలో వరుసగా రెండు—గల, నగణములు—, నాలుగు—ర, నగ, త, సల, భ, నల గణములు — మాత్రమే

1 తెలుగులో తొలి ఛందోగ్రంథము 'కవిజనాశ్రయము.' దాని కర్త భీమనయా ? రేచనయా యన్నదింకను తెగనివాదమే. ప్రస్తుతమునకు కర్త యెవరైనను భేదమేమియు లేదు.

మిగులును. ఈ మిగిలినవాటిని సూర్యేంద్ర గణములనక, భీమన, పెద్దనలు 'నగణ' 'నలనామక గణ'ములని పేర్కొన్నారు. చంద్రగణములకు అక్కరజాతి పద్యములలో తప్ప, తెలుగునందరి ఇతర దేశి పద్యాలలో ప్రయోగములేదు. అందుకని వాటినిగూర్చి వారేమియు చెప్పలేదు.

అయితే, భీమన పెద్దనల తరువాత, సూర్యేంద్ర గణములని, నగణ, నలనామక గణములని వేరువేరుగా గుర్తించు పద్ధతి పోయినది. కేవలము నగణ, నలనామక గణములకే సూర్యేంద్రగణములుగా గుర్తింపు వచ్చినది. అందుకనియే అనంతుడు ప్రతిగణ వర్గము నుండి మొదటి రెండేసి గణములు విడువగా మిగిలినవే సూర్యేంద్ర చంద్రగణములని చెప్పినాడు. అనంతు డిట్లు చెప్పుటకు కారణమున్నది. భీమన దృష్ట్యా సూర్యాదిగణముల యవసరముగల 'అక్కర జాతి' పద్యములలో ఒక్క ద్విపదకు తప్ప మిగిలిన వాటికి తెలుగులో ప్రచారములేదు. అక్కరలలోని 'మధ్యాక్కర'ను కొంత విరివిగా 'మధురాక్కర'ను ఒకటి రెండుమారు మాత్రమే నన్నయగారు, ఆయన ననుసరించి ఎఱ్ఱనగారు ప్రయోగించినారు. ఇటీవలి వరకు మరల అక్కరల నెవరును ఉపయోగించలేదు. త్రిపద, షట్పదులకు ఆమాత్రము ప్రయోగముకూడ తెలుగులో ఇటీవలివరకు లేదు. అందువలన కేవల మక్కరజాతి పద్యములకుమాత్రమే ఉపయుక్తములయిన ప్రతివర్గములోని మొదటి రెండేసి గణములను అంగీకరించుటవలన తెలుగునకు ప్రయోజనములేదు. పైగా, అక్కరజాతి పద్యములకు నగణ, నలనామక గణములు ఉపయోగించనే ఉపయోగించును. అందువలన భీమనాదులవలె దేశి పద్యములను, అక్కరజాతి, తదితరములు అని, దేశిగణములను సూర్యేంద్ర చంద్రగణములు, నగణ నలనామకగణములు అని రెండేసి భాగములుగా చేయుటలో సౌకర్యమేమియులేదు. అందువలన, అక్కరజాతి పద్యములకుగూడ నగణ, నల నామకగణములను మాత్రమే వర్తింపజేసి, వానిని గూడ మిగిలిన దేశి పద్యములతో కలుపుట సమంజసమని భావించిన అనంతుడు పైవిధముగా నిర్ణయించినాడు. ఈ నిర్ణయమునవలన, ఇతర దేశి పద్యాలతో పాటు అక్కరాదులకు గూడ నుపయోగించు నగణ, నలనామక గణములే తెలుగున సూర్యాదిగణములుగా స్థిరపడ పోయినవి. దీనితో కన్నడ త్రిమూర్తిగణములకు, తెలుగు సూర్యాదిగణములకు, ఆయా గణవర్గములలోని మొదటి రెండేసి గణముల నంగీకరించుట, అంగీకరించక పోవుట యనునంశములో భేదమేర్పడినది.

మరి, భీమనాదులు దేశి పద్యములను, గణములను రెండేసి వర్గములుగా ఎందుకు విభజించినారన్నది యొకప్రశ్న. అయిదు విధములయిన అక్కరలు, త్రిపద, షట్పదలు కన్నడమునుండి గ్రహించి చెప్పబడినది. ఆనాటికి తెలుగులో ఆ పద్యముల కెంతప్రయోగ ముండెడిదో కచ్చితముగా చెప్పవీలులేదు. యుద్ధమల్లుని బెజవాడ శాసనములో, దాని ననుసరించి నన్నయగారి రచనలో మధ్యాక్కరలు మాత్రము కన్పించుచున్నవి. ఈ మధ్యాక్కరలయందు సూర్యేంద్ర గణవర్గములలోని మొదటి రెండేసి గణములు (గగ, స; మ, సగ) కన్పించుచున్నవి. మరియు పాల్కురికి సోమనాధుని ద్విపద కావ్యములలో అరుదుగా గగ; స గణాదులు కన్పించును.[2] ఈ యంశములను గుర్తించిన భీమన సూర్యాది గణములను కన్నడమందలి త్రిమూర్తి గణములకు సమాన రూపములో యథాతథముగా గ్రహించుట యుక్తమని భావించినాడు. మరి, సీసాది పద్యములందు పైన చెప్పిన గణముల ప్రయోగము కన్పించక పోవుటచే, వీటి విషయమున ఆగణములను వదిలి, మిగిలినవాటిని నగణ; నలనామక గణములుగా పేర్కొన్నాడు. ఈ విధముగా దేశీయ పద్యములందు

---

2. యుద్ధమల్లుని శాసనమందు, నన్నయగారి రచనయందు, సోమనాధుని ద్విపదలయందు గణభంగములుగా ఈనాడు భావింపబడు పలుతావులు భీమనాదుల దృష్టిలో సరియైనవే. ఇంకను వివరములకు నా వ్యాసములు 'ద్విపద గణములు' (భారతి—జూన్-63) దేశియగణములు : లాక్షణిక మత భేదములు' (సాహితి—నవం. 1963) చూడవలెను

గణప్రయోగము దృష్ట్యా పద్యములను, గణములను రెండు వర్గములుగా విభజించి తననాటి ప్రయోగరీతిని సంరక్షించి మనకు తెలియజేసినాడు. అయితే ఆ తరువాతికాలములో అక్కర జాతి పద్యములకే ప్రయోగము లేకపోవుటవలన. ఉన్న ద్విపదయందును గగాదుల ప్రయోగము లేకపోవుటవలన భీమన చేసిన విభాగమునకు గుర్తింపు అనవసరమై పోయినది.

ఇక్కడ గమనింపవలసిన మరొక యంశము కూడ ఉన్నది. రెండు గురువులను ప్రస్తరించి, లఘ్వాదిగణములముందు అదనముగా నొక లఘువును చేర్పగా నేర్పడ్డ నాల్గింటిలో మొదటి రెండు (గగ, స) నాల్గుమాత్రల గణములు. మిగిలిన రెండు (గల, న) మూడుమాత్రలగణములు. అనగా, భిన్నమాత్రాసంఖ్యగలగణములు ఒకేవర్గముగా ఏర్పడిన వనినమాట. మరి వీటిలో మొదటి రెండు గణములను వదిలినచో సూర్యగణమున్నియును త్రిమాత్రాగణములే యగును. ఈ గణవర్గమునకు భిన్నమాత్రాసంఖ్యాత్వము తొలగును. ఇట్లే మూడుగణములను ప్రస్తరించగా ఏర్పడ్డ ఎనిమిదింటిలో మొదటి రెండు (మ—సగ) ఆరుమాత్రలగణములు. తరువాతి నాల్గు (ర, నగ, త, సల) అయిదుమాత్రలగణములు. చివరి రెండు (భ, నల) నాల్గుమాత్రలగణములు. కాగా ఈ గణవర్గమందు భిన్నమాత్రాసంఖ్యగల గణములు మూడురకములుగా ఏర్పడినట్లయినది. మరి, వీటిలో మొదటి రెండుగణములను తొలగించుటవలన భిన్నమాత్రాసంఖ్యాగణముక్తి కొంత తొలగి, కేవలము అయిదు, నాల్గుమాత్రలగణములే ఇంద్రగణములగును. ఇంద్రగణములందు పంచమాత్రాగణసంఖ్యయే ఎక్కువ. ప్రయోగముకూడ చతుర్మాత్రాగణముకన్న వీటికే ఎక్కువ. ఇదిట్లుండగా, తెలుగునందు నన్నయ సోమనల రచనలందరుదుగా తప్ప, వారి తరువాత సూర్యగణస్థానమందు గగ, సగణములుగాని ఇంద్రగణ స్థానమందు మ—సగములుగాని ఎక్కడను కన్పించవు. కన్నడములో వీటిప్రయోగ మత్యధికమని చెప్పలేము గాని, విరివిగానేయున్నది. అందువలన కన్నడములో ఆ రెండేసి గణముల నంగీకరించక తప్పలేదు. తెలుగులో అంగీకరించవలసిన అవసరము కలుగలేదు. పైగా, తెలుగులో కలిగిన లాభము. అయా గణవర్గములందు భిన్నమాత్రాసంఖ్యాగణముక్తి ఒకదానిలో తొలగుట, రెండింటియందు తగ్గుట. ప్రస్తారదృష్టి కాక, ప్రయోగదృష్టియే తెలుగునకు ప్రధానమనుట కిది యొక ఉదాహరణమనవచ్చును. మరియు ఒక్కొక్క గణవర్గమందు భిన్నమాత్రాసంఖ్యాగణత్వము అంతగా తెలుగున కభిలషణీయముకాదనియు తెలియును.

ఇదిట్లుండగా, ఒకేగణవర్గమందు భిన్నమాత్రా సంఖ్యగలగణములు ఎందుకుచేరుట తటస్థించినదన్నది కూడ ఆలోచించవలసిన యంశమే. కేవలము ప్రస్తారమే దీనికి కారణమనుట సరిగా కన్పించదు. అయితే ఈ యంశమునుగూర్చి తరువాత ప్రస్తావింతును.

2

నాగవర్మ తన ఛందోంబుధియందు 'కర్ణాటక విషయజాతు' లనుపేర కన్నడమున పదిదేశి పద్యములను చెప్పినాడు. అవి ఇవి:— 1. అక్కర. (ఇది అయిదువిధములు). 2. ఛందోవతంస, 3. చౌపది, 4. మదనవతి, 5. అక్కరిక, 6. ఏల, 7. ఉత్సాహ, 8. గీతిక, 9. త్రిపది, 10. షట్పది. (రగడ, సీసముల విషయము తరువాత ప్రస్తావింపబడును.) పై పదింటిలో, అక్కర—ఛందోవతంస—ఉత్సాహ—త్రిపది— షట్పది అన్న అయిదుమాత్రమే తెలుగు ఛందోగ్రంథములలో చెప్పబడినవి. తెలుగులో 'ఛందోవతంస' అన్న పేరు లేదుకాని, దాని లక్షణము తెలుగు ద్విపదకు సరిపోవుచున్నది కాన, ఛందోవతంసయు తెలుగులో చెప్పబడినట్లుగా భావించబడుచున్నది. అయితే, ఈ రెండింటిలో ఒక తేడా ఉన్నది. ఛందోవతంస నాల్గుపాదముల పద్యముకాగా, ద్విపద రెండు పాదముల పద్యము. ఇదిట్లుండగా, తెలుగు లక్షణ గ్రంథములలో 'ఎత్తుగీతి' పేర చెప్పబడిన పద్యము, నాగవర్మ చెప్పిన 'చౌపది'కి సరిపోవుచున్నట్లు కన్పించును. అయితే, లక్షణము చెప్పుటలో కొంత తేడా యున్నది. నాగవర్మ చౌపదికి ఒక విష్ణుగణము+ఒక రుద్రగణము ప్రతిపాదమున నుండునని

చెప్పినాడు. భీమన ఎత్తుగీతికి చెప్పిన లక్షణము స్పష్టముగా లేదు. కాని పద్యస్వరూపమునుబట్టి చూచినచో పైని నాగవర్మ చెప్పిన లక్షణమునకు సరిపోవును. భీమన తరువాత అనంతాదులు ఎత్తుగీతికి 1 ఇం+2 సూ. అని లక్షణము చెప్పినారు. నాగవర్మ రచించిన చౌపది పద్యమందు ఒక విష్ణుగణము తరువాత ఆరుమాత్ర లున్నవి. అందువలన, తెలుగువారు ఆ ఆరుమాత్రలను రెండు సూర్యగణములుగా చెప్పియుందురు. ఎందుకనగా, అనంతాదుల దృష్ట్యా సూర్యగణములన్నియు త్రిమాత్రాగణములే. నాగవర్మ పద్యమిది:—

'మదనన—తండెయు ముం
దొదవిరి - శంకర నొ
క్పొద విరి—నందుదు నో
డిదు సతి—జౌపదిగే.'

భీమన ఎత్తుగీతి పద్యమిది:—

'శ్రీదయి—తాధి పాన
యోదయ—నలిన సత్ర
యోదిత—మైన నెత్తు
గీతియ—యొప్పు, గృతుల.'

ఈ భీమన పద్యము అటు నాగవర్మ చౌపదికి చెప్పిన లక్షణమునకు, ఇటు అనంతాదులు ఎత్తుగీతికి చెప్పిన లక్షణమునకును సరిపోవునట్లుగా నున్నది. అయితే, భీమన పద్యమున లక్షణము స్పష్టముగా లేకపోవుట వలన, ఆ పద్యమున భ+గల+గల అని బేసి పాదములను, భ+న+గల అని, భ+గల+న అని సరిపాదములను విభజించి 1 ఇం+2 సూ. అని లక్షణము చెప్పియుందురు. రెండు గలములు ఒక చంద్ర (రా) గణము కావచ్చును. అట్లే న, గలములు కలిసి 'నగల' యన్న చంద్రగణము, గల, న, గలములు కలిసి 'భలల' యన్న చంద్రగణము కావచ్చును. పద్యమునందు కన్పించు 'నలి (ల) నన్నత యోదిత' యన్న భాగము అనంతాదుల లక్షణమున కుపస్కారకము అయి ఉండవచ్చును. ఏదేమయినను, భీమన నాగవర్మననుసరించగా, భీమన పద్యమునుబట్టి అనంతాదులు లక్షణము చెప్పినారు. విన్నకోట పెద్దన యొక్కడు మాత్రము ఎత్తుగీతికి మూడు 'నగణము' లను (అనంతాదుల దృష్ట్యా సూర్యగణములను) ప్రతిపాదించినాడు. మరి ఇది ఏ లాక్షణికుని పద్ధతికిని సరిపోనిది.[3]

కాగా, కర్ణాటక విషయ జాతులలోనివి తెలుగులో ఆరుమాత్రము చెప్పబడినట్లయినది. అయితే ఇక్కడ గమనించవలసిన మరొక అంశమున్నది. కన్నడమందలి 'ఛందోవతంస' మొదట త్రిమూర్తి (బ్రహ్మాది) గణబద్ధమయిన పద్యము. ఆ తరువాత కొంతకాలము నాటికది మాత్రా సంఖ్యాగణ బద్ధమయి 'చౌపది' అన్న పేర ప్రసిద్ధమయినది. దీని లక్షణము ప్రతిపాదమున మూడు పంచమాత్రా గణ

---

3. విన్నకోట పెద్దన ఎత్తుగీతికి చెప్పిన లక్షణమిది. 'గలము రెండు నగణములును, గలసి ప్రాస వరయఁ, జెలువుదోప నెత్తుగీతి, వెలయుఁ గృతులయందు' కావ్యా. చూడామణి. పు. 117 వేదము వారి ప్రతి.) ఇందు లక్షణము స్పష్టమే. కాని లక్ష్యముగూడనగు ఈ పద్యపు బేసి పాదములు లక్షణ విరుద్ధముగా నున్నవి. భీమన పద్యమునగూడ లక్షణము సరిగా స్పష్టము కాకపోవుటచే, అతనికి సన్నిహితుడగు విన్నకోట పెద్దన చెప్పినదే అతడునుచెప్పి యుండవచ్చునని పించినది. అందువలన పెద్దన లక్షణము ననుసరించి అతని లక్ష్యమును, భీమన పద్యమునుగూడ సవరించి లోగా 'భారతి' (జూలై 1962)లో 'కావ్యాలంకార చూడామణి: కొన్ని అసమన్విత పద్యములు' (కలగూరగంప) అన్న లఘు వ్యాసమున వ్రాసియుంటిని. కాని నాగవర్మ 'చౌపది' దప్పికి వచ్చిన తరువాత, భీమన నాగవర్మ చెప్పినదే చెప్పియుండునని భావించుచున్నాను. త్రిపదాదుల విషయమున భీమన నాగవర్మనే అనుసరించిన యంశము పై లఘు వ్యాసముననే ప్రదర్శించితిని. తెలుగున ప్రయోగములేని ఈ పద్యముల విషయమున విన్నకోట పెద్దన, అనంతాదులును పొరపాటు పడినారు. అది విడిగా పరిశీలించవలసి యుండును.

ములు + ఒక త్రిమాత్రాగణముండుట. విష్ణుగణములలో పంచమాత్రా గణములేకాక, షణ్మాత్రా, చతుర్మాత్రా గణములుకూడ ఉన్నవి. అయితే మాత్రాసంఖ్యా గణములు ప్రతిపాదింపబడుటచే విష్ణుగణస్థానమున షట్, చతుర్మాత్రాగణములు, బ్రహ్మగణస్థానమున చతుర్మాత్రాగణములు నివారితములయినవి. అనగా వీటి కలగలపు స్థితి తొలగినది. ఈ 'చౌపది' నాగవర్మ నాటికిలేదు. మధ్యయుగము నాటికి రూపొంది వ్యాప్తికి వచ్చినది.[4] ఈవిధమయిన 'చౌపది'ని తెలుగులో చిత్రకవి పెద్దన, అప్పకవి 'కర్ణాటక చతుష్పద' పేర చెప్పినారు. ఇదిట్లుండగా, 'వితాళచౌపద' యనుపేర అనంతాదులు మరొక పద్యభేదమును చెప్పినారు. ఈ వితాళ చౌపదలక్షణము ప్రతిపాదమున వరుసగా రెండు సూర్యగణములు + రెండు చతుర్మాత్రాగములు + ఒక లఘువు ఉండుట. అనగా, పాదము మొత్తమున 15 మాత్రలు. దీనినే మరొకవిధముగా అనగా, 3 చతుర్మాత్రాగణములు + ఒక త్రిమాత్రా గణము అనిగూడచెప్పవచ్చు. ఈ లక్షణముతో అనంతాదులు 'చౌపద'యన్న పద్యమొకటి చెప్పినారు. వితాళచౌపదకు, ఈ చౌపదకు మాత్రల పంపకము ననే తప్ప మొత్తము సంఖ్యలో భేదములేదు. ఇది ట్లుండగా, పాదమునకు త్రిమాత్రాగణములు అయిదు అనిగూడ చెప్పవచ్చును. అయితే ఈ లక్షణముతో ఎవరుగూడ ఏ పద్యమును చెప్పలేదు.[5] మరి వీటికి సరిపోవునవి కన్నడమందున్నట్లు కన్పించదు.

అయితే, గమనించవలసిన చిత్రమేమనగా, కన్నడమునుండి తెలుగులోనికివచ్చినవని యనుకొనబడుచున్న పైపద్యములలో ద్విపద (ఛందోవతంసకు సరియైన తెలుగుపద్యము) ఉత్సాహతప్ప మరి వేటికిని తెలుగుసాహిత్యమందు ప్రయోగములేదు. (అక్కరల విషయమిదివరకే చెప్పబడినవి) లక్షణగ్రంథములవరకే ఇవి పరిమితమయిపోయినవి. కాగా తెలుగులో ప్రసిద్ధమైన దేశిపద్యములు సీసము, తేటగీతి, ఆటవెలది. సంస్కృతమందలి ఆర్యాగీతి కారణముగానో, ప్రాకృత ఖందిని కారణముగానో, కందము తెలుగు కన్నడమునందు మిక్కిలిగా ప్రయోగమందున్నది. తేటగీతి కన్నడములో కన్పించదు. ఆటవెలది ఇటీవల కన్నడమున కొంత ప్రయోగమునకు వచ్చినదందురు.[6] కాగా సీసముమాత్రమే ప్రత్యేకముగా పరిశీలింపదగియున్నది.

3

ఛందోంబుధిలో సీసమునుగూర్చి నాగవర్మ చెప్పినట్లు ఈ క్రింది పద్యము కనిపించుచున్నది.

'పురుహూత గణ గళారుం
సరసిజ భవ గణ గళెరడు సంధిసిబక్కుం
చరణక్కె సీసదంతదా
తొరగింతహ సరళ తన్నెళొప్పన తెరదిం.'

ఈ పద్యమందు 'పురుహూత' యన్నపేర కొన్ని గణములు చెప్పబడినవి.[7] పురుహూతుడనగా ఇంద్రుడు. ఇంద్రుని పేర గణములను చెప్పట తెలుగునందలి పద్ధతి. కన్నడమున విష్ణువు పేరి గణములు తెలుగు ఇంద్రగణములు. ఆ విధముగా, కన్నడమున నాగవర్మ విష్ణువనుటకు బదులు ఇంద్రుని పేర గణములు పేర్కొనుట వింతగా కన్పించును. అందువలననే కావచ్చు, ఈ పద్యమును ఛందోంబుధి యందు ప్రక్షిప్తముగా పరిశీలకులు భావించుచున్నారు. ఇదిట్లా ఉండగా, పై పద్యమునందలి లక్షణమునకు లక్ష్యముగాఉన్న పద్యమందు 'పురుహూత' గణము లన్నియు పంచమాత్రా గణములే. మచ్చుకయినను ఒక చతుర్మాత్రాగణముగాని, షణ్మాత్రాగణముగాని కన్పించదు. కాగా, పంచమాత్రా గణములకు 'పురు

---

4. చూ. కన్నడ ఛందోవికాస. పు. 142— శ్రీ డి. ఎస్. కర్కి.

5. ఆటవెలది పద్యపు సరిపాదములు అయిదు త్రిమాత్రాగణములతో నుండుట ఈ సందర్భమున గుర్తింపవలయును.

6. చూ. 'తెలుగుభాషలో ఛందోరీతులు' పు. 388—శ్రీ రావూరి దొరసామిశర్మ.

7. సరసిజ భవ గణములనగా బ్రహ్మగణములు. ఇవి తెలుగులోని సూర్య గణములకు సమానములు.

హూత' గణములని నాగవర్మ పెట్టిన పేరేమో? ఇది పరిశీలించవలసిన అంశం. మరొక గమనించవలసిన అంశమేమనగా, ఆటవెలదిగాని, తేటగీతిగాని సీసమునకు అనుబంధింపబడి లేదు. తెలుగులోవలె అనుబంధింప జేయుటయన్నది చాలా ఆలస్యముగా కన్నడమున వ్యాప్తిలోనికి వచ్చినది. ఛందోంబుధిలో పై సీసపద్య లక్షణము నిజముగా ప్రక్షిప్తమే అయినచో, నాటికి కన్నడమున సీసపద్యము వ్యవహారమున లేదనియే చెప్ప వలయును. నాగవర్మ క్రీ. శ. 990 ప్రాంతమువాడని కన్నడ కవి చరిత్రద్వారా తెలియును. అయితే, ఇంతకు ఒక శతాబ్దము పూర్వమే కందుకూరు, ధర్మవరము శాసనములందు తెలుగులో తొలిసారిగా సీసపద్య ప్రయోగము కన్పించును. ఈ పద్యములందు 'పురుహూత' (ఇంద్ర) గణముల స్థానములో 4, 5 మాత్రా సంఖ్యా గణముల ప్రయోగమున్నది. మరియు, సీసమునకు ఆటవెలదియో, తేటగీతియో అనుబంధింపబడి కూడా ఉన్నది. నాటికి నేటికి తెలుగులో సీసపద్యమునకు విపరీతముగా ప్రచారము లభించినది. తెలుగు కవులు మిగిలిన పద్యము లన్నింటికన్న సీసమును పలురకాల నడకలతో సుసంపన్నము చేసినారు.

లభ్యమగుచున్న తెలుగు శాసనములలో అతి ప్రాచీనముగా శాసనస్థమయిన పద్యము 'తరువోజ'. పై సీస పద్యముగల శాసనములు తొమ్మిదవ శతాబ్ది చివరి భాగమునకు చెందినవికాగా, తరువోజ గల అద్దంకి శాసనము మొదటి భాగమునకు (క్రీ. శ. 848)కి చెందినది. తరువోజ అనగా ద్విపద యొక్క రెండు పాదములు ఒకే పాదమగుటవలన ఏర్పడిన పద్యము. పాల్కురికి సోమన కాలమునుండి ద్విపద విజృంభించుటతో, అప్పటినుండి తెలుగులో తరువోజకు స్థానములేకుండా పోయినది. ఇక్కడ గమనించవలసిన మరొక అంశమేమనగా, రెండు ద్విపద పాదములు ఒకే పెద్ద పాదముగా ఏర్పడిన తరువోజ పాదములో నడుమ నున్న సూర్యగణము పాదాంతమున చేరినచో, అది సీస పాదమగును. (తరువోజ గణక్రమము 3 ఇం+1 సూ+3 ఇం+1 సూ. అని. సీస గణక్రమము 6 ఇం+2 సూ. అని) ఈ విధముగా చూచినచో వాటికి నేటికి, కన్నడమున త్రిపదవలె, తెలుగులో సీసము అతి ప్రాచీన పద్యము. తెలుగులో సీసమున కున్నంత చరిత్ర కన్నడమున లేదు. ఇక సీసముతో పాటు ఆటవెలది, తేటగీతి కూడా తెలుగులో సీస మంతటి ప్రాచీన పద్యములు. కాగా ఈమూడు తెలుగునకు అతి ప్రాచీనకాలమునుండియు అమరిన విశిష్ట పద్యములు.

కన్నడ 'పిరియక్కర' లేదా తెలుగు 'మహాక్కర' పాదమునకు, సీసపాదమునకు సన్నిహిత సంబంధ మున్నది. 1 బ్ర+5 వి+1 రు. గణములుండుట పిరియక్కర లక్షణము. పాదాది బ్రహ్మగణము విష్ణు గణమై, పాదాంత రుద్రగణము రెండు బ్రహ్మగణము లుగా విరిగినచో పిరియక్కర పాదము సీసపాద మగును. రెండేసి బ్రహ్మగణాలుగా రూపొందగలవి. (మగ—సగగ—రగ—నగగ – మలఘు—సగల—రల—నగల) ఎనిమిది రుద్రగణము లున్నవి. తెలుగులో అనంతాదుల దృష్ట్యా రూపొందగల చంద్రగణాలు (రల—నగల) రెండుమాత్రమే. ఈ విధముగా పిరియక్కరకు, తద్వారా త్రిపది, షట్పదులకు సీసమునకు చాలా సాన్నిహిత్యమున్నది. ఈ కారణముననే కావచ్చు, తెలుగులో పిరి (మహా) అక్కరకు, త్రిపది, షట్పదులకు ప్రచారము కలుగలేదు.

కన్నడమున తేటగీతి లేదని ఇంతకుముందు చెప్పబడినది. కాని, అయిదు విధముల అక్కరలలో ఒకటయిన ఎడెయక్కర (తెలుగులో అంతరాక్కర) తేటగీతికి సరిపోవును. 1 బ్ర+2 వి+1 రు అన్నది ఎడెయక్కర గణక్రమము. చివరి రుద్రగణము రెండు బ్రహ్మ (సూర్య) గణములగుచో తేటగీతి యగును. (ఇక్కడ బ్రహ్మగణము లనగా త్రిమాత్రాగణములని, విష్ణుగణము లనగా, నాల్గు — ఐదుమాత్రల గణము లని గ్రహింపవలెను. అనగా, అనంతాదుల దృష్ట్యా సూర్యేంద్రగణములు.) అక్కరలకు ఆది ప్రాస నియతము. తేటగీతికి కాదు. ఇది ఒక చిన్న తేడా కావచ్చు.

4

అక్కరల విషయము వచ్చినది గావున, వాటిని గూర్చిన ఒకటి రెండంశము లిక్కడ ప్రస్తావించబడు

చున్నవి. అక్కరలు అయిదు విధములు. 1. పిరియక్కర, 2. దొరెయక్కర. 3. నడువణక్కర, 4. ఎడెయక్కర, 5. కిరియక్కర (తెలుగులో వీటికి వరుసగా, మహాక్కర, మధ్యాక్కర, మధురాక్కర, అంతరాక్కర, అల్పాక్కర అని పేర్లు) అక్కరలన్నిటికిని సమానలక్షణములు రెండుగా కన్పించును. ఒకటి: ప్రతిఅక్కరకు పాదాంతమున రుద్రగణము నియతముగా నుండుట. రెండు: పాదాదియందు బ్రహ్మగణ ముండుట. దొరెయక్కరకు ఈ రెండు లక్షణములు లేవు. కిరియక్కరకు రెండవలక్షణము మాత్రమేలేదు. కిరియక్కర విషయమట్లుండగా, దొరెయక్కర పద్య స్వరూపము అక్కరలపద్ధతికి పూర్తిగా భిన్నము. అయిదువిధముల అక్కరలలో గమనించవలసిన మరొక అంశ మేమనగా, పిరియక్కరలో, నడువణక్కరలో 3, ఎడఅక్కరలో 2 విష్ణుగణములున్నవి. కాగా పిరియక్కర—నడువకొక్కరలమధ్య 4 విష్ణుగణములతో నుండవలసిన ఒక అక్కరభేదము కన్పించదు. మధ్యాక్కరలో నాల్గు విష్ణుగణములున్నవి. కాని, వాటిమధ్యలో ఒక సూర్యగణముకూడ ఉన్నది. ఇట్లు ఒకేవిధమయిన గణములమధ్య తద్భిన్నగణములుచేరుట అక్కరలపద్ధతికి విరుద్ధమయినవి. ఒక్క పిరియక్కరలోమాత్రము రెండవ, లేదా నాల్గవగణము బ్రహ్మగణముకావచ్చు. అప్పుడు నియతముగా పాదాదిబ్రహ్మగణము విష్ణు గణమగును. అయితే ఇది పాక్షికాంశమే తప్ప నియతము కాదు. మరియు దీనికి ఎక్కువ ప్రచారము కూడలేదు. అందువలన, దొరెయక్కరస్థానమున 1 బ+4 వి+1 రు అనుగణక్రమముగల ఒక్క అక్కరభేదముండవలసినది. అట్టి భేదము మృగ్యము.

ఇక, దొరెయక్కరలో అక్కరల లక్షణముకన్న ఛందోవతంస (ద్విపద) లక్షణమెక్కువగా కన్పించును. ఛందోవతంస రెండుపాదాలు కలిసి దొరెయక్కర యొక్క ఒక పాదమగును. అయితే, ప్రతిపాదము నుంచి ఒక్కొక్క విష్ణుగణము తగ్గును. ఛందోవతంస గణక్రమము 3 వి + 1 బ అవి. దొరె యక్కర గణక్రమము 2 వి+1 బ 2 వి+1 బఅవి. ఈదృష్టితో చూచినచో దొరెయక్కర పాదపూర్వోత్తరార్ధములు కచ్చితముగా నడిమికి విరుగుట సహజమే. తరువోజ పాదమట్లేకదా విరుగును. కాగా అక్కడ విష్ణుగణములు తగ్గుటయన్నదిలేదు. ఇక్కడ ఉన్నది ఈ రెండింటిలో ఇదే భేదము (తరువోజ) ద్విపద లేదా ఛందోవతంసయొక్క రెండు పాదము లొకపాదముగా ఏర్పడినదన్నది ఇక్కడ గుర్తుంచుకొనవలసియుండును.)

మరి, కిరియక్కర విషయము చూచినచో, నాగవర్మ చెప్పిన 'చౌపది'కి ఒక విష్ణుగణము మొదట అదనముగా చేరినచో ఏర్పడినట్లు కన్పించును. ('చౌపద'కు 1 వి+1 రు. గణము లుండును.) అప్పుడు కిరియక్కర అక్కరలలో చేరని పద్యమైనా కావలసియుండును. లేదా, ఆ 'చౌపది' గూడా అక్కరలలో చేరవలసియైన నుండును. కిరియక్కరకు పాదాదిన బ్రహ్మగణము లేకపోవుటచే, అది అక్కర వర్గములో చేరకుండుటయే సహజము. దాని స్థానములో 1 బ+2 వి+1 రు. గణక్రమముతో నొక అక్కర భేద ముండవలయును. మరొకటి. విష్ణుగణముల సంఖ్య అక్కరలలో పిరియక్కరనుండి క్రమముగా తగ్గుచు వచ్చిన దృష్ట్యా, 1 బ+1 వి+1 రు. అన్న గణ క్రమముతో గూడ ఒక అక్కర భేద ముండవలసి యుండును. కాని ఈ విధమైన నేవియు లేవు. ఏ దెట్లున్నను, దొరెయక్కరను, కిరియక్కరను అక్కర వర్గములో చేర్పక, అక్కరలు మూడు విధములే యనుట సమంజస మనిపించును.[8]

5

త్రిమూర్తి గణ బద్ధమయిన ఛందోవతంస

---

8. అయిదు విధముల అక్కరల గణ క్రమ మిది :

1. పిరియక్కర 1 బ+5+1 రు.
2. దొరెయక్కర 2 వి+1 బ+2 వి+1 రు
3. నడువణక్కర 1 బ+3 వి+1 రు.
4. ఎడెయక్కర 1 బ+2 వి+1 రు.
5. కిరియక్కర 2 వి+1 రు.

తెలుగులో పై వాటికి పేర్లలోతప్ప లక్షణములో భేదమేమియు లేదు.

5

క్రమముగా మాత్రా సంఖ్యాగణ బద్ధముగా మార్పు నందిన యంశ మింతకుముందే ప్రస్తావింపబడినది. ఈ మార్పు నొందిన రూపమునకు 'చౌపద' యని పేరు. 3 పంచమాత్రా గణములు + 1 త్రిమాత్రా గణము ప్రతిపాదమున దీని కుండును. ఇది తెలుగులో కర్ణాటక చతుష్పద. అనంతుడీ కర్ణాటక చతుష్పదను చెప్పలేదు కాని, స్వభావములో దీనివంటి దానినే 'చౌపద' యను పేర చెప్పినాడు. ఈ తెలుగు 'చౌపద'లో మూడు చతుర్మాత్రా గణములు+ఒక త్రిమాత్రా గణము ప్రతిపాదన నుండును. విష్ణు (ఇంద్ర) గణములలో చతుర్మాత్రా, పంచమాత్రా గణములు ఉండనే యున్నవి. కాబట్టి ఈ రెండు 'చౌపద'లు కూడా ఛందోవతంస లేదా తెలుగు ద్విపద అగును. కాని విష్ణు (ఇంద్ర) గణములను పేర్కొనక కేవలము మాత్రా సంఖ్యాగణములతోనే లక్షణము చెప్పటవలన విష్ణు (ఇంద్ర) గణములు కానట్టి గగ—స అను చతుర్మాత్రా గణములను, భల—నలల అను పంచమాత్రాగణములను గూడ పై చౌపదలలో ప్రయోగించు అవకాశము కలిగినది. త్రిమూర్తి (సూర్యాది) గణపద్ధతిలో లక్షణము చెప్పినచో ఈ వీలుండెడిది కాదు. కొన్నికొన్ని సందర్భములలో త్రిమూర్తి (సూర్యాది) గణములు పనికిరావన్నది లాక్షణికులు గ్రహింపకపోలేదు. పై చౌపదలవంటి చోట్లనే గాక, రగడల విషయములో గూడ లాక్షణికులు త్రిమూర్తి (సూర్యాది) గణములను త్రోసిరాజని, మాత్రాసంఖ్యాగణ పద్ధతిలోనే అటు నాగవర్మ, ఇటు అనంతాదులు లక్షణము చెప్పినారు.

తెలుగులో భీమన, విన్నకోట పెద్దనలు రగడలను చెప్పలేదు. కాని 'చౌపది'పేర 'మందానిల' (ఇది తెలుగులో 'మధురగతి') రగడను చెప్పినారు. ఈ చౌపదిలో నల-గగ—భ—స అన్న గణాలను మాత్రమే ఉపయోగించవలెనని, పాదమునకు నాల్గు గణము లుండునని వారు చెప్పిన లక్షణము. అయితే ఈ నాలుగు ఒకే మొత్తముగా త్రిమూర్తి (సూర్యాది) గణ వర్గములలో ఏయొక్కదానికిని చెందవు. (గగ—సగణములు బ్రహ్మ గణ వర్గీయములుకాగా, నల—భగణములు విష్ణుగణ వర్గీయములు.)[9] కాగా, భీమన పెద్దనలు గూడా సూర్యాది గణవర్గములను నిరాకరించి మాత్రాసంఖ్యా గణములతో రగడలను ప్రస్తావించినట్లే యగును.

నిజమునకు, కన్నడ—తెలుగుదేశి పద్యములకు త్రిమూర్తి, లేదా సూర్యాది గణవర్గాధారముగా లక్షణము చెప్పటకన్న, మాత్రాసంఖ్యాగణ వర్గాధారముగా లక్షణము చెప్పట సమంజసమనిపించును. రుద్ర (చంద్ర) గణములకు ఉభయభాషల దేశి పద్యము లందును అంతగా ప్రాధాన్యము లేదు. యెందుకనగా 16 రుద్రగణములలో 12 గణములు, నాల్గు లేక అయిదు మాత్రల గణములుగా విరిగి, ఆ పైన ఒక గురువో లేక ఒకటి రెండు లఘువులో మిగులును. రెండు గురువులు మిగిలినచో, ఆ రెండు గురువులు చతుర్మాత్రాగణమగును. మరొక విధముగా చూచినచో రుద్రగణములలో 5–6–7–8 మాత్రల గణము లున్నవి. పంచమాత్రాగణము లట్లుండగా, షణ్మాత్రా గణములు 3+3, 4+2, 2+ గా, సప్తమాత్రా గణములు 3+4, 4+3, 5+2, 2—5 గా, అష్టమాత్రా గణములు 4+4, 3+5, 5+3, ఇంకా మరికొన్ని విధములుగా విరుగును. అంతే తప్ప ఒకే మొత్తముగా ఉండవు. దీనికి కారణము ఉభయ భాషలయందును అయిదు మాత్రలకు మించిన పదములు దాదాపుగా లేకపోవుట, లేదా మిక్కిలి తక్కువగా నుండుటయే.

ఇక, బ్రహ్మ, విష్ణు (సూర్యేంద్ర) గణములలోగూడ భిన్నమాత్రా సంఖ్యాగణము లున్నవి. దీనికన్న, ఒకవిధమయిన మాత్రాసంఖ్యగల గణములన్నియు ఒక వర్గముగా రూపొందుట సమంజసము. అనగా, త్రిమాత్రాగణవర్గము, చతుర్మాత్రాగణవర్గము,

9. లగ—జ—య గణములు వరుసగా 3–4–5 మాత్రల గణములయినను విలోమగతిగలవి యగుటవలన లాక్షణికులు వీటిని స్వీకరించలేదేమో. కందమందు మాత్రము జగణము చతుర్మాత్రాగణముగా అంగీకృతమైనది.

పంచమాత్రాగణవర్గము అని గణవర్గము లేర్పడవలసి యుండును. రగడాదుల విషయములో ఈ విధముల్నైన గణవర్గములే ఉపయోగపడును. ఇక్కడ 'మనించ వలసిన మరొక విషయ మేమనగా, కన్నడమందు త్రిపద, షట్పదాదులన్నియు క్రమముగా మాత్రా సంఖ్యాగణ బద్ధములుగా మారిపోయినవి.[10] ఛందోవతంస చౌపదిగా మారుట దీనికొక నిదర్శనము. తెలుగులో ద్విపదకు పట్టుగొమ్మయిన పాల్కురికి సోమనాథుడు ద్విపదలక్షణమును సూచించుచు 'అనియత గణైః యతిర్వ్యాప్రాసోవా' అని పేర్కొనినాడు. ఈ లక్షణ మేగ్రంథములోనిదో ఇప్పటికిని గుర్తుపట్ట బడలేదు. కాగా, 'అనియతగణము' అనగానేమి ? నాగవర్మ కన్నడమున రగడల విషయములో 'గణ నియమ, విపర్యాస' మని చెప్పినది. ఈ 'అనియత గణ' మన్నది ఒకటే యనిపించును. ఈ సందర్భము లందు వీరిద్దరును, త్రిమూర్తి (సూర్యాది) గణము లనుగాక మాత్రాసంఖ్యాగణములనే ఉద్దేశించినట్లు కన్పించును.

ఇదిట్లుండగా, ఛందోవతంస లేక ద్విపద ఒక రగడ భేదముగా కన్పించును. వీటి భేదములయిన చౌపదలను చూచినచో, పంచమాత్రా సంఖ్యాగణ బద్ధమయిన చౌపద (కర్ణాటక చతుష్పద) 'లలిత' (తెలుగులో 'ద్విరదగతి') రగడ అనియు, చతుర్మాత్రా సంఖ్యాగణ బద్ధమయిన తెలుగు చౌపద మందానిల (మధురగతి) రగడ అనియు చెప్పవచ్చును. అయితే, మొదటివానిలో రెండు, రెండవదానిలో ఒక మాత్ర తగ్గును. దీనికి కారణము పాదాంతమున త్రిమాత్రా గణముండుటయే. ఉదాహరణకు సోమనాథుని ఒక ద్విపద:—

'నరలోక—మునను మా—నాథమీ—భక్తి
చరితమే—మియు—నన్, వి—స్పష్టం—బు—గాదు'

ఇందలి మాత్రాగణములనుబట్టి యిది కర్ణాటక చతుష్పద యగును. ఇందులో మూడు పంచమాత్రా గణములు+ఒక త్రిమాత్రాగణము ఉన్నవి. పాదాంత మందలి త్రిమాత్రాగణములకు (భక్తి, గాదు) రెండు మాత్రలధికముగా చేరినచో (భక్తిగా, గాదుగా) ఇది అచ్చముగా లలిత (ద్విరదగతి) రగడ యగుచున్నది.

ఇట్లే సోమనాథునిదేయగు మరొక ద్విపదయు ఉదాహరణగా చూడవచ్చును:—

'సన్నుతి—సేయుచు—నత్కవు—లలర
తిన్నని—సూక్తుల—ద్విపద ర—చింతు'

ఈ ద్విపదలోని మాత్రా సంఖ్యాగణముల ననుసరించి తెలుగు 'చౌపద' యగును. ఇందులో మూడు చతుర్మాత్రా గణములు+ఒక త్రిమాత్రాగణము ఉన్నది. పాదాంతములందలి త్రిమాత్రాగణములకు (అలర, ర, చింతు) అదనముగా ఒక మాత్ర చేరినచో (అలరన్, ర,చింతున్) ఇది అచ్చముగా మందానిల (మధురగతి) రగడ యగును. ఈ మాత్రల హెచ్చింపులు—ఒకప్పుడు తగ్గింపులు కూడా— జానపద గీతముల ప్రభావమువలన జరిగియుండు ననిపించును.

6

నిజమునకు మన దేశీయ పద్యము లన్నియు జానపదుల గీతములనుండి రూపొందినవే. జానపద గీతములకు పదస్వరూపముతోకన్న లయతో పని. ఒక పదము త్రిమాత్రకముగా నున్నను లయ ననుసరించి, దీర్ఘీకరింపబడి, చతుర్మాత్రాకముగా, పంచమాత్రాకముగా కూడ భాసింపజేయబడును. అట్లే ఒక పదము పంచమాత్రకముగా నున్నను లయ ననుసరించి కుదింపబడి, చతుర్మాత్రాకముగా, త్రిమాత్రాకముగా కూడ భాసింపజేయబడును. జానపద గీతములలో సామాన్యముగా పాదాంతములందు ఒకటి రెండు మాత్రలు తగ్గియుండును. ఈ తగ్గుదల లయ ప్రస్తారమునకు ఆనుకూల్యము కలిగించును. ఉదాహరణమున కొకటి :

'తులసి—ఇంట—నుంచు—వార్ని
తులసి—పూజ—చేయు—వార్ని
తులసి—యందు—భక్తి—యుంచి—మెలగు—
వారి—నీ'

ఇది స్త్రీల పాటలలోని ఒక భాగము. కన్నడములోని షట్పదీ భేదముల ననుసరించి చెప్పినచో 'భోగ

10. తెలుగు సాహిత్యములో ఈ విధమయిన పరిణామము జరుగకుండుట గమనించదగిన యంశము. ఇది విడిగా పరిశీలించవలసిన విషయము.

షట్పది' యొక్క సగ భాగము. ఇక్కడ మొదటి రెండు పాదముల చివర 'వారిని' యని యుండవలసిన పదము 'వార్ని' అని క్షప్తీకరించబడినది. మూడవ పాదము చివర 'వారిని'లోని 'ని' దీర్ఘీకరింపబడి త్రిమాత్రాకముగా పలుకబడును. నాలుగు త్రిమాత్రా గణములు పై మొదటి రెండు పాదములకు పద స్వరూపము దృష్ట్యా లక్షణము చెప్పినచో మూడు త్రిమాత్రాగణములు + ఒక చతుర్మాత్రా గణము అని చెప్పవలసి యుండును. ఎందుకనగా, 'వార్ని' యన్నది లాక్షణికముగా సరియైన రూపము కాదు. 'వారిని' అన్నది సరియైన రూపము. అప్పుడు అది చతుర్మాత్రా గణమగును. ఈ విధముగా చూచినచో, జానపద గీతములను పదస్వరూపములను లాక్షణికముగా సంస్కరించుటతో, శిష్టకావ్యము లందు, లక్షణగ్రంథములందును భిన్నమాత్రా సంఖ్యా గణములుగల పాదములు రూపొందియుండినట్లు కన్పించును. ఉదాహరణకు—

'రంగన—ల్లులనారు—రాణింప—జేయు
తోరణా—పంక్తులా—తులకింప—జేయు'

ఇది పంచమాత్రా గణములతో సాగిన రచన. పాదాంతములందు రెండు మాత్రలు తగ్గినవి. ఆ తగ్గిన మాత్రాసంఖ్య, చివరి 'యు'కారమును దీర్ఘీకరించుటతో భర్తీ చేయబడును. ఇదిట్లా ఉండగా, రెండవ పాదములోని 'తోరణా— పంక్తులా' అన్నది లాక్షణికముగా తప్పు. 'తోరణ—పంక్తుల' యని యుండవలయును. అప్పుడవి పంచమాత్రా గణములకు బదులు చతుర్మాత్రా గణములగును. 'తులకింప' పంచమాత్రా గణము. 'చేయు' త్రిమాత్రాగణము. ఇప్పుడు ఒకే పాదములో నాల్గు—అయిదు—మూడు మాత్రాసంఖ్యగల గణము లేర్పడినవి. ఈ విధముగా జానపద గీతములను సంస్కరించుటలో ఏర్పడు చిక్కులను తొలగించుకొనుటకే త్రిమూర్తి లేదా సూర్యాది గణవర్గములలో భిన్నమాత్రా సంఖ్యాగణములను అంగీకరించవలసి వచ్చినట్లు కన్పించును. రెండు—మూడు—నాల్గు గురువులను ప్రస్తరించుటవలన ఏర్పడిన గణములు కాబట్టి, ప్రతి గణవర్గమందును భిన్నమాత్రా సంఖ్యాగణములు ఏర్పడినవనుటలో పెద్దగా సామంజస్యము కన్పించదు. ఎవరునుగూడ గణములను ప్రస్తరించుకొని పద్యములు రచించరు. రచన తరువాత లక్షణము సులభముగా చెప్పకొనుటకు కొన్ని పద్ధతులు రూపొందించబడును. దేశీయ పద్యములకొరకు రెండు మూడు—నాల్గు గురువులను ప్రస్తరించుటయను పద్ధతియు నట్లు రూపొందినదే. అట్లు కాకపోయినచో, ఈ ప్రస్తారమువలన ఏర్పడిన గణములలో లఘ్వాది గణముల పబందు అదనముగా మరొక లఘువు చేర్చవలెనను నియమము ఏర్పడవలసిన యవసరములేదు. ఈ నియమము పైన చెప్పబడిన చిక్కులను తొలగించుకొనుటలో కొంత సహాయకారి యగును. ఈ అదనముగా చేర్చుటవలన ఆయా గణవర్గములలోని గణముల మాత్రాసంఖ్యను కొంతలో కొంత సరిచేయుటకు ఉపయోగపడును. ఈ విధముగా ఈ త్రిమూర్తి (సూర్యాది) గణవర్గములు అసహజము లగుటవలననే, ఈ గణవర్గముల దృష్ట్యా చెప్పబడిన అనేక పద్యములు మాత్రాసంఖ్యా గణ బద్ధములుగా పరిణమించుట కన్నడములో కన్పించుచునే యున్నది. అందువలన రగడల పద్ధతిలో మాత్రాసంఖ్యాగణాలు దేశి పద్యాలకు సహజమైనవని చెప్పవచ్చు.

రగడలు ప్రాకృత ప్రభావమువలన కన్నడము లోనికి, తెలుగులోనికి వచ్చినవనుకొన నక్కరలేదు. ప్రాకృతములోని 'పజ్ఝటిక' తెలుగు, కన్నడములలోని మధురగతి లేదా మందానిల రగడలకు సమాన మనిపించవచ్చు. కాని ఉభయభాషా దేశి పద్యములయందును ఇంద్ర లేక విష్ణుగణములకే ప్రాధాన్యము. ఇంద్ర (విష్ణు) గణములలో పంచమాత్రాగణములే ఎక్కువ. అవి కన్నడమందలి లలిత లేక తెలుగులోని ద్విరదగతి రగడల లయకు చెందినవి. నిజమునకు లయాత్మకముగా రచన సాగు ప్రతిచోట మాత్రా సంఖ్యాగణరీతి ఉండనే యుండును. అందువలన రగడ దేశీయము కాదేమోననుకోవలసిన యవసరము లేదు. కాగా, రగడల పద్ధతి ననుసరించి మూడు—నాల్గు—ఐదు మాత్రా సంఖ్యాగణ వర్గములను స్వీకరించుట సమంజసమగును. (ద్విమాత్రాగణవర్గ మొకటి యుండుటకూడ కొన్ని సందర్భములలో పనికి రావచ్చును.) వీటి సమ్మేళనముతో మిశ్రలయ సాధింపవచ్చును. మూడు— నాల్గు — ఐదుమాత్రా సంఖ్యా గణములుండుటయనగా, త్ర్యస్య, చతురస్ర, ఖండ,

మిశ్రగతులను అనుసరించుట. వీటిని బట్టియే తెలుగులో వరుసగా హయప్రచార, మధురగతి, ద్విరదగతి, వృషభగతియని నాల్గువిధముల రగడలు ఏర్పడినవి. కన్నడములో ఉత్సాహ (ఉత్సవ), మందానిల, లలిత అన్నపేర్లతో మొదటి మూడు గతులలోనే రగడలు చెప్పబడినవి. అయినను షట్పద భేదములలో మిశ్ర గతి కన్పించును. ఏదెట్లున్నను, కొద్ది మార్పులతో దేశి పద్యములు దాదాపుగా నన్నియు రగడ భేదముల లోనే అంతర్భవించుచున్నది మాత్రము గమనించవలసిన యంశము. అందువలన. వాటికి ఉపయోగించు గణముల పద్ధతిలోనే మిగిలిన పద్యములకును లక్షణము చెప్పుట సమంజసము.

7

అయితే, ఇప్పుడు ఒక ప్రశ్న ఉత్పన్నమగును. త్రిమూర్తి లేక సూర్యాది గణవర్గములను నిరాకరించి మూడు, నాల్గు, అయిదు మాత్రా సంఖ్యాగణవర్గములను స్వీకరించినచో, శతాబ్దాంతరబడిగా త్రిమూర్తి (సూర్యాది) గణబద్ధమై సాగిపోవచ్చుచున్న దేశిపద్యముల లక్షణములు చెప్పుట—ఎట్లు కుదురును? ఈ సమస్యను ఒక విధముగా పరిష్కరించుకొనవచ్చును. లక్షణ గ్రంథములలో చెప్పబడిన, ప్రతిపద్యము ఇప్పటి వలె ఒక రూపములోనేకాక మూడు రూపములలో నుండును. ఉదాహరణమునకు సీసపద్యమును చూడవచ్చు. సీసమునకు సూర్యాది గణపద్ధతి ప్రకారము ప్రతిపాదమున వరుసగా ఆరు ఇంద్రగణములు + రెండు సూర్యగణములు. (రేనా ఆరు నలనామకగణములు + 3 నగణములు) దీనివలన సీసము ఈ క్రింద చెప్పబడినట్లు మూడు విధములుగా నుండును.

1. ప్రతిపాదమునకు వరుసగా ఆరు పంచమాత్రా గణములు + రెండు త్రిమాత్రా గణములు.
ఉదా :—

'కాలకం—ఠ కఠోర—కంఠహుం—కారంబు
చెవులసో—కనినాటి—చిత్త—భవుడు.'

2. ప్రతిపాదమునకు వరుసగా ఆరు చతుర్మాత్రా గణములు + రెండు త్రిమాత్రా గణములు.
ఉదా :—

3. ప్రతిపాదమునకు పంచమాత్రా, చతుర్మాత్రా గణములు కలగలపుగా మొత్తమారు + రెండు త్రిమాత్రా గణములు. ఉదా :—

'కమలాక్షు—నర్చించు—కరములు—కరములు
శ్రీనాథు—వర్ణించు—జిహ్వ—జిహ్వ.'

మొదటి విధము కన్నడమందు ప్రసిద్ధము. మూడవవిధము తెలుగున ప్రసిద్ధము. కాగా పద్ధతి ప్రకారము రెండవ విధమునకు ప్రయోగము ఒక విధముగా మృగ్యమే. ఇక్కడ గమనించవలసిన మరొక యంశమేమనగా, సర్వలఘు సీసమును సీసభేదమునకు లక్షణము చెప్పుచు లాక్షణికులు ఇంద్రగణములకు బదులు 'పంచ లఘుగణము'లను ప్రయోగించవలయునని నిష్కర్షించినారు. అనుబంధింపబడు గీతమున నీ నియమము లేకున్నను, భాగవతమున (దశమ. పూ. 72) సర్వలఘుసీసపు గీతము సర్వలఘువుగా నున్నది. అయితే అందలి ఇంద్రగణ స్థానమున చతుర్లఘుగణము లుపయోగింపబడినవి. కాని కూచిమంచి తిమ్మకవి రాజశేఖర విలాసములో పంచ లఘుగణముల నుపయోగించినారు. మొత్తముమీద సీసమునకు లాక్షణికులు కనీస మొకభేదమందయినను సూర్యాదిగణముల కాదని, మాత్రా సంఖ్యాగణములను స్వీకరించుట గమనించవలసిన యంశము. ఇటే ద్విపద విషయములో కర్ణాట చతుష్పదపై మూడు విధము లలో మొదటిదై, (అనంతాదుల) చౌపద రెండవ విధమై, ద్విపద మూడవవిధమై యున్నది. కాగా ద్విపదకుపై మూడుభేదములను లాక్షణికులు లంగీకరించినట్లే అదేపద్ధతిని మిగిలిన పద్యములకును ఏర్తింప జేసి లక్షణమును చెప్పుటతో ఉత్పన్నమగు సమస్యను పరిష్కరించుకొనవచ్చును. అయితే, ఇట్టి మూడు విధములకు ప్రాచీన సాహిత్యమున అన్ని పద్యముల విషయమున ఉదాహరణములు విరివిగాగాని, అసలేగాని దొరుకకపోవచ్చును. కాని అట్టి భేదములు లాక్షణిక విరుద్ధములు మాత్రము కావు. కాగా మూడవ విధమందు భిన్నమాత్రా సంఖ్యాగణ సమ్మేళనమున స్పష్టము కాకుండ గుప్తముగానున్న లయ ఒకటి, రెండు భేదములందు స్పష్టముగా నుండును.

8

కన్నడ విషయికమునకన్న, తెలుగు విషయములో ప్రత్యేకముగా గమనింపవలసిన యంశములు ప్రాస, యతి. సంస్కృతమునుండి స్వీకరించిన వృత్తముల విషయములో ఆదిప్రాస ఉభయత్ర సమానమే. కాని, సంస్కృత వృత్తములతోబాటు దేశి పద్యము

అన్నింటికిని కన్నడమున ఆదిప్రాస నియతముకాగా, తెలుగున అనియతము. తెలుగు దేశి పద్యములలో కొన్నిటికి ఆదిప్రాస నియతము, మరికొన్నింటికి కాదు. ఈ భేదము ననుసరించి తెలుగులో ఉపజాతిభేద మేర్పడినది. ఆదిప్రాస నియతమైన దేశి పద్యములు 'జాతి' విభాగమునకు చెందగా, ఆది లేని దేశి పద్యములు 'ఉపజాతి' విభాగమునకు చెందినవి. కన్నడమున ఆదిప్రాస అన్నిదేశి పద్యములకుండుటచే అన్ని పద్యములును 'జాతి' విభాగమే. 'ఉపజాతి' విభాగము లేదు. మరి తెలుగులో ఈ విభాగము ఎందు కేర్పడినదన్నదొక ప్రశ్న. కన్నడంద్వారా తెలుగుకు సంక్రమించిన వని పించు పద్యము లన్నింటికిని ఆదిప్రాస, కన్నడ పద్ధతిలో నియతముగా తెలుగున పాటించినట్లు కన్పించును. అక్కర మొదలగునవిట్టివి అక్కడ వాటికి జాతులనిపేరు కావున, ఇక్కడ గూడ ఆదే పేరు స్వీకరింపబడినది. తెలుగుకు సహజమయిన సీసాదులకు ఆది ప్రాస నియతము చేయబడలేదు. అందుకని ఇవి ఉపజాతు లయినవి. కాగా ఉపజాతులన్నియు తెలుగుకు మౌలికమయిన పద్యములని చెప్పవచ్చును.

మరి, ద్విపద, రగడలకు గూడ ఆదిప్రాస నియతముగా తెలుగున చెప్పబడి 'జాతి' వర్గమున చేర్చబడినవి. కాగా ఇవియు కన్నడమునుండియే తెలుగునకు సంక్రమించినవనవలసివచ్చును. కాని, విచారించినచో ఈ రెండును తెలుగునకే సహజమయినవని చెప్పవలసియుండును. ఎందుకనగా, ద్విపద రెండు రూపములుగా నున్నది. ఆదిప్రాసనియతరూప మొకటి. దీనిని ద్విపద యందురు. నియతముకాని రూపమొకటి. దీనిని మంజరీ ద్విపద యందురు. కాగా ద్విపదయేమో జాతివర్గమునది మంజరీద్విపదఉపజాతివర్గమునది కావలసివచ్చును. ఇట్లగుట సరియైన పద్ధతికాదు. ఏదో ఒక వర్గమునకు చెందుట సమంజసము. లాక్షణికులు మంజరీ ద్విపదను ద్విపద భేదముగాచేసి, రెంటిని జాతి వర్గీయములుగా భావించినట్లున్నారు. కాని తెలుగులో ప్రచురములయిన దేశిపద్యముల స్వభావమునుబట్టి చూచినచో ఆదిప్రాస నియతముకాక పోవుటయే సహజము. ఇక్కడ నొక యంశము. ఆదిప్రాస నియతిలేని ఆట వెలదికి ఆదిప్రాస కూర్చినచో అది 'పవడగీతి' యగును. సీస భేదములలో 'వృత్తప్రాససీస' మొకటి. ఆ పవడగీతిగాని, ఈ వృత్త ప్రాససీసముగాని, తెలుగులో ఏదో చమత్కారము కొరకు మాత్రమే ఎక్కడో ఒక చోట ప్రయుక్తములుతప్ప, వాటికి విరివితనము లేదు. కాగా, వీటిలో ఆది ప్రాసలేని రూపమే ప్రాచీనము. అదే రీతిలో, ఆది ప్రాసలేని మంజరీ ద్విపదయే ప్రాచీనము. ఉన్నద్విపద అర్వాచీనము. అయితే, పవడగీతివంటి వాటివలెకాక, తెలుగున ఆదిప్రాసగల ద్విపదకే ప్రచుర ప్రయోగము. అందువలన లాక్షణికులు ద్విపదనే ప్రథానీకరించినట్లున్నది. కాని ద్విపద కాదిప్రాస కల్పించినవాడు పాల్కురికి సోమనాథుడు. 'పద్యోదాత్తకృతుల'తో ద్విపద కృతులను సమానము చేయవలయునన్న ధోరణిలో ద్విపదకాదిప్రాసను కల్పించినాడు. అందుకనియే ఆదిప్రాసనియతి దప్పకుండగ ద్విపదలు రచియింతునని ప్రత్యేకముగా చెప్పుకొనినాడు.'[11] ఈ విధముగా ఆదిప్రాసలేని (మంజరీ) ద్విపదయే తెలుగునకు సహజము. ఈ సహజత్వము దృష్ట్యానే 'పల్నాటి వీరచరిత్ర' రచింపబడినది. కాగా మంజరీ ద్విపదయే తెలుగునకు విశిష్ట మయినది.

రగడల విషయముగూడ ఒక విధముగా నింతే. ద్విపదనువలె రగడనుగూడ ప్రచారమునకు తెచ్చినది సోమనాథుడే. ద్విపదవలె రగడయు రెండు పాదములదే. దానికివలె దీనికిని ఆదిప్రాస కల్పించినాడు. గమనించవలసిన యంశమేమనగా, రెండు పాదములే ఒక మొత్తముగా నుండుట యన్నది జానపద గీతము

---

11. జాతులుమాత్రాను సంధాన గణ వినీతులుగాన యనియత వైర, నియు బ్రాసోవా యనియు యతిర్వాయను, నియుజెప్ప ఛందోవిని హితోక్తిగాన ప్రాసమైనను యతిపై వడియైన, దేసిగా నిలిపి, యాదిప్రాసనియతి, దప్పకుండగ ద్విపదలు రచియింతు...' (పండితా. దీక్షా.) అన్నచోట 'ఛందోవిని హితోక్తి' ప్రాసోవా, యతిర్వా అన్నంతవరకే. ప్రాసయుతిగాని, సమాపాక్షరయతిగాని అని ఉద్దేశ్యము. అందుకనియే, 'ప్రాసమైనను యతిపై, వడియైన... నిలిపి' అని అక్కడికి ఆపి మరల (ఆదిప్రాస తప్పక నిలుపుదునని సోమనాథుడు చెప్పినాడు. ద్విపదకు ప్రాసోవా, యతిర్వాయని చెప్పిన ఛందో గ్రంథముండు (అది ఏదో తెలియదు) ఆదిప్రాస విధింపబడలేదని స్పష్టము. కాగా, ఈ ఆదిప్రాస సోమనాథుడు కల్పించినది. అందుకనియే ప్రత్యేకముగా చెప్పినాడు.

లందు మిక్కిలి విరివిగా కన్పించురీతి. అక్కడ ఆదిప్రాస అనియతము. రగడలు జానపద గీతములనుండి నేరుగా గ్రహింపబడినవి. ద్విపదలు కొద్ది మార్పుతో రగడలనుండి రూపొందినవి. అయితే, మంజరీ ద్విపదకున్న ప్రచారము ఆది ప్రాసలేని రగడలకులేదు. రగడలు కావ్యములందు అరుదుగా, ఒక చమత్కారముగా మాత్రమే ఉపయుక్తములు, ఆదిప్రాసగల రగడలు సోమనవి కన్పించుచుండగా, ఆదిప్రాస నియతిలేని రగడలకు ప్రచారము లేకపోవుటచే లాక్షణికులు రగడలను జాతివర్గములో చేర్చినారు కాని అదియు ఉపజాతి వర్గమునకు చెందినదే. ఈ విధముగా ద్విపద, రగడలు తెచ్చుకొన్న పద్యములు గాక తెలుగునకు సహజమైనవే, సీసగీతములవలె.

తెలుగునకు సహజమయిన దేశి పద్యములకు ఆదిప్రాస నియతముకాదు కావున, యతిస్థానమున ప్రాసయతి విరివిగా ప్రయుక్తమైనది. ద్విపద, రగడలందును ప్రాసయతికి లక్ష్యములెన్నో కన్పించును. కన్నడమున ఆదిప్రాసలేని పద్యములేదు కావున, ప్రాసయతియన్న ప్రశ్నయేలేదు. ఆదిప్రాసయు, ప్రాసయతియు రెండు నుండుట క్లిష్టత కలిగించునని యేమో, ఒకదానిని ఒప్పినచోట, మరొకదానిని లాక్షణికు లంగీకరించనట్లున్నది.

ప్రాస విషయ మిట్లుండగా, యతి తెలుగునకే ప్రత్యేకమయినది. తెలుగులో యతిలేని పద్యమేదియు లేదు. భీమనాదులు కన్నడము ననుసరించి యతి విధించని ఎత్తుగతి, త్రిపద మొదలగు వాటికి గూడ అనంతాదులు యతిని విధించినారు. తెలుగులోని యతి కన్నడమందువలె విరామ రూపమైనది కాదు. పాద మధ్యమందు ఏదో ఒక నియయత స్థానమున తత్పాదాద్యక్షరము పునరుపయుక్తమగుట తెలుగుయతి. కాగా ఇది సరూపాక్షరయతి. ఈ విధమైనయతి కన్నడమున లేదుగాని, 16 వ శతాబ్దము నాటికి తెలుగు ప్రభావమువలన కొంత కొంత కన్నడమున ప్రవేశించినది. ఈశ్వరకవి తాను సరూపాక్షరయతిని పాటించుటయేకాక, 'సరస' మొదలగు కొన్ని తెలుగు యతిభేదములను పేర్కొన్నాడు గూడ. కనకదాసు గూడ ప్రాసయతులతో పద్యములు రచించినాడట.

పాదాంత విరామము తెలుగు కన్నడములందు చెప్పబడలేదు. పాదాంతమున పదము విరుగుట పాదస్వరూపమును, లయను రక్షించును. కాని, ఆది ప్రాస హేతువుగా పాదాంత విరామము నియతము చేయబడలేదనిపించును. ఆదిప్రాసను రక్షించుటకు పూర్వపాదమునుండి పదమును కొంత తెచ్చుకోవలసిన యవసరము పలుచోట్ల కన్పించును. అందుకనియే తెలుగున ఆదిప్రాసగల పద్యములందు తొంబదివంతులు పాదాంత విరామ ముల్లంఘింపబడగా, ఆదిప్రాసలేని ఉపజాతు లందు పాదాంత విరామము తొంబదియైదు వంతులు పాటింపబడుట గమనించవచ్చును.

అయితే, ఈ సరూపాక్షరయతి, ప్రాసయతి, ఆదిప్రాసలు ఈ భాషలకు సహజములా? కావా? అన్నదియు నొక ప్రశ్న. అతి ప్రాచీనత కలవనుకొనబడు సామెతలలో, జానపద గీతములలో ఇవన్నియు సహజరీతిలో నున్నవి. అయితే, అక్కడ నియతములు కావనిపించుచు. తప్పిన తావులు చాలానే యున్నవి. కాగా అమరిన పలుతావులలోని సహజత్వము ననుసరించి శిష్ట రచనలయందివి నియతము చేయబడినవి. ఐచ్ఛికత లేదనితప్ప, ఇవి అసహజములు మాత్రము కాదు. తెలుగుదేశి పద్యములందు ఒక విధముగా ఇవి ఐచ్ఛికములే. సరూపాక్షరయతిగాని, ప్రాసయతిగాని ఉపయోగించవచ్చుననుటలో, ఆదిప్రాసను నియతము చేయకపోవుటలో ఐచ్ఛికతయే కనిపించును. సంస్కృతమునుండి తెచ్చుకొబడిన వృత్తములందు వీటిని నియతము చేయుట, సంస్కృత పదములను తత్సమములు చేయునప్పుడు తెలుగు ప్రత్యయములను చేర్చినట్లే యనుకొనవలెను. మరియు వందలేండ్లనుండి పాటింపబడి ఇవి పుట్టులక్షణములే అయినవి. కాగా ఆదిప్రాస విషయమున కన్నడముకన్న తెలుగు తన దేశి పద్యములందు దేశీయతా రీతిని అవలంబించినది. యతి, ప్రాసయతి విషయమున ఐచ్ఛికతను విస్తృత పరచినది.

ఈ విధముగా తెలుగు—కన్నడ ఛందస్సులను—వాటి సామ్యవైషమ్యములను గూర్చి, సహజత్వమును గూర్చి పరిశీలించవలసిన యంశము లిక్కడ కొన్ని చర్చింపబడినవి.[12] ఇంకను విజ్ఞులు పరిశీలించవలెనని మనవి.

---

12. ఈ వ్యాసమందు ప్రస్తావించబడిన కన్నడ ఛందస్సుకు సంబంధించిన అంశములకు ప్రధానాధారము శ్రీ డి. ఎస్. కర్కిగారి 'కన్నడ ఛందోవికాస'.

కలగూరగంప

సాహిత్య రసికత

"చదువది యెంత కల్గిన రసజ్ఞతయించుక చాలకున్ననా
చదువు నిరర్థకంబు, గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్
పదనగుమంచికూర నలపాకముచేసిననైన, అందు నిం
పొదవెడుసుప్పులేక రుచిపుట్టగనేర్చునటయ్య భాస్కరా!

అన్న పద్యం "సాహిత్య రసికత" మీది వ్యాసం చూశాక గుర్తు వచ్చింది. 73 డిశంబరు భారతిలో పొట్లపల్లివారి, "సాహిత్య రసికత" అనే వ్యాసంలోని విషయాలన్నిటినీ సత్యాన్వేషణ బుద్ధితో శ్రీ టి. జి. కృష్ణారావుగారు పరామర్శించి వ్యాస ప్రయోజనం ఆ పరామర్శే అని స్వాభిప్రాయాన్ని నిష్కర్ష చేశారు. వారు తమ వ్యాస ప్రారంభంలో—

"ప్రతిఒక్కరూ పూర్వకాలంలోని గొప్పతనాన్ని ప్రస్తుత పరిస్థితుల్లోని లోపాలని ఉద్ఘోషిస్తూ వుంటారు. మారుతున్న కాలం ఒక తరం వార్ని వెనక్కి నెట్టేస్తూ వుంటే వాళ్ళు తమ తర్వాత తరంతో సమంగా అడుగు వెయ్యలేకపోతూవుంటారు. అలా ముందంజ వెయ్యగల వాళ్ళు కొద్దిమందే వుంటారు. వెనుకబడ్డవాళ్ళు గత స్మృతులని నెమరు వేసుకుంటూ వాటినే ఉన్నతమైన విలువగా భావిస్తూ గతంలో జీవిస్తుంటారు. నిజానికి ప్రాత కొత్తలకి సంఘర్షణ నిత్యం జరుగుతూ నిగ్గు తేలుతూ వుంటుంది. అటువంటప్పుడు పాతవన్నీ మేలైనవనీ ఈనాడు అవన్నీ నశించి పోయాయనీ విచారించడం అనుచిత మవుతుంది. సాహిత్యం గాని విమర్శనగాని అన్ని దేశ కాలాలలోను వుంటాయి. వాటికి క్షతి లేదు." అని ప్రస్తుత సాహిత్య స్వభావాన్ని గూర్చి చెప్పారు—

సాహిత్యానికి విలువ కట్టేటప్పుడు కొన్ని ప్రమాణాలు నిర్ణయించుకోవడం అవసరం. అయితే ఆ ప్రమాణాలు విశ్వజనీనమై వుండాలి. సంయమనాన్ని కోల్పోయి, ఏదో ప్రగతిలో పయనిస్తున్నామంటూ ఏదో సంస్కరణ అంటూ మనం వేసే అడుగు అఖాతంలో పడుతుందో, ముళ్ళబాటమీద పడుతోందో తెలుసుకోలేని అయోమయ స్థితిలో వున్నాం. ఈ మాట మనమే అనుకుంటే మనని మనం కించపరచుకుంటున్నామనో మనకి ఉదాత్త భావన లేదనో, కూపస్థ మండూకాలమనో, తెగడుతాం. మన యిప్పటి స్థితిగతుల్ని గూర్చి "ఇసాక్ తూబిన్ మన్" అనే అమెరికన్ విద్యార్థి ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వ్రాసిన వ్యాసం మనకి కొంతైనా కనువిప్పు కలిగిస్తే అదృష్టమే. గుణగ్రాహిత్వంకంటే దోషైకదృక్త్వమే మనలో ఎక్కువ. మనం వేసుకున్న సులోచనాలు, ఏ రంగులో వుంటే మనకిఅంతా అలానే కనబడుతుంది. జాతి జీవితాన్ని తీర్చి దిద్దడంలో సాహిత్య ప్రయోజనం ఎంతైనా వుంది. అట్టి కృషిలో ఇటీవల వెలువడిన సాహిత్యం ఎంత ప్రభావం చూపింది? భిన్న సంస్కృతులున్నా భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శించే ఉదాత్త సంస్కృతి ఏమైంది? వేదికల మీద ఉపన్యాసాలు దంచే ప్రబుద్ధుల ఆచరణలెలా వుంటున్నాయి? 'తాటాకుల మీద వ్రాసిరి పరాంగన గూడిన పాప మంచు' అన్నట్లు ఆచరణలో కనబడనవి ఎన్నో? ఇప్పుడున్న భారతదేశ స్వరూప స్వభావాన్ని గూర్చి పైన ఉదాహరించిన అమెరికన్ విద్యార్థి ఎంత ఆవేదన పొందాడో మచ్చుకి ఈ క్రింది భాగాలు పరిశీలించవచ్చు.

"ఎక్కడయితే మానవమేధస్సుచే 'ధర్మము—న్యాయము' సృజింప బడ్డాయో అక్కడే వాటికి సజీవ సమాధి కట్టబడుతోంది. పశ్చిమ దేశాల కుహనా సంస్కృతి అలవరచుకోవాలనే వేగిరపాటులో ధర్మాన్ని—న్యాయాన్ని సృజించిన ఈ జాతి, అది మరచి అవినీతి—అన్యాయాలకు ఆటపట్టవుతున్నది"

"నేను ఈ దేశానికి వస్తూ ఉన్నత హృదయులైన కలుషత్వాలకు తావులేని ప్రజల మధ్య జీవించబోతున్నందుకు యెంతో గర్వించాను. అప్పటినా భావాల్లో, ఈ దేశం అవినీతికి - మోసాలకు అతీతమైన దేశం. శారీరకమైన మరే విధమైన వాంఛలకు తావివ్వని వారీ దేశస్థులు అని నా ఉద్దేశం. కుట్రలతో, మోసాలతో, కుళ్ళిపోయిన ఈ ప్రపంచాన్ని ఉద్ధరించి - రక్షించి శరణు ఇచ్చేది ఈ దేశమని నా భావం. అందుకనే ఈ ప్రాచీనదేశ వేదాంత జీవనంలో మిళితమై, వీరిలో నేనూ ఒకడినై పోదామని ఇక్కడకు వచ్చాను".

"కానీ విచారించదగ్గ విషయమేమిటంటే— నాలాగా ఈదేశం గురించి విన్నో, చదివో, ఇక్కడి సభ్యతా సంస్కృతులను అధ్యయనం చేయాలని ఎవరైనా ఇక్కడకు వస్తే వారు తమ పవిత్రమైన కాలాన్ని వృధా చేసిన వారవుతారు. పశ్చిమదేశాల్లోనే ప్రాచీన భారతం యొక్క సభ్యతా సంస్కృతులు ఇక్కడకన్నా యెక్కువగా మనకు లభ్యమవుతాయి."

"ఇది నేను ఒకనాడు తీసుకున్న నిర్ణయం కాదు — నాలుగు సంవత్సరాలు ఈ దేశం నలుమూలలా చరించి, ప్రజల జీవన విధానాలని క్షుణ్ణంగా పరిశీలించి మరేదేశంలోనయినా

నావిద్య కొనసాగించాలని వెంటనే ఈ దేశం వీడిపోవాలని నిర్ణయం చేసుకున్నాను.''

ఆంధ్రపత్రిక ఆనందనామ సంవత్సరాది సంచిక పేజి – 68.

పై విధంగా దర్శనమిస్తున్న భారత దేశంలో ఇప్పటి విలువల్ని ఉన్నతమైన విలువలుగా ఎలా భావించాలో, గత జీవనంకన్న ఇప్పటి జీవనం ఎలా మెరుగయిందనుకోవాలో అర్థం కాకుండా వుంది. అంచేత ముందడుగు, వెనుకడుగు ఒక తరం, తర్వాత తరం వంటివి పూర్తిగా మర్చిపోయి, నిద్రాణ స్థితిలో జాతి కొట్టుమిట్టాడుతున్న అయోమయ స్థితి మనకి పట్టిన దుర్గతి అని విచారించాల్సిందే— అంచేత విచారించడం అనుచితం కాదు.

ఇంక "సాహిత్య రసికత" చచ్చిపోయింది అన్న దానికి శ్రీ పాట్నపల్లివారు చెప్పిన కారణాలలో తమ వాదానికి అనుకూలమయిన వాటిని ఎంచుకొని, అవి కూడా పూర్వాపర సందర్భ శుద్ధి లేకుండా ఎత్తి వ్రాయడం, శ్రీ కృష్ణారావుగారి నిష్పాక్షిక సమీక్ష అనలేం.

మచ్చుకి కొన్ని పరిశీలన చేస్తే తెలుస్తుంది.

పాట్నపల్లివారు తమ వ్యాసారంభంలో సాహిత్య రసికత చచ్చిపోవుటకు కారణం వివరిస్తూ, "శబ్దార్థ మాత్ర నిర్ణయ నీరస శుష్క వాగ్వాద కోలాహలములే కాని, సాహిత్య రచనల లోని భావనాశక్తిని చొక్కు రసార్ద్ర హృదయము గోచరించుటలేదు— అన్నారు. ఈ మొత్తం వాక్యంలో "కోలాహలములే" అనే వరకే తీసికొని శ్రీ కృష్ణారావుగారు మిగిలినది వదిలేశారు. ఇటీవల తరచుగా వస్తున్న వాగ్వాద ధోరణుల లోని వైపరీత్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్రాసిన ఆ వాక్యాంశాన్ని ఉట్టంకించి ఒక నిర్ణయానికి రావడం ఏమంత సమంజసం?" "రస సన్నివేశములకు అనుభూతి పొంది, పొంది పరవశించెడి రసజ్ఞత గోచరించుట లేదు" అన్న వాక్యం కూడా సందర్భంలో పరిశీలిస్తే ఈ హఠాన్నిర్ణయం చేయక్కర లేదేమో! శాబ్దిక చర్చా ప్రసంగం గురించి ఉట్టంకిస్తూ, పండితుల మధ్య జరిగిన చర్చలూ, దానికి ప్రోద్బలకంగా వీరభద్రరావుగారి వ్రాతలూ వ్రాశారు. వందిమాగధ స్తోత్రమూ, వ్యక్తినిందా ధోరణి ప్రాచీనం మంచే వున్నాయనీ, ఇప్పుడవి లేవనీ శ్రీ కృష్ణారావుగారంటున్నారు. మంచిని మంచిగా, చెడని చెడ్డగా ఒప్పుకున్నప్పుడే నిష్పాక్షికత గోచరిస్తుంది. శ్రీ పాట్నపల్లి ప్రాచీనంలోని మంచితోపాటు చెడ్డని కూడా స్వీకరించి, మంచిని మంచిగా, చెడ్డని చెడ్డగా నిర్మొగమాటంగా చెప్పడం, వారి బుభుత్వమునకు చిహ్నమే అవుతుందిగదా!

భాషా శాస్త్ర దృష్టిని గూర్చి పరామర్శ చేస్తూ శ్రీ కృష్ణారావుగారు, పద వ్యుత్పత్తి నిర్ణయం, నిర్దిష్టార్థం సరిగా జరగలేదని అంటున్నారు. "పురాణాలవంటి వాటికి తమ సిద్ధాంతాల కనుగుణంగా స్వప్రయోజన సాధనకై మత ప్రవక్తలు తప్పుడు వ్యాఖ్యానాలు, అర్థాలూ తీసి కావ్య దృష్టికి బదులు మత దృష్టిని విజృంభించేటట్టు చేశారు" అని వ్రాశారు కృష్ణారావుగారు. అంటే పురాణ వ్యాఖ్యాతలకు భాషాశాస్త్ర దృష్టి లేదనీ, పద వ్యుత్పత్తి వారికి తెలియదనీ నిర్దిష్టార్థాన్ని వారు వక్రంగా చిత్రించి, తద్ద్వారా వారు స్వప్రయోజనాన్ని సాధించుకున్నారనీ అనుకోవలసి వుంది. ఆ పురాణాల రచనా కాలం, అప్పటి స్థితిగతులూ, అప్పటి వ్యాఖ్యాతల బుద్ధి ప్రతిభా విశేషాలూ, నిర్ణయించి చెప్పగల శ్రీ కృష్ణారావుగారి శక్తి యుక్తుల్ని అభినందించాల్సిందే. ఇంతవరకూ ఎవరూ ఎత్తి చెప్పని విశేషాన్ని వారు చెప్పారంటే అంతకంటే ఘనత ఇంకేముంటుంది? అయితే ఈ నిర్ణయానికి ఆ వ్యాఖ్యాతల లోపాల్ని సోదాహరణంగా ఎత్తి చూపి వ్రాస్తే మెచ్చుకోవచ్చు.

భాషా శాస్త్ర దృష్టి అసలు వుండనే వుండరాదనేది శ్రీ పాట్నపల్లివారి అభిప్రాయం కాదేమో! భాషా శాస్త్ర దృష్టి రసస్వారస్య ధోరణికి అతి వేలం కారాదనేది వారి భావం అయి వుండాలి. "అసలు పాఠ్య ప్రణాళికయే సంస్కరింపవలసినదై యున్నది. ఇందులో భాషా శాస్త్రముయొక్క ప్రాబల్యము చిన్న చిన్న తరగతులనుండి పిల్లల బుద్ధులపై అధికారము వహించి, మేధస్సు ప్రజ్ఞా విషయికముగా పెరుగనీయుట లేదు" అని వ్రాసిన వాక్యాలలో బాల్య దశలోని పిల్లల మనస్తత్వాలకు గూడా భాషా మాధుర్య దృష్టితోకాక శాస్త్రీయ దృష్టితో గల పాఠ్యాంశాలు నిర్ణయింపబడడం అనుచితమన్న అంశం వ్యక్తమవుతోంది.

"పద్మినీ పద్మాతపత్రంబు" అనే పద్యాన్ని గూర్చి శ్రీ కృష్ణారావుగారు "శాస్త్రీయమైన దృష్టితో చూస్తే తెలుగు పదాలకి లేని "బింకం" సంస్కృత పదాలకి వుందని అనుకోవడం పొరబాటు" అన్నారు—ఈ వాక్యం వ్రాయడానికి వారుట్టంకించిన వాక్యానికి ముందు వాక్యం కూడా పరిశీలిస్తే సహృదయత కనబడుతుంది. మధ్యాహ్న వర్ణనా సందర్భంలో సాగిన ఆ వర్ణనని గూర్చి వ్రాస్తూ, పాట్నపల్లివారు "ఈ వాస్తవిక వర్ణనచేసెడికవి చేయి తిరుగనివాడైనచో పద్యము వెలితి వెలితిగానై సాహిత్య ముద్ర చెరిగిపోయెడి అవకాశమున్నది. ఈ కవి లోటు రానీయకుండ చేసెడి ప్రయత్నము సంఘటనలోను, సమాన రచనలోను, అడుగడుగునను గోచరించుచున్నది. ఈ సీస పద్య పాదములలో పూర్వపు భాగముల సమా

నముల స్థానమున తెలుగు పదములు వాడినచో పద్యమునకు రావలసిన బింకము పోదు. పై చరణములలో సమాస పాటవములో సొగసులు పోయిన పద్యము. ఎత్తుగీతిలో, తెలుగు పదములతో నెట్లు తళతళ లాడినది సహృదయులకు తెలియక పోదు'' అన్నారు. పూర్వాపర సందర్భ సమన్వయంలో సంస్కృత పదాల పొందిక అయితేనే బింకం వుంటుందనీ, తెలుగు పదాలకి బింకం వుండదనీ అనే అభిప్రాయం వ్యక్తమవుతోందా? పాట్లపల్లివారికి ఆ ఉద్దేశమే వుంటే ''ఎత్తుగీతిలో తెలుగు పదాలతో నెట్లు తళతళలాడినది సహృదయులకు తెలియక పోదు'' అని ఎందుకు వ్రాస్తారు? అయినా పద్యంమీద ఆయన స్వాభిప్రాయం ప్రకటించారు. అది తప్పుకాదుకదా! ''లోకో భిన్నరుచిః'' ఎవరి అభిప్రాయం వారిది. దానికి అనుశాసనం లేదు.

ప్రబంధకాలంనాటి రచయితలపైన, విమర్శకుల పైన అభాండం వేస్తున్నారన్నారు. ఈ లక్షణము వీ రొక్కరిలోనే శ్రీ కృష్ణారావుగారు గమనించారా? ఇటీవల సాహిత్య చర్చా సందర్భంగా వచ్చిన వ్యాసాలలో చాలా భాగం ప్రబంధ కవులమీదా, ప్రబంధాలమీదా, వచ్చే విసుర్లు వీరికి కనబడ లేదేమో! పరిశోధనా వ్యాసంగంమీద వారి విమర్శ శ్రీ పాట్లపల్లివారిపై అసంతృప్తిగా శ్రీ కృష్ణారావుగారు వ్రాశారు. వ్యక్తిగతమైన విషయం వారికి తెలుసుండవచ్చు. పాఠకుల కందరికీ తెలియదుగదా!

ఇంక ప్రాచీనమైన అభినయాది విశేషాలు గ్రహించడానికి తగిన అవకాశాలు సన్నగిల్లి, రాను రాను ప్రాచీనమైన సంస్కృతి విస్మరింపబడుతోందే అనే ఆవేదనతో గత వైభవం కొంతయినా నిలబడడానికి తగిన అవకాశం ప్రస్తుతంలో లేదని పాట్లపల్లివారు అభినయాదులను గూర్చి అల్లా వ్రాసి వుండవచ్చు.

రామాయణాన్ని గూర్చి ముచ్చటిస్తూ తమకు కావలసిన రీతిలో కావ్యానికి విమర్శ వ్రాసే పద్ధతి ప్రాచీనులలోనే ఎక్కువ అని నిర్ణయించారు శ్రీ కృష్ణారావుగారు. ఆ రామాయణంపై ఆధునికంగా వచ్చిన విమర్శలు, ప్రాచీన విమర్శలతో పోలిస్తే ఆధికమే—ఇవన్నీ ఒకే రీతిలో వున్నాయా?

''స్థాయి'' అనే దానికి పాండిత్యం అని అనుకోవాల్సివుంది అని అన్నారు. ఆ అర్థం వస్తుందా? (Level) అనే సమానార్థకంగా ఈ పదం వాడుతుంటారనుకుంటాను. చదువరి, అభిరుచి, అభినివేశం, ఆధారంగా గ్రంథపఠనం చేస్తూ చదువులో తనకున్న పరిజ్ఞానాన్ని పెంచుకుంటాడు. ఆ పెంపుదల చదువరి ప్రతిభా విశేషాన్నిబట్టి తారతమ్యం కలిగివుంటుంది. ఆ తారతమ్యంవల్ల స్వారస్యా స్వాదనలో ఎచ్చు తగ్గులుండ వచ్చు కదా!

సాహిత్యంలో స్థితిగతుల్ని గురించి భారతి సంపాదకులు వ్రాసిన వాక్యాలు మాననీయాలు. వాటిని శ్రీ కృష్ణారావుగారు చూడలేదేమో! ''సాహిత్య విద్యలంటే కేవలం ప్రాచీన ప్రబంధాలు ఆస్వాదిస్తూ మత్తుగా నిద్రించడంకాదు'' అన్నారు శ్రీ కృష్ణారావుగారు. ఈ వాక్యం వివరణ కూడా వారే యిస్తే బాగుండేది. శ్రీ పాట్లపల్లివారిలో ఏవి దోషాలుగా ఏకరువు పెట్టారో అవే శ్రీ కృష్ణారావుగారిలోనూ ఉన్నాయి. అంచేత ఒక విషయాన్ని గూర్చి మనం ఏది వ్రాసినా సంయమనంతో రెండు వైపులా ఆలోచించి వ్రాయవలసి వుంటుంది. శ్రీకృష్ణారావుగారు శ్రమ పడ నక్కర లేకుండా భారతి సంపాదకులు నవంబరు 66 భారతిలో ''ఒక మాట'' అని వ్రాసిన వానిలోని కొన్ని వాక్యాలు ఉట్టంకించి నా వ్యాసం ముగిస్తాను.

''మన సాహిత్య స్థితి నిద్ర పోతున్నట్లు వుంది. మన మేధావులు పాశ్చాత్య రచయితలను చదివినట్లు మన పూర్వ రచనలను చదవడం లేదు. ఇది ఏదో అధ్యాస దేశంలో పెరిగి పోతున్నది. ఇది విజిజ్ఞాస కాదు, విజిజ్ఞాసయొక్క ఆభాస. ఆత్మ ధర్మంయొక్క అవ్యవస్థ. నిజం ఆలోచిస్తే మన రచయితలకు పాశ్చాత్య రచయితలమీద ''మోజు'' అధికం కావడం దేనికి? మన కన్నా వారు ఏదో ఎక్కువ చెప్ప కల్గుతున్నారనే కదా! అందువల్ల ఈ మోజును, ఈ అభిమానాన్ని తప్పు అనడం లేదు. ఆ మోజు, ఆ అభిమానం ఇప్పటి మన రచయితలలో నిష్ప్రయోజనం అవుతున్నవి. ఎందుచేతనంటే పాశ్చాత్య రచయితలకు వున్న శాస్త్ర పరిజ్ఞానంగాని, వ్యుత్పన్నతగాని, ఆ పునాదులతో జాగరితం అవుతున్న ప్రతిభగాని ఇచ్చట ఉద్భవం చెందడం లేదు.''

శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు.

రూపసామ్యం

'ధనువు గారు వచ్చారు'

'బ్రహ్మాండమైన ప్రజా వూరేగింపు'

'కార్మికుల బైఠాయింపు సమ్మె'

'ఏక చెక్కవుంటేగాని బాగుండదు.'

'నాన్న వుంది'

ఇటువంటి ప్రయోగాలు లాక్షణికుల దృష్టిలో 'గ్రామ్యాలు' లేదా 'వ్యాకరణ దుష్టాలు' ఇటీవల ఆధునిక విజ్ఞాన యుగంలో రాకెట్‌లా దూసుకుపోతున్న 'భాషాశాస్త్రం'

పై ప్రయోగాల్ని తేలిగ్గా కొట్టి పారెయ్యరు. భాషలోని ప్రతి పదానికి వున్నట్టే, ప్రతి ప్రయోగానికీ వొక చరిత్ర వుంటుందని భాషా శాస్త్రం చెప్తుంది. పై ప్రయోగాలే కాకుండా వినోదం కోసం మాట్లాడుకునే ఈ క్రింది ప్రయోగాల్ని కూడా గమనించండి.

'నేనుకూడా సినిమాకి వెళ్ళింగ్' (వెళ్తున్నా)

'నేనిప్పుడే ఈటెడు' (తిన్నా)

'మీనాన్నగారు కాలుస్తున్నారు' (పిలుస్తున్నారు)

మనిషి స్వతహాగా అనుకరించే స్వభావం కలవాడు. అందుచేత ఏదైనా ఒక నూతన విధానాన్ని ప్రవేశ పెడ్తున్నప్పుడు అంతకు పూర్వం వున్న విధానాన్ని అనుకరిస్తూ కొంత మార్పు చేస్తాడు. ఇది భాషా వ్యవహారంలో ఎక్కువగా కనిపిస్తుంది.

ప్రచుర వ్యవహారంలో వున్న కొన్ని రూపాలసాయంతో వాటిని అనుకరిస్తూ కొత్త రూపాల్ని నియమ ప్రకారంగానే కల్పించటాన్ని భాషాశాస్త్రంలో 'రూప సామ్యం' (Analogy) అంటారు. ఆంధ్ర భాషా వికాసకర్త ప్రొఫెసర్ గంటి జోగి సోమయాజిగారు రూప సామ్యాన్నిలా నిర్వచించారు - "ఒక సంధి కార్యమును గాని, శబ్ద రూపమును గాని, ప్రత్యయమును గాని చూచి యింకొకచోట అట్లే కల్పించుట'

పైన పేర్కొన్న ప్రయోగాలు ఈ రూప సామ్యం కిందికి వస్తాయి. ఆంగ్లంలో కూడా చిన్న పిల్లలు mans, sheeps అని వాడుతూండటం, clothes అనే పదానికి ఏక వచనంగా 'క్లో' లని వాడటం మామూలే అని హాకెట్ అనే భాషా శాస్త్రజ్ఞుడు అంటాడు. 'look at' కి జవాబుగా 'I am looking' అని, 'it's too hot' కి బదులుగా it's three hot' అని కూడా అనటమూ రూపసామ్యానికి ఉదాహరణలే.

ఈ రూప సామ్యం వెనుకగల చరిత్రని పరిశీలిద్దాం. తెలుగు మాతృభాష కాని ఒకాయన సంస్కృతపాఠం చెప్తూ "దేవుడుగారు వచ్చారు' అన్నారు. ఇది తెలుగు భాషకి అసహజమైన వాక్య నిర్మాణం. అయితే ఇది ఎందుకు ప్రయోగించారు?

తెలుగు భాషలో 'గారు' అనేది గౌరవవాచకం అని వ్యవహారాన్ని బట్టి తెలుసుకున్నారు. దేవుడు సాక్షాత్ దైవ స్వరూపమని భావించి గౌరవంగా వాడాలనుకున్నారు. వ్యవహారంలో గౌరవ సూచకంగా వాడబడే 'గారు' కాస్తా దేవుడికి చేర్చారు. ఇది 'రూప సామ్యంవల్ల' ఏర్పడింది. దీన్నిట్లా చూపించొచ్చు:

రాజా గారు

సుబ్బారావు గారు

శర్మ గారు

దేవుడు X

ఈ స్థానంలో అప్రయత్నంగా అంతకు ముందున్న రూపాల సామ్యంతో 'గారు' చోటు చేసుకొని 'దేవుడు గారు' అవుతుంది. ఇలాగే 'ప్రేమ చేశారు' అనే ప్రయోగాన్నిలా చూపించొచ్చు.

ఆపని చేశారు.

ఫలహారం చేశారు.

తయారు చేశారు

ప్రేమ X

వ్యవహారంలోని ప్రయోగాల్ని ఆసరాగా తీసుకొని, వాటిని అనుకరిస్తూ 'ప్రేమ చేశారు.' అని అనటం సంభవం.

ఈ ప్రయోగాల వల్ల 'వ్యాకరణాన్ని మానవుడు స్వయంగా నిర్మించుకుంటాడు' అన్న ఛామ్‌స్కీ (Chomsky) సిద్ధాంతం నిజమని తేలుతుంది. స్వయంగా వ్యాకరణం నిర్మించుకోవటానికి చేసే ప్రయత్నాల వల్లనే 'నాన్న వుంది' 'చెంబులో నీళ్ళుంది' మొదలైన ప్రయోగాలు ఏర్పడతాయి.

'చుట్టూరా' అనే ప్రయోగం ఆధారంతో ఆరేళ్ళ అమ్మాయి 'ఎండూరా' అని ప్రయోగించింది. ఏకచ్ఛత్రాదిపత్యం, ఏకాహం, ఏకము మొదలైన ప్రయోగాల వల్ల ఏకదేవుడు, ఏక ఏడుపు, ఏక మొత్తం అనే శబ్దాలూ, గారింపు, తాళింపు, వేయింపు శబ్దాలవల్ల, తయారింపు, (శాలోఫెన్ అప్పలాంజనం లిమిటెడ్ వారి తయారింపు) అనే శబ్దమూ ఏర్పడ్డాయి. ఇలాగే ప్రజా వూరేగింపు ప్రజా వెల్లువ మొదలైనవి.

బాల వ్యాకరణం క్రియా పరిచ్ఛేదంలోని 'సంస్కృతంబున కంటాదుల కించుక్కగు' అనే సూత్రం వల్ల 'ఇంచుక్' కేవలం సంస్కృత ధాతువులకే రావాలి. అంగలించు, పంవరించు, ఆవులించు, భుజించు, మొదలయినవన్నీ అలా ఏర్పడినవే. వీటి సామ్యం వల్ల అన్య దేశాల్లోకూడా 'ఇంచుక్' చోటు చేసుకుంది: ఉడాయించు, బైఠాయించు, చెడిషించు, పెరిషించు మొదలైనవి ఉదాహరణలు.

ఉర్దూ భాషలోని ఖాతాదార్, జమీన్‌దార్, ఈనాన్‌దార్ మొదలైన పదాల సామ్యం వల్ల 'దార్'ని తెలుగు పదాలకి చేర్చి ఉత్పత్తి దారులు, పంపకం దారులు, వృత్తిదారులు, అని ప్రయోగించడం మనకి తెలుసు.

సంస్కృతంలోని అకారాంత శబ్దాలైన 'రామేణ, రామైః, అనే రూపాలు సర్వనామాల యొక్క 'తేన తైః' రూపాల సామ్యం వల్ల కలిగాయి. ప్రావీణ్యము, రామణీయకము అనేవి భావార్థ అన్న సంగతి మరచిపోయి, తక్కిన పదాల సామ్యంవల్ల వీటిపై కూడా ప్రత్యయాలు చేర్చి ప్రావీణ్యత, రామణీయ

కత్వము అవే రూపాల్ని సృష్టించారు. ఈ సామ్యము వల్లనే కృత్ప్రత్యయములను తద్ధితములుగా వాడటం జరుగుతోంది.

'ద్వాదశ' - ద్వివచనం 'కాబట్టి 'ద్వా'లోని ఆ 'సహేతుకం'. దేని సామ్యం వల్ల 'ఏకదశ' అని ఉండవల్సిన పదం' ఏకాదశ' అయింది. బృహస్పతి, జాస్పతి మొదలైన పదాలవల్ల రథస్పతి, బుతస్పతి ఏర్పడ్డాయి.

అ, య్మై, అస్, అమ్, ప్రత్యయాలు చేరి దేవ్య, దేవ్యై దేవ్యాః, దేవ్యామ్ అనేవి ఏర్పడతాయి. ఇలాగే ప్రియా,ప్రియై, ప్రియాః. ప్రియామ్ అని ఉండాల్సిన రూపాలు ప్రియాయ, ప్రియాయై, ప్రియాయాః. ప్రియాయామ్ అని ఏర్పడ్డాయ్.

ఈ రూప సామ్యానికి 'బాడీ' మంచి ఉదాహరణ. ఆంగ్లంలోని 'Bodice' పదాన్ని బహువచనంగా భావించి(బాడీస్ మంచి) బాడీ చేశాం. దానికిప్పుడు తెలుగున బహువచన ప్రత్యయమైన లు చేర్చి 'బాడీలు' చేశాం. ఆంగ్లంలో మరో ఉదాహరణ.

'Daddy, please pass the cheese'—
a woman said
'Mummy, I want a chee too' -
small daughter said.

ఆంగ్లంలోని 'Could' పదం 'Should' 'Would' పదాల సామ్యం వల్ల ఏర్పడిందేవంటారు.

జై ఆంధ్ర ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో ఆంధ్రప్రభ దిన పత్రికలో పతాక శీర్షికలో ఇలా పడింది :

'జై ఆంధ్ర— జైజై ఆంధ్ర'

విజయవాడలో శతసహస్రాధిక కంఠానాదం.

'కంఠ, అన్నది' పుంలింగం కాబట్టి ఆ కారాంతం కాకుండా 'కంఠనాదం' అని ఉండాలి. అయితే శంఖారావం, ఘంటానాదం మొదలైనపదాల సామ్యం వల్ల 'కంఠానాదం' ఏర్పడింది.

భగవదిచ్ఛకు బదులుగా భగవదేచ్ఛ అనీ, తపశ్శక్తికి తపోశక్తి అనీ, 'గౌరవ్య' కి, గౌరవనీయ 'ప్రాముఖ్యము' బదులుగా ప్రాముఖ్యత, ఐక్యము బదులుగా 'ఐక్యత' —ఈ ప్రయోగాలన్నీ రూప సామ్యం వల్లనే ఏర్పడ్డాయి.

దాదాపు ప్రపంచంలోని అన్ని భాషలూ ఈ రూప సామ్యాన్ని ఆశ్రయిస్తాయి. భావాలు స్పష్టంగా, సూటిగా, హృదయానికి హత్తుకునేలా చెప్పడానికి సామ్యం దోహదం చేస్తుంది. భాషా వ్యవహారం సుగమం అవుతుంది. భాష పుట్టిన ప్పటినుంచే ఈ ప్రక్రియ అమలులో వుందా, లేక భాష పుట్టిన కొంతకాలానికి ప్రారంభమైందా అన్నది సమస్యగానే వుండిపోయింది. భాషా వ్యవహారం సాఫీగా సాగడనికే రూపసామ్యం ఉపకరిస్తుంది.

శ్రీ ద్వా. నా. శాస్త్రి.

నిరంకుశోపాఖ్యాన ఉపోద్ఘాతము నాది కాదు

1974 డిశంబరు నెల 'భారతి' కలగూర గంపలో శ్రీ ఆర్. అనంతపద్మనాభరావు గారు 'రాష్ట్రౌఢ వంశ మహా కావ్యము రుద్రకవి రచనయా?' అనునొక వ్యాసమును ప్రకటించి యున్నారు. అందు ఈ విధముగా వ్రాసినారు—

'సుధాతరంగిణీ' వ్యాఖ్యానమనుపేర శ్రీ స్వర్ణ సుబ్రహ్మణ్య కవిగారు నిరంకుశోపాఖ్యానమునకు విపులమైన టీకా తాత్పర్య సహిత గ్రంథమును వెలయించిరి. ఆగ్రంథమునకు ఉపోద్ఘాతము శ్రీ కొండూరి వీరరాఘవాచార్యులవారు రచించిరి. ఆ ఉపోద్ఘాతమున రుద్రకవి రచనముగా రాష్ట్రౌఢ వంశ మహా కావ్యమును సంస్కృత కావ్యము చేర్పబడినది' అని వ్రాసియున్నారు.

నేను శ్రీ స్వర్ణవారి సుధా తరంగిణీ వ్యాఖ్యాన గ్రంథమునకు ఉపోద్ఘాతము వ్రాయలేదు. నేను వ్రాసినది నిరంకుశోపాఖ్యానముపై 'కావ్యమీమాంస' అనుపేరితోడి సమీక్షయు, నాలుగు పుటలు గల 'కథా సంగ్రహము' మాత్రమే. ఉపోద్ఘాతమును వ్యాఖ్యాతలే స్వయముగా వ్రాసికొన్నారు. ఈ విషయమును సరిగా చూడక గాబోలు శ్రీ పద్మనాభరావు గారు ఉపోద్ఘాత కర్తృత్వము నాదని తలంచి యున్నారు. ఈ స్వర్ణ వారే తమ ఉపోద్ఘాతములో 'ఈ కవికృత గ్రంథములు' అను ఉప శీర్షిక క్రింద సుగ్రీవ విజయ, స్మర దీపికాదులతోబాటు రాష్ట్రౌఢ వంశ మహా కావ్యమును రుద్రకవికృతమే యని తమకు తోచిన ఉపపత్తులతో నిరూపించినారు. కావున నిరంకుశోపాఖ్యానమునకు ఉపోద్ఘాత కర్తృత్వము నేను కానని భారతి పాఠకులు గమనింప గోరుచున్నాను.

——శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు.

గ్రంథవిమర్శలు

జైవధర్మము

(రచయిత : శ్రీ విష్ణుపాద శ్రీల సచ్చిదానంద భక్తి వినోదఠాకురులు. అనువాదకులు : శ్రీ జన్నాభట్ల వాసుదేవ శాస్త్రి. క్రౌను 1/8 పుటలు 856, వెల : 12 రూ. ప్రాప్తిస్థలములు : శ్రీరామానందగౌడీయ మఠము, కొవ్వూరు, పశ్చిమగోదావరిజిల్లా; శ్రీ గౌడీయమఠము — గుంటూరు —1. శ్రీ గౌడీయమఠము — మద్రాసు -14.)

శ్రీ చైతన్య మహాప్రభువులవారు వంగదేశములో అనుష్ఠించి ప్రచారము చేసిన మధురభక్తిని ప్రపంచించునట్టిది ఈ గ్రంథరాజము. మూలము వంగభాషలో నున్నది. ఇది ఇంతవరకు ఏడుమార్లు ముద్రణ పొందినదన్నచో దాని ప్రాభవము ప్రత్యక్షమగుచున్నది. జీవధర్మము రెండు విధములు — నైమిత్తికము, నిత్యము. జీవుని కృష్ణ భక్తియే నిత్యధర్మమని ఇందలి ప్రధాన సిద్ధాంతము. న్యాయశాస్త్రములో నిధియైన చైతన్యులు భక్తిప్రధానమైన మతమును ప్రచారము చేయుట ఆశ్చర్యకరముగ తోచును. ఆ మతమును విస్తరించిన వారిలో శ్రీ రూపగోస్వాములవారును ప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్తలు. అట్లే ఈ మూలగ్రంథకర్తయు గొప్ప న్యాయశాస్త్రవేత్త.

ఈ గ్రంథములో మూడు భాగములున్నవి. అందులో మూడవ భాగములో 'రసోవైసః' అను వేదవాక్కు శ్రీకృష్ణ భక్తికే సర్వవిధముల అన్వయించునని నిరూపింపబడినది. శ్రీ రూపగోస్వామివారి భక్తిరసామృతసింధువు, ఉజ్జ్వలనీలమణి వంటి చైతన్యమత గ్రంథములన్నిటిని పఠించి, అందలి సిద్ధాంతములను సంభాషణ రూపములో సరళమైన వంగ భాషలో ఈ గ్రంథము వ్రాయబడినది. దీనిని శ్రీ వాసుదేవ శాస్త్రిగారు సరళమైన ఆంధ్రభాషలో అనువదించినారు. శ్రీచైతన్య మహాప్రభువులు ప్రపంచించిన మధురభక్తి స్వరూపమును తెలిసికొనగోరువారు ఈ గ్రంథమును ముఖ్యముగా పఠింపదగును. శ్రీ శాస్త్రిగారును శ్రీ గౌడీయమఠమువారును ఈ గ్రంథమును ప్రచురించి ఆంధ్రదేశములో విస్తార ప్రచారము లేకున్న చైతన్య మతమును సాధికారముగా తెలిసికొనుటకు అవకాశము కల్పించినందుకు వారిని అభినందించుచున్నాము. దీనిని పఠించుటచే మధురభక్తిని గూర్చిన విశేషములెన్నో బోధపడగలవు. సాహిత్యవేత్తలు గూడ ఇది సర్వవిధముల పఠింపదగినది. శైవధర్మ స్వరూపము ఎట్టిదో దీని పఠనము వలన యథార్థముగా గ్రహింపవచ్చును.

మహాన్యాసపూర్వక పశాస్త్రీయ రుద్రాభిషేక విధి

(సంగ్రహకర్త శ్రీ కూచి వీరభద్ర శర్మ. క్రౌన్ 1/8 పుటలు : 8+16+40+240+128=432. వెల : 16 రూపాయలు. ప్రకాశకులు : సనాతన ధర్మ ప్రకాశక గ్రంథమాలా, శ్రీ కూచి వీరభద్రశర్మ, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా)

శాంతిపౌష్టిక కర్మలలో స్మార్తులు సర్వసాధారణముగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకము చేసి అభీష్టసిద్ధి పొందుచున్నారు. ఆంధ్ర దేశ మంతటను ఒకే విధముగా జరుగుచున్నది. అది శాస్త్రీయము కాదనుటకు వీలులేదు. అయినను ఆ విధానమునకు కొన్ని విశేషములు చేర్చి ఈ గ్రంథము సంకలనము చేయ బడినది. న్యాస పూజాది విశేషములలో గమనింప వలసిన మెలకువలు విస్తరింప బడినవి. పాశుపత ప్రకరణమును ఏబది పుటల ప్రకరణములో ఎన్నో విశేషక్రియలు చెప్పబడినవి. ఎక్కడికక్కడ విధులకు శాస్త్రీయ ప్రమాణములు చూపబడినవి. అందువలన ఇది శాస్త్రీయ రుద్రాభిషేక విధి అనుటకు సర్వ విధముల తగియున్నది. ఇది ఎన్నో అమూల్య విషయములను ప్రపంచించుచున్నది. దీనిని బ్రహ్మశ్రీ లంకా వెంకట రమణ శాస్త్రి సోమయాజులు గారు ఆమోదించుచు పీఠిక వ్రాసిరి

ఉపయోగకరమైన
సరికొత్త గ్రంథములు

వ్యవసాయము— పిషరీ— కోళ్ల పెంపకము— అడవులు— తోటపని— యింజనీరింగ్ —వైద్యము— వివిధ సాంకేతిక విషయములపై గ్రంథములు గలవు. కేటలాగు ఉచితము. ఇంగ్లీషులో వ్రాయుండి.

N. K. PAUL & SONS,
P. B. No. 12202, Calcutta—5.

పుటల భూమిక వ్రాసినారు. వారు ఋగ్యజు రథర్వణ వేదము లను సభాష్యముగా అధ్యయనము చేసినవారు. సోమయాజులు. శ్రౌతవేత్తలు. వారి ఆమోదము పొందిన ఈ గ్రంథమునకు వేరుగా ప్రశస్తి వ్రాయనక్కరలేదు. శ్రీ సోమయాజులు గారు మొహమాటములేని విమర్శకులని భూమికయే చెప్పుచున్నది. వారు ఈ గ్రంథములో చిన్న లోపములను కూడ నిరూపించినారు. సవ్యం అను శబ్దమునకు వామ దక్షిణము లన అర్థము ఉండుటచే అంకుశమును కుడి ప్రక్కన ఉంచవలసినదని గ్రంథకర్త వ్రాయగా శ్రీ సోమయాజులు గారు అది ఎడమ ప్రక్కనే ఉండవలెనని నిష్కర్ష చేసినారు. ఇట్లే అష్టాంగ ప్రణామము చేయుటకు ఒక్కొక్క అంగమును ఒక్కొక్క మంత్రముచే వేర్వేరుగా చేయవలయునను దీనికి ప్రమాణము గవేషణీయమని గ్రంథకర్తగారు వ్రాయగా దానికి శ్రీ సోమయాజులు గారు ప్రమాణములు చక్కగా ఇచ్చినారు. మరియు ఈ అష్టాంగ నమస్కారములు చేయుటలో దేవుని అంగములను తన యంగములను కూడా స్పృశింపవలెనని, గ్రంథకర్తగారు వ్రాయగా స్వాంగానిచ అని సూత్రములో లేకుండున దేవుని అంగములను కాక తన యంగములనే స్పృశింపవలెనని శ్రీ సోమయాజులు గారు నిష్కర్ష చేసినారు. ఇట్లే మరి కొన్ని సూక్ష్మ విశేషములను గూడా భూమికలో ప్రస్తావించినారు. ఇట్లు మొహమాటము లేకుండ భూమికలు వ్రాయువారు ఈ కాలములో చాలా అరుదుగా ఉన్నారు. అందులో ధర్మ విషయమున మొహమాటము పనికి రాదు. అట్టి నిష్ఠతో శ్రీ సోమయాజులు గారు చిన్న లోపములను ఎత్తి చూపినను గ్రంథము ఎన్నో విశేషములను తెలుపుచున్నదని ఇంత కృషి చేసి ఈ గ్రంథమును ఈ రీతిగా సంకలనము చేసి ప్రజల కందించిన శాస్త్రిగారిని ఆశీర్వదించినారు. ఈ గ్రంథము రుద్రాభిషేకము చేయువారును చేయించుకొనువారును ముఖ్యముగా పఠింపవలసి యున్నది. కొన్ని దోషములు సాధారణముగా తెలిసినవేవైనను వానిని పరిహరించుట లేదు. ఇట్టివి అర్ధవస్త్రధారణము, గర్భాలయములో ప్రదక్షిణము చేయుట, కొన్ని మాత్రమే. ఏ క్రియ చెప్పుచున్నను దానిని చక్కగా చేయవలసిన విధానము, ఎక్కడికక్కడ స్పష్టముగా ప్రమాణ వాక్యములతో చెప్పుచుపోవుటచేత గ్రంథము చాలా ప్రయోజనకరముగా ఉన్నది. ఈ మహా గ్రంథమును పఠించి రుద్రార్చనాపరులు ఇహపర శ్రేయస్సులను పొందుదురు గాక. ఈ గ్రంథమును అనేక స్థలములలో గల గ్రంథములను సంపాదించి గ్రథనము చేసిన శ్రీ శర్మగారిని హృదయ పూర్వకముగా అభినందించుచున్నాము.

—శ్రీ నోరి నరసింహశాస్త్రి

సంపత్కుమారసంభవః

(రచయిత : ఉభయవేదాంత విద్వాన్ శ్రీ శిరశినహళ్ కృష్ణమాచార్య శతావధాని, కోరుట్ల, కరీంనగర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్. క్రౌను 63 పుటలు. వె. 2 రూ.)

కర్ణాటకంలోని యదుగిరిపై వేంచేసియున్న సంపత్కుమారుడనే దేవుని గురించిన వృత్తాంతం ఈ సంస్కృత కావ్యంలో వివరించబడింది. నాల్గు సర్గల ఈ కావ్యంలోని తొలిసర్గలో రామపూజితుడైన విష్ణువు రామప్రియుడని, అతని విగ్రహాన్ని రామపుత్రుడైన కుశుడు తన కుమార్తె వివాహ సమయంలో ఆమె కోరిక ప్రకారం అరణం ఇచ్చాడనీ, ఆమె ఆ విగ్రహాన్ని తనతో మధురకు తీసికొని వెళ్ళినదనీ చెప్పబడింది. రెండవ సర్గలో విరోచనుడనే రాక్షసుడు విష్ణు దేవుని కిరీటాన్ని అపహరించగా, గరుడుడు దానిని తెచ్చి శ్రీకృష్ణుని తలపై ఉంచగా, అతడు రామప్రియ విగ్రహం తలపై దానిని ఉంచినట్లు, తీర్థయాత్ర నుండి తిరిగివచ్చిన బలరాముడు రామప్రియ విగ్రహంతో సమానమైన నారాయణ విగ్రహం యదుగిరిపై ఉన్నదని శ్రీకృష్ణునితో చెప్పి, చూపి ఒప్పించినట్లు, రామప్రియ విగ్రహాన్ని యదుగిరిపై ఉంచి నట్లు తెలుపబడినది.

మూడవ సర్గలో తురుష్కులు యదుగిరి దేవాలయాన్ని ధ్వంసంచేసి, విగ్రహాలను ఢిల్లీకి తీసికొనిపోవడం, నవాబు కుమార్తె బీబీ రామప్రియవిగ్రహాన్ని చూచి పరవశయై, ఆ దేవుని పైనే వలపుగొని, దానిని తన దగ్గర ఉంచుకోవడం, భగవద్రామానుజులు యదుగిరికి వచ్చి దేవాలయాన్ని పునరుద్ధరించడం, నారాయణ విగ్రహప్రతిష్ఠ వివరింపబడినవి. నాల్గవ సర్గలో రామప్రియ విగ్రహం కోసం రామానుజుల ఢిల్లీ దండయాత్ర, నవాబుతో సమావేశం, విగ్రహ సమూహంలో రామప్రియవిగ్రహం కానరాకపోవడం, విగ్రహాన్ని పిలువవలెనని నవాబు చెప్పడం, రామానుజులు పిలువగానే, ఆ విగ్రహం బీబీ వద్ద నుంచి వచ్చి, తండ్రి తొడపై పుత్రుడు కూర్చున్నట్లు కూర్చోడం, సంపత్కుమార నామకరణం, విగ్రహాన్ని విడువలేక బీబీ యదుగిరి ప్రయాణం, యదుగిరికి వచ్చేసరికి యానంలోనున్న బీబీ మాయంకావడం, యదుగిరిపై ఆమె ప్రతికృతి ప్రతిష్ఠ వర్ణించబడినవి.

రచయితకు కాళిదాసు మహాకవి యెడలను, అతని కావ్యముల యెడలను అపారమైన గౌరవం ఉన్నట్లు తెలుస్తున్నది. మహాకవి రఘువంశం వలెనే గురువంశాన్నీ, మేఘసందేశం వలెనే మరుత్సందేశాన్నీ, కుమారసంభవం వలెనే ఈ సంపత్కుమార సంభవాన్ని రచించినట్లున్నది. రామాను

లు రామప్రియునకే సంపత్కుమారుడనే పేరు పెట్టినట్లు 4వ సర్గ 50వ శ్లోకంలో ఉన్నది. సంపత్కుమారుడు వేరే జన్మించలేదు. కనుక, ఈ గ్రంథానికి సంపత్కుమార సంభవ నామం సముచితమా? అని సందేహం కలుగుతున్నది.

రచన ధారాళంగా సాగింది. వర్ణనలు చక్కగా ఉన్నవి. ఒక్క ఉదాహరణ –

"యవనేశసుతా విరోచన
ద్వయ సారూప్య మవాప్తు మిచ్ఛయా,
మదనప్రథమేషు కేతనే
అధునాపీహ వనే తపస్యతః" (35 పు)

నవాబు కుమార్తె కన్నుల పోలికను పొందగోరి అరవింద, మీనములు వనములో (నీటిలో) తపస్సు చేస్తున్నవట! వనంలో (అడవిలో) తపస్సు చెయ్యడం యుక్తియుక్తమే! ఇక్కడి శ్లేష చక్కగా కుదిరింది. రచన సరసంగా ఉన్నది.

పుస్తకముద్రణలో తగిన శ్రద్ధ గ్రహించబడలేదు. ప్రారంభం నుండి చివరి దాకా అక్కరలేని చోట విరామం, అది కావలసిన చోట లేకపోవడం కనబడుతున్నది. దీనివల్ల సమన్వయానికి శ్రమపడవలసి వస్తుంది. ఒక్క ఉదాహృతి— (పు. 20)

'విధాయరామప్రియ మూర్తిన్భక్తితో' అనేది
'విధాయ రామప్రియమూర్తిన్భక్తితో' అని ఉండాలి.

దీనికి తోడు అచ్చుతప్పులూ ఎక్కువ. 'అపూజ్యయత్' (పు.15) 'అపూజయత్' అనుటకు, 'శ్రియఃపతిస్సర్వ' అనుటకు 'శ్రియఃపతి సర్వ' (పు. 16) అని, 'అభవన్నిమదాశ్చ'కు 'అభన్నిమదాశ్చ' (పు. 43) అని, సంపత్కుమారవ్'కు 'రూపత్కుమారవ్' (పు 57) అని ఈ రీతి తప్పులున్నవి. 'శిరోల్లపత్' (పు16) 'అర్ఘ్య' (పు.21) 'విలోకయత్' (పు.23) అనే పదాలు వింతగా తోస్తున్నవి. రచయిత 'తురకలు' అనేదాన్ని 'తురకాః' అని సంస్కృతీకరించారు. (పు. 32)

అక్కడక్కడ మూలాన్ని అర్థం చేసుకొనుటకు ఉపయోగించే అధస్సూచికలు చేర్చబడినవి.

కొంత శ్రద్ధ తీసుకుంటే ఈ కావ్యం ఇంతకంటె మెరుగుగా తయారై ఉండేది.

రత్నయుగళి

(రచయిత : శ్రీ కె. టి. యల్. నరసింహాచార్యులు, క్రౌను 91 పుటలు. వెల 4 రూ. ప్రకాశకులు, శ్రీ గోదా గ్రంథమాల, ముసునూరు, కృష్ణాజిల్లా.)

రత్నయుగళి రెండు చిన్న కృతుల సంపుటము. మొదటిది సంస్కృతములోని నారదభక్తి సూత్రములకు 'భక్తినివేదన' అనే ఆంధ్రీకరణము వివరణము. రెండవది పరాశరభట్టరు సంస్కృతంలో రచించిన 'శ్రీగుణరత్నకోశ' పద్య కృతికి 'రత్నావళి' అనే గద్యానువాదము.

భగవద్భక్తులలో నారదమహర్షి అగ్రగణ్యుడు. భక్తితత్వాన్ని వివరించడానికి ఆయన కన్నా అర్హుడు లేడు. ఆయన సూత్రరూపంగా ఐదుఅధ్యాయాలలో భక్తియోగాన్ని వివరించారు. మొదటి అధ్యాయంలో భక్తినిరుక్తి, రెండవ దానిలో పరాభక్తిమహత్వం మూడవ అధ్యాయంలో భక్తిసాధనాలు, నాల్గవదానిలో భక్తిలక్షణం, చివరిదానిలో భక్తిమహిమ ఉన్నవి. వివరణకర్త పెక్కు ప్రమాణాలతో ఆ సూత్రాలను చక్కగా వివరించారు. భక్తిని గూర్చి సంగ్రహంగా తెలుసుకోవాలంటే దీనిని పఠించడం మేలు.

భట్టపరాశరులు శ్రీదేవి గుణగణాలను వర్ణిస్తూ 61 శ్లోకాలను చెప్పారు. అదే శ్రీగుణరత్నకోశం. దీనికి ఇదివరకే వివరణాలూ, అనువాదాలూ ఉన్నవి. మూలాభిప్రాయాన్ని సులభంగా గ్రహించడానికి పద్యానువాదం కంటె గద్యానువాదమే తగినదనే అభిప్రాయంతో కాబోలు రచయిత దీనిని గద్యకృతిగా అనువదించారు. ఇంచుమించుగా ఇది మూలానికి తాత్పర్యమని అనుకోవచ్చును. ఇందు మొదట సంస్కృత మూలం ఇవ్వబడినది. తర్వాత ఆంధ్రగద్యానువాదం ఇవ్వబడినది. ఆంధ్రీకరణం సరళశైలిలో మూలాభిప్రాయాన్ని సరిగా వివరిస్తున్నది. సంస్కృతాంధ్రాలలో రచయిత సమర్థులైన విద్వాంసులు. కావున వారి కిది సుసాధ్యమైనది. భక్తులకు, ముఖ్యంగా విశిష్టాద్వైతులకు ఇది ఉపాదేయమైన గ్రంథం.

అచ్యుతరాయాభ్యుదయము

(సంస్కృతమూలమునకు ఆంధ్రానువాదము. గ్రంథకర్త: కావ్యతీర్థ, కవితావతంస శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి, క్రౌను 124 పుటలు. వెల 3 రూ. తెనాలి, సాహితీగ్రంథమాల ప్రచురణ.

ప్రాప్తిస్థానములు : (1) శ్రీ కూచిభొట్ల వీరరాఘవశాస్త్రి, కల్యాణి ప్రెస్, తెనాలి. (2) శ్రీ పథ్య నమీరకుమారదేవ, 17ఎ. (10—3-155) సరోజినీదేవి రోడ్డు, సికిందరాబాదు—26.)

శ్రీకృష్ణదేవరాయల అనంతరం విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన ప్రభువు అచ్యుతదేవరాయలు. ఆయన ఆస్థానంలోని విద్వాంసుడు రాజనాథకవి తన ప్రభువు పట్టాభిషేకం మొదలుకొని తీర్థయాత్రను ముగించుకొని, విజయ

నగరాన్ని ప్రవేశించు వరకూ ఉన్న వృత్తాంతాన్ని వర్ణిస్తూ ఈ కావ్యాన్ని రచించాడు.

ఇందులో పన్నెండు సర్గ లున్నవి. తొలి సర్గలో ఇష్ట దేవతా స్తుత్యనంతరం చంద్రవంశ, నరసరాజు, విద్యానగర వర్ణన లున్నాయి. రెండవ సర్గలో ఓబమాంబ గర్భధారణ, అచ్యుతరాయల పుట్టుక, బాల్యము వర్ణింపబడినవి. తృతీయ సర్గలో అచ్యుతరాయల యౌవనము, వివాహము, యౌవ రాజ్యాభిషేకము, చినవేంకటాద్రి జననము వర్ణింపబడినవి. నాల్గవ సర్గలో వర్ష, శరదృతు వర్ణన, అచ్యుతరాయల తీర్థ యాత్రా ప్రసంగం, ఐదవ ప్రకరణంలో దండయాత్ర, చంద్రగిరి ప్రవేశం, శేషశైల, కాళహస్తి, కంచి, అరుణాచలములను దర్శించుట, శ్రీరంగమునకు పోవుట ఉన్నవి. ఆరవ సర్గలో తామ్రపర్ణీవర్ణన, సంక చేరరాజుతోడి యుద్ధం, విజయం, అనంతశయన ప్రయాణం వర్ణించబడినవి. ఏడవ సర్గలో సముద్రవర్ణన, పాండ్యసంస్థాపన, అనంతపద్మనాభ స్తుతి ఉన్నవి. అష్టమ సర్గలో సూర్యాస్తమయ, చంద్రోదయ వర్ణన, తొమ్మిదవ సర్గలో లలనావిలాస, మధుపానాదికములు, పదవ సర్గలో వైతాళికుల మేలుకొలుపులు, అచ్యుతరాయలు సేనలతో బయలుదేరుట ఉన్నవి. పదకొండవ సర్గలో హయపతులతో యుద్ధం, చివరి సర్గలో విద్యానగర ప్రవేశం వర్ణించబడినవి.

ఈ కావ్యంలో వర్ణనాంశం ఎక్కువ. కథాంశం చాలా తక్కువ. అందులోనూ చరిత్రకు సంబంధించిన అంశాలు మరీ స్వల్పం.

అనువాదకులు సుప్రసిద్ధ విద్వాంసులు. అనేక సంస్కృత గ్రంథాలను రసవంతంగా అనువాదం చేసి కీర్తి గడించినవారు. ఈ కావ్యరచన కూడా రసవంతంగానే సాగింది. మచ్చునకు ఒక పద్యం—

ఉ. నెమ్మొగ ముర్వికెలన్ వడిచి
నెమ్మొలలుం జుంచులుం, జెంచువారు వి
ల్లమ్ములు పూని హస్తములు,
నచ్చపు వెల్లని గవ్వలలకే
ర్లిమ్ములుగా ధరించి వెడ,
వెంతయు నమ్రత వెంట నంటి రా
న న్మనుజాధినాథుండరు
దాద్రికి నేగె సఖైకతానుఁడై'

(పుట 52)

భాగవత చంపూ ప్రబంధము

(గ్రంథకర్త: కావ్యతీర్థ, కవితావతంస శ్రీ గటి లక్ష్మీ వరసింహశాస్త్రి, క్రౌనుసైజు 8+205 పుటలు. వెల 4 రూ. ప్రకటనకర్త—తెనాలి—సాహితీ గ్రంథమాల పక్షమున శ్రీ ప్రఖ్య సమీరకుమారదేవ. ప్రాప్తిస్థానము— (1) శ్రీ కూచిభొట్ల వీరరాఘవశాస్త్రి, కల్యాణి ప్రెస్, తెనాలి. (లేక) 2. శ్రీ ప్రఖ్య సమీరకుమారదేవ, 17 ఏ. (10-3-155) సరోజినీదేవి రోడ్డు, సికిందరాబాదు—26.)

సంస్కృత భాషలో చంపూ గ్రంథాలు చాలా ఉన్నవి. వాటిలో రామాయణ చంపు, భారత చంపు, నీలకంఠ విజయ చంపువులు సుప్రసిద్ధాలు. భాగవత చంపువును అనేకులు వ్రాసి నట్లున్నారు. ఆంధ్ర విద్వత్కవితంసులు అభినవ కాళిదాస బిరుదాంకితులు వెల్లాల చిదంబర కవిగారు రచించిన గ్రంథాన్ని రచయిత ఆంధ్రీకరించినట్లు—

'చిదంబర ప్రపౌత్రుండన్ నృసింహనామ ధేయుండన్
చిదంబరాఖ్యసత్కవీంద్ర శేఖర ప్రబంధమున్
ముదంబునం దెలుంగుసేయ బూనినాడ...''

అనే దానివల్ల తెలుస్తున్నది.

ఈ భాగవత చంపువులో సంస్కృతభాగవతంలో ఉండే కథలు యావత్తూ లేవు. దశమస్కంధంలోని శ్రీకృష్ణుని వృత్తాంతం వివరింపబడింది. భాగవతంలో లేని రాధావృత్తాంతం విపులంగా ఉన్నది.

ఇందులో ఆరు విలాసా లున్నవి. ప్రథమ విలాసంలో ప్రస్తావనాదుల తర్వాత శ్రీకృష్ణుని జననం మొదలుకొని పూతనాదుల సంహారం వరకూ ఉన్నది. ద్వితీయ విలాసంలో శ్రీకృష్ణుని లీలలు, వత్సాసుర వధ, వత్సాపహరణా వృత్తాంతాదు లున్నవి. తృతీయ విలాసంలో గోపికావస్త్రాపహరణ, గోవర్ధనోద్ధరణం, బలరామకృష్ణుల మధురానగర ప్రవేశం మున్నగునవి చెప్పబడినవి. చతుర్థాశ్వాసంలో మల్లవధ, కంసవధ, బలరామకృష్ణుల గురుకులవాసం, కాలయవన వధ, రుక్మిణీ కల్యాణం, శమంతకోపాఖ్యానం మున్నగునవి ఉన్నవి. పంచమ విలాసంలో అనిరుద్ధ చరిత్ర, ఉషా పరిణయం, పౌండ్రక వధ, ద్వివిదసంహారం, జరాసంధ వధ మొదలైన వృత్తాంతాలు కానవస్తున్నవి. చివరి విలాసంలో సాల్వవధ, కుచేలోపాఖ్యానం, రాధామాధవ కల్యాణాదు లున్నవి.

రచన రసవంతంగా సాగింది. ఉదాహరణ—

'పెక్కురాత్రు లడంగని పెద్ద చింత
మేలుకొనియుండి శ్రమమును జాలఁగొన్న
వాఁడువోలెఁ గంసావనిపాలుఁ డపుడు
తివిరి తాఁ గొనె నశ్రాంతదీర్ఘనిద్ర' (పుట. 109)

ఇది 1955 లోనే రచించబడింది. కాని రచయిత సన్యాసాశ్రమాన్ని స్వీకరించి శ్రీ శ్రీ నృసింహానంద భారతీస్వామి నామం వహించిన తర్వాత లౌకిక విషయాలలో అనాసక్తులగుటవల్ల ఇంతవరకూ ముద్రింపబడలేదు. కాని, వారి

ఆప్త శిష్య వర్గం రచయిత యొక్క ఇతర గ్రంథాలతో పాటు దీనిని కూడా ప్రకటించి ఆంధ్ర వాఙ్మయానికి మహోపకారం చేశారు.

భాగద్వయాత్మకమైన భాగవత దశమ స్కంధాన్ని చదివే వోపిక లేనివారు దీనిని పఠిస్తే, అందలి విషయాలతోపాటు మరికొన్ని విషయాలను గ్రహించడానికి అవకాశం లభిస్తుంది.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య.

తెలుగులో పద్య గేయ నాటికలు

(రచన: శ్రీమతి మంగళగిరి ప్రమీలాదేవి. క్రౌన్ 280 పేజీలు. వెల రు. 10— ప్రాప్తిస్థానములు :— సాహితీసమితి, రేపల్లె., మంగళగిరి ప్రమీలాదేవి, రైలుపేట, రేపల్లె.)

ప్రమీలా దేవిగారు సంగీతం తెలిసినవారు అయినందున ఆమెకు తగిన విషయం పరిశోధించి వ్రాయుట బాగున్నది. 'వినయాంజలి'లో ఏదో చెప్పబోయి ఇంకేదో చెప్పినారు.' 'ఈ పద్య గేయ నాటికా ప్రక్రియ పాశ్చాత్య సాహిత్య పరిచయ ప్రభావమున ఆంధ్ర వాఙ్మయమున అభినవ వాఙ్మయ ప్రక్రియ' అంటూనే, 'అట్లని తెలుగులో సంగీతానికి ప్రాముఖ్యమిచ్చు దృశ్య ప్రక్రియలు లేవని అన్వయించ కోరాదు. స్వవచన వ్యాఘాతం చేసుకొన్నారు. ఇంకా 'ఆంధ్రుల కళా విజ్ఞతకు ప్రతీకమైన యక్షగానము సంగీత సాహిత్య నాట్యముల సంమిశ్రమమే' అని వ్రాస్తారు. తలలో స్థిరమైన అభిప్రాయం ఉన్నట్లు లేదు.' "త్యాగరాజ నౌకాచరిత్రాదులు సంగీత నాటకాలుగా ప్రఖ్యాతి గాంచినవి" అని ఒప్పుకొంటూనే అందు వారి ప్రస్తావన చేయరు— వారి నాటకాలు చేర్చరు. ఇది యీ వినయాంజలి వ్రాసేటప్పుడు తట్టిన రెండవ తలంపుగా ఉన్నది. గేయ నాటికలు పాడి ప్రదర్శించను పనికి రావని యీమె అభిప్రాయమైతే, 'నాటికలు' అన్న పేరు నేతి బీరకాయ అవుతుంది— ఏదో గందరగోళం.

ఇంతకూ యీమె, తమకు అభిమానం, గురుభావం ఉన్న ఒకరిద్దరు పెద్దలను గూర్చి, వారి రచనలను గూర్చే, ప్రకటించను పూనుకొనినట్లు, పుస్తకం తెరువగానే ఆ యిద్దరి నాటికల సంఖ్యను బట్టి తెలుస్తున్నది. ఆ పెద్దలు మహా మహులే ! కాదనే వారే లేరు. కాని, వారు వ్రాసిన కథక కవిత్వమంతా గేయ నాటిక అనడం అతిభక్తి లేక, వేలము వెర్రి. ఇద్దరు ముగ్గురినే ప్రస్తావిస్తే బాగుండదేమోనని, కన్నీళ్లు తుడవను మరి కొందరిని చేర్చి, వారివి ఒకటిరెంటనే చవి జూపినారు. ఈమె కొలమానంతోనే చూస్తే యీ పేర్కొన్న వారివి— ఇంకా చాలా, గేయ నాటిక అనిపించుకొనేవి ఉన్నవి. వాటిలో చాల మంచివి గూడా ఉన్నవి. గురు పూజా సుమాలకే కాలం కాగితం సరిపోయినట్లున్నది.

ఇది అకాడమీ బహుమతి పొందినదని ముఖ పత్ర ప్రకటనము. ఆ అకాడమీ విషయమై యిప్పుడు రేగి ఉన్న వివాదాగ్నికి యిది కట్టెలు ఎగదోసినట్లుంటుందేమో !

బాలాంత్రపు రజనీకాంతరావుగారి 'ఆమోదం' ముద్రయును గూరుస్తున్నది.

రాగమయి

(ఖండ కావ్యము. శ్రీ శోభిరాల సత్యనారాయణ. డెమ్మీ. 64 పుటలు. వెల: రు. 5. ప్రతులకు: కె. ఆనందవర్ధన, సబ్ ఎడిటర్. ఆంధ్రప్రభ, విజయవాడ; ఇప్పిలి చిట్టిబాబు సన్స్ బుక్ సెల్లర్సు, శ్రీకాకుళము.)

బహుముఖ పాండిత్యము లోకానుభవం కలిగిన ఈ కవి సాంప్రదాయ ఫక్కీలో వ్రాసిన ఈ కావ్య వస్తువు కవితాకృతి క్రొత్త పాత పోకడలవారికి ప్రీతికరంగా ఉన్నది. నిర్జల మరుభూమిలో ఒక శాద్వలావృత హ్రదంవలె యీనాటి భిన్న కవితా రీతులలో కొన్ని కోవలవారికి ఇది ఒక చలివేంద్రమంటిది. చరిత్ర జనశ్రుతి కలిసిన ఈ కథ వసుచరిత్ర కారకుని ప్రకారం జాతిరత్నమగుచున్నది.

స్వర్గలోక దేవ హర్మ్యం ఒకటి రెక్కలు గట్టుకొని ఎగిరివచ్చి, వరంగలు ప్రాంతారణ్యాలకు దిగివచ్చి పాడుకొన్నట్లున్న రామప్పదేవాలయాన్ని పెనవేసుకొనివున్న ఒక రమ్య ప్రణయ గాథ పఠించిన కరుణారస పూరము యీ కావ్యము. వరంగల్లుకు నలభై మైళ్లలో, ములుగు తాలూకా, పాలంపేటలో రామప్పచెరువు ప్రక్కన ఆంధ్రచక్రవర్తి గణపతి దేవుడు, రామప్ప అనే నామాంతరం గలిగిన గజరాజా అనే ఒక మహా శిల్పిచేత కళాలక్ష్మికి పేరోలగమైన ఒక శివాలయాన్ని నిర్మింపజేస్తుంది వాడు— చక్రవర్తి కూతురు— రుద్రమదేవి అజ్ఞాతంగా ఆలయం వచ్చిపోతూ, జీవకళ ఉట్టిపడేటట్లు ముఖ మంటప నందిని మలుస్తుండిన శిల్పిని చూచి ఆయన కళాకాంతి ఆయన దేహానికి వన్నెవు గూర్ప ఆకర్షిత అయినది. అతడు గూడ ఆమె అలౌకిక లావణ్య రేఖలకు ముగ్ధుడై, హృదయ ఫలకంమీద అచ్చుబడిపోయిన ఆమె రూప సౌందర్యములచే ధ్యానిస్తుండగా తనకు తెలియకుండానే, అతని చేతి ఉలి ఆ సుందరి ప్రతిమనే ఆలయమంతటా చెక్కినది.

ఇంతలో గణపతి దేవుడు పరమపదించినాడు. రుద్రమ ఆంధ్రసామ్రాజ్య సింహపీఠ మెక్కబోతున్నది. అప్పుడు అంతా తెలిసికొనిన ఆ శిల్పి ఆమె ఇక తనకు అందరాని పండని, కావ్య ఫలప్రాప్తికి వోచుకొని ఆ ప్రేమికుడు వగచి, కోవెల గాలి గోపురంమీదనుంచి దూకి ఆత్మహత్య చేసికొంటాడు. రాణి తనపై ఆ శిల్పికి గల ప్రేమోన్మాద తీవ్రతను అర్థం చేసికొని వ్యథాకులచిత్తయై గద్దెమీద కృశిస్తుండినది. దీనికి—

"ప్రణయాభావ
శబలితాహ్లాద చిత్తయై చనెడువేళ
ద్రోపి పొడవున రుద్రమదేవి యెడద
గప్పరగ సౌరభ్యమల్ గుప్పుమనియె"

లని కవి వ్యాఖ్యానం. ఈ గ్రంథకర్త కొంత చనవు దీసికొని గజరాజు సంగ పరిత్యాగం చేసిన ప్రేమతపస్విగా "సదసద్వివేక శూన్యుడుగా' చిత్రించినాడు.

ఇట్టి స్వాతంత్ర్యం కవులకు అవసరమే. మూల ఉత్తర రామాయణంలో లేని (తిక్కనలో గూడ) లవకుశులు యజ్ఞాశ్వాన్ని పట్టడం, భవభూతి సృష్టించి కథకు నాటకీయతను కల్పించినాడ గదా. సొంపుకు గూర్చే మార్పులు ఔచిత్యాలే.

ఈ కథాకాలం 1255–1260 సరికట్లది. ఇదే తిక్కన మనుమసిద్ధుల ఏలుబడి కాలం కూడా. ఈ దేవాలయాన్ని 1162 లో రుద్రసేనాని అనే ఒక రెడ్డి సామంతుడు కట్టించినాడని కొందరు చరిత్ర పండితులు అంటారు. మన చరిత్రలు పుక్కిటి పురాణాల ఒడిలోనే గదా విశ్రమిస్తున్నవి

ప్రపంచ వాఙ్మయంలో, కావ్య ఫలప్రాప్తికి నోచుకోని లభ్యాప్రేమికుల కథలు కరుణరసాన్ని, ఏటిచలువవలె పూరించేవి చాలా ఉన్నవి. ఇది పారశీక షిరీన్ ఫర్హాద్ విషాద ప్రణయ గాథకు సరిపోతున్నది. పారశీక సాహిత్యంలో, ఫలించిన ప్రేమానుభావంకంటె అతృప్తవాంఛామయ మధుర స్మృతులే ఉపయుక్తాలని భావన. మనవారి మధుర ప్రేమ వంటిది. షిరీన్ ఒక రాజకుమార్తె. ఫర్హాద్ ప్రతిమా శిల్పి. ఇద్దరూ ప్రేమ తగులంలో బడినారు. రాజు కాదనక ఒక కాలువను పొంరాతిచట్టుగుండా, ఒంటరిగా త్రవ్వి పాలు పారించమని కట్టడిబెట్టుతాడు. ఒంటరిగా ఫర్హాద్ నిజక్లేశస్వేదంతో ప్రియా ప్రతిమను అభిషేకిస్తూ కొన్ని ఏండ్లు త్రవ్వి, కాలువ పని పూర్తి అయ్యే సమయానికి కృశీభూతాంగుడై ప్రేమోన్మాదుడై అసువులుబాస్తాడ. రాకుమార్తె పిడుగువంటి ఆ వార్త విని రెప్పె ఆ శిల్పికి గల ప్రేమ సాంద్రతకు బమ్మెరపోయి గుండె అవిసి చనిపోతుంది. ఇట్లా వారి ప్రణయం మధుర స్మృతిగానే నిలిచిపోయినది.

ఇట్టి భావాన్ని యీ కవి— "వినిపించని గీతమ్ములు మనమ్ముల నలరించు మధుర మధురము లగుచున్" అని అంటాడు.

అట్టి కరుణ రసప్రధానమైనదే యీ కావ్యము. హృదయ స్పందనకారియైన కథకు యీయన కవిత్వం జీవం పోసినది.

కవి తెలుగు సంస్కృతాలను బలిసిన కొడెంవలె గంభీరంగా చారుతరంగా నడిపిస్తాడు. కవితా శిల్ప కోరకాలు పలుతావులలో గుబాళిస్తున్నవి. మానసిక వ్యథా పరిణామాన్ని, అపరసు మహాకవి—విక్టర్ హ్యూగోవలె వర్ణించి కవితకు గురుత్వాన్ని కల్పిస్తాడ. "రాగమును విరాగమును జీవం సులందు గలుగుటకు గానరదెట్టి కారణమ్ము" అంటూ "పూర్వ జన్మ కృతమౌల్ గాబోలు రాగానెయ్యముల్" అన్న రవి రాజభాషణుని వివికిత్సలోబడినాడ. తర్వాత ఇదే "సహజముగు పూర్వ జన్మ వాసనలవలన "పరగ పరస్పరానుగత భావ రహస్య మెరుంగ ఎవ్వవే? అన్నది ఆత్మానుభవ ప్రత్యక్తరంగా ఉన్నది.

కవి భావప్రౌఢి పరికించండి:— "ఆనందానుభూతిన్ మనస్విని చిత్తమ్మున నింద్ర కార్ముకము వొల్పెన్ చిత్ర భావాకృతిన్". ఇది భావశబలతకు సహజమైన రూప కల్పనము. వ్యూహ—నుడికారపు సొంపు:— "తిరిగి చూచిన లేదట దివ్య కాంత యమర శిల్పము లో లీనమాయెనేమొ" "కమిపింతువు కనుమూసిన, గనిపింపవు కన్ను దెరచి కాంచిన యింతవ్, గనుకట్టు విద్దెలో నీ నేర్పును జూపెదొ........ "రమపప్ప గడిని నీదు సోగ కన్నుల నాకమారు చూచి పొమ్ము" అని ఐహిక వాసనా మలినముగాని ప్రేమను వెలువరిస్తున్నాడు. చాల పట్టులలో "ఆరిక్‌ల్ ఎలిమెంటు" ద్యోతకమగుచున్నది.

"నీవు మెచ్చని యీ రమణీయకమ్ము లడవిగాచిన వెన్నెల లగును సూవె, "నీ పదాంభోరుహమ్ము గన్నీటి ధురుల కడగజాలని మందభాగ్యడను నేను" ఇట్లా ఎన్నో ఉన్నవి.

కరుణారసంలో మాగిన యీ రచన మధుర స్మృతులను సహృదయుడైన పాఠకుని ఎదలో కలిగించును.

—శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-600001. Editor: S. Radhakrishna.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 210/-	రు. 180/-
2 లేక 3వ కవరుపేజి ఒకే (నలుపు) రంగు	...	రు. 180/-	రు. 150/-

లోపలి పేజీలు

పూర్తి పేజి	...	రు. 150/-	రు. 120/-
అర పేజి	...	రు. 78/-	రు. 66/-
పావు పేజి	...	రు. 48/-	రు. 42/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

	ఏజంటు ద్వారా	పోస్టులో
విడి ప్రతి	రు. 1-50	—
సంవత్సర చందా	రు. 18-00	19-20
6 మాసముల చందా	రు. 9-00	9-60

మేనేజరు, భారతి

మద్రాసు-600001.

BCL

KLVA104M117

అమృతాంజన్ లిమిటెడ్

75 సంవత్సరాల పైగా గృహౌషధములు తయారుచేస్తున్నవారు!

- అమృతాంజనం బాధానివారిణి
తలనొప్పి, ఒళ్ళునొప్పులు, బెణుకులు, జలుబు, దగ్గు, కండరాల నొప్పులకు.
- అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్
పసిబిడ్డల అజీర్ణానికి, పళ్ళు వచ్చేటప్పుడు కలిగే బాధలకు.
- అమృతాంజన్ డెర్మల్ అయింట్ మెంట్
తామర, తీట, గజ్జి వగైరాలకు.
- అమృతాంజన్ ఇన్‌హేలర్
జలుబుచేసి ముక్కుదిబ్బడ, తుమ్ములు వగైరాలకు.
- అనోలియమ్-కోల్డ్ రబ్
దగ్గు జలుబులను పారద్రోలే అమోఘమైన ఒక కొత్త శక్తి.
- శాలోఫెన్ -బాధానివారిణి మాత్రలు
తలనొప్పి, ఫ్లూ, ఒళ్ళు నొప్పులకు

...ఇండియాలోను, ఇతర దేశాలలోను పేరు పొందినవి.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు-4



పుస్తకం సంఖ్య	KLVA104M117
పుస్తకం పేరు	భారతి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	73
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	navya
స్కాన్ చేసినది	Akbar
పరీక్ష చేసినది	HEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good